అనుదినం... జనస్వరం
www.navatelangana.com
# నవతెలంగాణ
సోమవారం 08-4-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 | సంచిక : 98 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

## బీబీసీ ప్రసారాలు సమాప్తం
### గుజరాత్ డాక్యుమెంటరీ ప్రసారంతో కేంద్రం కక్షసాధింపు చర్యలు

- ఐటీ సోదాలు, వేధింపుల నేపథ్యంలో అసాధారణ నిర్ణయం
- 'కలెక్టివ్ న్యూస్‌రూమ్'కు ప్రసార లైసెన్సులు
- 26 శాతం వాటా కోసం కేంద్రానికి దరఖాస్తు




వివరాలు 13లో

## గెలుపే లక్ష్యంగా పని చేయండి

- సికింద్రాబాద్, వరంగల్ నియోజకవర్గాల నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి



**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**
రాష్ట్రంలో 14 పార్లమెంటు నియోజకవర్గాల గెలుపే లక్ష్యంగా పని చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. మన గురి తప్పకూడదని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు పరస్పరం సహకరించుకుంటున్నాయని చెప్పారు. ఆ రెండు పార్టీలను ఓడించేందుకు రెట్టింపు ఉత్సాహంతో కష్టపడి పని చేయాలన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని తన ...13లో

## మళ్లీ మోడీ వస్తే.. ప్రజాస్వామ్యమే ఉండదు


మాట్లాడుతున్న ప్రకాశ్ కరత్

### ఎన్నికల వేళ ప్రతిపక్షాలే లక్ష్యంగా దాడులు, అరెస్టులు

- దర్యాప్తు సంస్థల ద్వారా అణచివేతలు
- దేశాన్ని హిందుత్వ రాష్ట్రంగా మార్చే ప్రయత్నం
- వైస్రాయ్‌ల పాత్ర పోషిస్తున్న గవర్నర్లు: సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్ ఆగ్రహం
- మదురైలో పార్టీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

**మదురై :** కేంద్రంలో నరేంద్ర మోడీ, బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తే దేశంలో ప్రజాస్వామ్యమే ఉండదని సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు ప్రకాశ్ కరత్ చెప్పారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలు దేశ భవిష్యత్తును నిర్ణయిస్తాయని ఆయన అన్నారు. తమిళనాడులోని మదురై లోక్‌సభ నియోజకవర్గం నుండి పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెంకటేశన్‌కు మద్దతుగా ...13లో

## ఆప్‌ను ఖతం చేసేలా బీజేపీ కుట్ర

- కేజ్రీవాల్ అరెస్టుకు నిరసన.. సామూహిక నిరహార దీక్షలు



**నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో**
ఆమ్ ఆద్మీపార్టీ (ఆప్)ని అంతం చేయాలని బీజేపీ కుట్ర చేస్తోందని, అందులో భాగంగానే ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారని ఆ పార్టీ నేతలు ఆరోపించారు. కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా.. దేశవ్యాప్తంగా నిరసనలు.. సామూహిక నిరాహార దీక్షలు చేశారు. ఆదివారం దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఆందోళన నిర్వహించారు. ఢిల్లీ, పంజాబ్, మధ్యప్రదేశ్, గోవా, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, రాజస్థాన్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, హర్యానా, గుజరాత్, జార్ఖండ్, ...5లో

## జనజాతర కాదు.. హామీల పాతర

### న్యాయ్ పేరుతో నయా నాటకానికి తెరతీశారా : కేటీఆర్



**హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జనజాతర సభపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు చేశారు. అది జనజాతర సభ కాదని, హామీల పాతర.. అబద్ధాల జాతర సభ అంటూ ఫైర్ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీల పేరిట గారడి చేసిన రాహుల్ గాంధీ.. పార్లమెంట్ ఎలక్షన్లలో న్యాయ్ పేరిట నయా నాటకానికి తెరతీశారా అని ప్రశ్నించారు. తెలంగాణకు తీరని అన్యాయం చేసి.. ఇప్పుడొచ్చి న్యాయ్ అంటే నమ్మేదెవరని ఎక్స్ వేదికగా నిలదీశారు.

నమ్మి ఓటేసిన నాలుగుకోట్ల తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ పార్టీ నాలుగు నెలలుగా నయవంచన చేస్తున్నదని విమర్శించారు. అసత్యాలతో అధికారంలోకి వచ్చి అన్నదాతలను ఆత్మహత్యల పాల్జేస్తున్నదని, నేతన్నల బలవన్మరణాలకు కారణమవుతున్నదని ఆరోపించారు. గ్యారెంటీలకు పాతరేసి, ...5లో

## ఫ్యామిలీ ప్యాక్...




### బీజేపీలో నారీ శక్తికి చోటేది..?

- వారసత్వ రాజకీయాలకు కమలం పార్టీ ప్రాధాన్యత..
- మెజారిటీ మహిళా అభ్యర్థులది కుటుంబ నేపథ్యమే

సార్వత్రిక ఎన్నికలకు ముందు మహిళల ఓట్లు రాబట్టుకోవటానికి మోడీ ప్రభుత్వం పదేండ్లుగా పట్టించుకోని మహిళా రిజర్వేషన్లను తెరపైకి తెచ్చింది. నారీశక్తి అంటూ పలు పథకాలకు హంగులు దిద్దింది. వాస్తవానికి లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల విషయంలో మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించలేదని మహిళా సంఘాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. మరోవైపు కుటుంబపాలన చేస్తున్నాయని ప్రతిపక్షాలను విమర్శించే..బీజేపీ, మోడీ అండ్‌కో బరిలో దింపిన అభ్యర్థులను పరిశీలిస్తే..మోడీ వంశ రాజకీయాల జాబితా చాతాడంత ఉన్నదని స్పష్టమవుతోంది.

**న్యూఢిల్లీ :** రానున్న సార్వత్రిక ఎన్నికల కోసం బీజేపీ ఇప్పటి వరకూ 417 మంది అభ్యర్థులను ప్రకటించింది. వీరిలో కేవలం 68 మంది (16 శాతం) మంది మాత్రమే మహిళలు ఉన్నారు. అందులో కూడా సగం మందికి పైగా అభ్యర్థులు రాజకీయ కుటుంబాల నుంచి వచ్చిన వారే. బీజేపీ 2009 ఎన్నికల్లో 45 మంది, 2014లో 38 మంది, 2019 ఎన్నికల్లో 55 మంది మహిళా అభ్యర్థులను బరిలో నిలిపింది. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ పడుతున్న ప్రముఖ మహిళా నేతల్లో ప్రణీత్ కౌర్ (పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ భార్య), బన్సురీ స్వరాజ్ (సుష్మా స్వరాజ్ కుమార్తె), సీతా సొరేన్ (జేఎంఎం నేత శిబు సొరేన్ కోడలు), గీతా కోడా (జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి మధు కోడా భార్య), జ్యోతి మీర్ధా (మాజీ ఎంపీ నాథూరాం మీర్ధా మనుమరాలు), గాయత్రి సిద్ధేశ్వర (కేంద్ర మాజీ మంత్రి జీఎం సిద్ధేశ్వర భార్య), నవనీత్ రాణా (మాజీ ఎమ్మెల్యే రవి రాణా భార్య), మాళవికా దేవి (మాజీ ఎంపీ అర్క కేసరి దేవ్ భార్య), కృతిసింగ్ దేవ్‌వర్మ (తిప్రా మోతా పార్టీ వ్యవస్థాపకుడు ప్రద్యోత్ కిషోర్ మాణిక్య దేవ్‌వర్మ సోదరి) ఉన్నారు.

తాను రాజకీయ కుటుంబం నుంచే వచ్చానని సీతా సొరేన్ అంగీకరించారు. అయితే అది తన తప్పు కాదని చెప్పారు. నియోజకవర్గంలో క్షేత్ర స్థాయిలో ...5లో



### మాజీ రాజవంశీకులే...

రాజస్థాన్‌లో 2019 ఎన్నికల్లో బీజేపీ ముగ్గురు మహిళా అభ్యర్థులకు మాత్రమే టిక్కెట్లు ఇచ్చింది. రాబోయే సార్వత్రిక ఎన్నికల కోసం ఇప్పటి వరకు ఐదుగురు అభ్యర్థులను ప్రకటించింది. ఇందూ దేవి జాదవ్ (ధోల్‌పూర్ కరౌలి), ప్రియాంక బాలన్ (శ్రీగంగానగర్), మంజూ శర్మ (జైపూర్), ...5లో



## కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా నివేదిత?

- ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌తో కేటీఆర్, హరీశ్‌రావు మంతనాలు
- ఉగాది పండుగ తర్వాత అధికారికంగా ఖరారు

**హైదరాబాద్:** సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ స్థానం ఉప ఎన్నికకు బీఆర్ఎస్ అభ్యర్థిగా నివేదిత పేరు దాదాపు ఖరారైంది. కంటోన్మెంట్ బీఆర్ఎస్ నేతలతో అధినేత కేసీఆర్ ఇవాళ సమావేశమయ్యారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, లోక్‌సభ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, నివేదిత, క్రిశాంక్, గజ్జెల నగేష్ సహా ఇతర నేతలు సమావేశంలో పాల్గొన్నారు.

ఉప ఎన్నికకు సంబంధించిన అంశాలపై నేతలతో చర్చించిన కేసీఆర్.. వారికి దిశానిర్దేశం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కంటోన్మెంట్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన లాస్యనందిత రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ...13లో



## ఎండల వేళ.. నగరవాసులకు మెట్రో గట్టి షాక్..!

- కార్డులపై రాయితీలు రద్దు చేసిన మెట్రో
- సువర్ణ ఆఫర్‌తో మెట్రోకు పెరిగిన రద్దీ
- నగర ప్రయాణికులపై అదనపు భారం
- మెట్రోలో రోజూ 5లక్షల మంది ప్రయాణం

**నవతెలంగాణ-సిటీబ్యూరో**
నగరంలో అసలే ఎండలు మండిపోతున్నాయి. ఈ ఎండలకు కూల్ జర్నీ చేద్దామనుకున్న గ్రేటర్ ప్రయాణికులకు హైదరాబాద్ మెట్రో గట్టి షాకిచ్చింది. ఇప్పటివరకు మెట్రో ప్రయాణికులకు కార్డులపై ఇచ్చిన రాయితీలను పూర్తిగా రద్దు చేసింది. ప్రస్తుతం మెట్రో కార్డుపై 10శాతం రాయితీతో పాటు హాలీడే కార్డును పూర్తిగా రద్దు చేసినట్టు మెట్రో అధికారులు తెలిపారు. మెట్రో అధికారుల నిర్ణయంతో నగర ప్రయాణికులపై అదనపు భారం పడనుంది.హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ కరోనా తర్వాత మెట్రో ప్రయాణికులకు ఆకర్షించేందుకు ఎప్పటికప్పుడు కొత్త ఆఫర్ల ప్రకటిస్తూ వచ్చింది. దీంతో నగర ...5లో

## ప్రశ్నించే గొంతు పార్లమెంట్‌లో ఉండాలి

### రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేలా మోడీ విధానాలు

- సీపీఐ(ఎం) భువనగిరి అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలి : పార్టీ కేంద్రకమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు



**నవతెలంగాణ-చౌటుప్పల్**
రాష్ట్ర సమస్యలపై ప్రశ్నించే గొంతు పార్లమెంట్‌లో ఉండాలని, భువనగిరి పార్లమెంట్ సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ.జహంగీర్‌ను గెలిపించాలని ఆ పార్టీ కేంద్రకమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు పిలుపునిచ్చారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణకేంద్రంలోని కందాల రంగారెడ్డి ...13లో

## సూట్‌కేసులో కరెన్సీ కట్టలు..

### రూ. నాలుగు కోట్ల నగదుతో పట్టుబడిన బీజేపీ కార్యకర్త

- తమిళనాడులోని చెన్నై తాంబరం రైల్వే స్టేషన్‌లో పట్టుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్



**చెన్నై :** లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ తమిళనాడులో నగదు ప్రవాహానికి దారులు తెరుస్తున్నది. తమిళనాడు రాజధాని చెన్నైలోని తాంబరం రైల్వే స్టేషన్‌లో బీజేపీ కార్యకర్త సహా ముగ్గురు వ్యక్తులు రూ.4 కోట్ల నగదుతో పట్టుబడ్డారు. స్వాధీనం చేసుకున్న నగదును తదుపరి విచారణ నిమిత్తం ఆదాయపు పన్ను(ఐటీ) శాఖకు పంపినట్టు చెంగల్‌పట్టు జిల్లా ఎన్నికల అధికారి (డీఈవో) తెలిపారు. నిందితులు ...13లో

## లెక్క తీస్తాం...

### రాజకీయాలకు అతీతంగా విద్యుత్ సంస్థలపై విచారణ



- అవసరమైతే మాజీ సీఎం, మంత్రులనూ పిలుస్తాం
- మొదట రిక్వెస్ట్...కాదంటే సమన్లు
- బాధ్యులందరికీ నోటీసులు
- త్వరలో ప్రజాభిప్రాయసేకరణ
- వంద రోజుల్లో నివేదిక
- భద్రాద్రి, యాదాద్రి విద్యుత్కేంద్రాలు, ఛత్తీస్‌గఢ్ ఒప్పందంపై జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి న్యాయ విచారణ షురూ

**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**
భద్రాద్రి, యాదాద్రి విద్యుత్కేంద్రాల నిర్మాణం, ఛత్తీస్‌గఢ్ ఒప్పందంతో సంబంధం ఉన్నవారందరినీ విచారిస్తామని జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. వంద రోజుల్లో దీనిపై నివేదిక రూపొందించి ప్రభుత్వానికి ఇస్తామని చెప్పారు. పై విద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి సంబంధించి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కాంపిటీటివ్ బిడ్డింగ్‌కు వెళ్లకుండా నామినేషన్ల ప్రాతిపదికన పనులను కాంట్రాక్టర్లకు అప్పగించడం, ఛత్తీస్‌గఢ్ డిస్కంల నుంచి వెయ్యి మెగావాట్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందంపై న్యాయ విచారణ జరిపేందుకు పాట్నా హైకోర్టు రిటైర్డ్ చీఫ్ జస్టిస్ ఎల్ నరసింహారెడ్డిని 'కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ'గా నియమిస్తూ గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. బూర్గుల రామకృష్ణారావు భవన్‌లోని 7వ అంతస్తులో కమిషన్ ఆఫ్ ఎంక్వైరీకి కేటాయించిన కార్యాలయంలో ఆదివారం జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి న్యాయ విచారణ ప్రక్రియను ప్రారంభించారు. ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి, ట్రాన్స్‌కో, జెన్‌కో సంస్థల సీఎమ్‌డీ ఎస్ఏఎం రిజ్వీతో పాటు ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం అక్కడే నిర్వహించిన విలేకరుల సమావేశంలో ...5లో

## పట్టాలిచ్చేదాకా కదలం..

### గుడిసెల కూల్చివేత అప్రజాస్వామికం

- పేదలకు ఇండ్ల పట్టాలిచ్చి మాట నిలుపుకోవాలి
- కొట్లాడితేనే ఇండ్ల స్థలాలు సాధ్యం
- జీవించే హక్కును కాలరాస్తే సహించం: సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య
- సంగారెడ్డిలో గుడిసెలు కూల్చిన స్థలాల్ని పరిశీలించిన సీపీఐ(ఎం) బృందం


కూల్చిన ఇండ్లను పరిశీలిస్తున్న ఎస్. వీరయ్య

**నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి**
"రాష్ట్ర వ్యాప్తంగా ఇండ్లులేని పేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించి పట్టాలిచ్చే వరకు గుడిసెలేసుకున్న స్థలాల నుంచి కదిలే ప్రసక్తిలేదు. ప్రభుత్వ స్థలాల్లో నిరుపేదలు వేసుకున్న ఇండ్లను కూల్చివేయడం అప్రజాస్వామికం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం పేదలకు ఇండ్ల స్థలాలిచ్చి మాట నిలుపుకోవాలి. రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కును కాలరాస్తే సహించేది లేదు. పేదలంతా ఐక్యంగా కొట్లాడితే తప్ప ఇండ్ల స్థలాలు సాధించకోవడం సాధ్యం కాదు" అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. సంగారెడ్డి పట్టణంలోని ఓ ప్రభుత్వ స్థలంలో పేదలు వేసుకున్న గుడిసెల్ని అధికారులు కూల్చి వేసిన విషయం తెల్సుకున్న సీపీఐ(ఎం) బృందం ఆదివారం సందర్శించారు. పేదల్ని కలిసి ఇండ్ల స్థలాల పోరాటానికి ఎర్రజెండా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ ...13లో

## రేవంత్‌రెడ్డికి మంత్రులు సహకరించట్లేదు



- త్వరలో నల్లగొండ మంత్రులు, ఎమ్మెల్యేల తిరుగుబాటు : హరీశ్‌బాబు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన సొంత క్యాబినెట్‌లోని మంత్రులే సహకరించట్లేదనీ, అందుకే ఆయనలో అభద్రతాభావం పెరిగిపోయి పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు విమర్శించారు. కొద్దిరోజుల్లోనే నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు రేవంత్‌రెడ్డిపై తిరుగుబాటు చేయబోతున్నారని బాంబు పేల్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అధికారులు పట్టించుకోకపోవడంతో ఏనుగు దాడిలో ఇద్దరు రైతులు చనిపోయారన్నారు. ఇద్దరు మరణించినా కలెక్టర్, ఎస్పీ కూడా పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు.

గతంలోనూ పెద్దపులి దాడిలో పలువురు మరణించిన విషయాన్ని ప్రస్తావించారు. రాష్ట్రంలో ఏనుగు దాడిలో ఇద్దరు రైతులు చనిపోవడం బాధాకరమనీ, బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడంతో పాటు మహారాష్ట్ర ప్రభుత్వం మాదిరిగా రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## రైతులను విస్మరించి క్రికెట్‌ను ఎంజాయ్ చేస్తారా?



- ఉద్యోగాలపై చర్చకు సీఎం సిద్ధమా : రాణి రుద్రమ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఓపక్క పంటలెండి రైతులు ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోని సీఎం రేవంత్‌రెడ్డికి క్రికెట్ మ్యాచ్ చూసి ఎంజాయ్ చేయడానికి మాత్రం సమయం దొరికిందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ విమర్శించారు. ఉద్యోగాల కల్పనపై చర్చించేందుకు సిద్ధమా అని సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. పదేండ్ల కాలంలో దేశంలో ఐటీ, ట్రేడ్ సెక్టార్, మ్యాన్‌ఫాక్చరింగ్, హాస్పిటాలిటీ, పారిశ్రామిక రంగాల్లో ఉపాధి కల్పన పెరిగిందన్నారు. రైతులకు ఇస్తామన్న రూ.500 బోనస్, రూ.2 లక్షల రుణమాఫీ, రైతులకు, కౌలు రైతులకు ఇస్తామన్న పెట్టుబడి సాయం హామీలేమయ్యాయని ప్రశ్నించారు. 'రాహుల్ గాంధీ ప్రధాని అయితే, కాంగ్రెస్ మెజారిటీ స్థానాలు గెలిస్తే ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు ఇప్పుడిచ్చిన ఐదు గ్యారెంటీలు అమలు చేస్తారంట? ఇది అయ్యేపనేనా' అని ఎద్దేవా చేశారు. ముద్ర లోన్ల ద్వారా రాష్ట్రంలో దాదాపుగా 50 లక్షల మందికి రుణాలందించామన్నారు. 29 కోట్ల ప్రజలకు స్వయం ఉపాధి ద్వారా ఉద్యోగాలను మోడీ కల్పించారనీ, ఇది ఎంప్లాయిమెంట్ కాదా? అని ప్రశ్నించారు. హడ్కో నుండి రుణం తీసుకోకుండా ఒక్క ఇల్లు కట్టి చూపించాలని సీఎంకు సవాల్ విసిరారు. ఇన్నేండ్ల కాలంలో రాష్ట్రంలో ఒక్క బీసీని కూడా సీఎం చేయని కాంగ్రెస్ పార్టీకి తమను ప్రశ్నించే హక్కు లేదన్నారు.

## కేసీఆర్,హరీశ్ రావు మాటలన్నీ అబద్ధాలు

- పంటల నష్టంపై తప్పుడు ప్రచారాలు మానాలి
- రాష్ట్రానికి మంచి భవిష్యత్తునందిస్తాం : రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ డాక్టర్ జి చిన్నారెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీమంత్రి హరీశ్ రావు పంటల నష్టంపై శుద్ధ అబద్ధాలు మాట్లాడుతున్నారని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మెన్ డాక్టర్ జి చిన్నారెడ్డి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమిరెడ్డి కృపాకర్‌రెడ్డి ఆత్మీయ సన్మానం కార్యక్రమంలో చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో మహారాష్ట్ర, కర్ణాటక సహా తెలంగాణలో వర్షాలు అనుకున్న స్థాయిలో కురవకపోవడం వల్ల నదుల్లో నీళ్ల పారడం లేదనీ, బావులు, బోర్లు రీఛార్జ్ కాలేకపోయాయని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రెండు లక్షల ఎకరాల వరకు పంటలు ఎండిపోతే కేసీఆర్, హరీష్‌రావు పదింతలు సంఖ్య పెంచి 20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.పొలాలు ఎండిపోయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందన్న భరోసా రైతుల్లో ఉందన్నారు. కానీ రాజకీయ నిరుద్యోగులైన కేసీఆర్, హరీష్‌రావులు అనవసరంగా నానా హైరానా పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.




బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ మాధవిలత, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, సికింద్రాబాద్ గురుద్వార కార్యదర్శి జగన్మోహన్‌సింగ్, మైనార్టీ నేతలు పాల్గొన్నారు.

## డిస్‌క్వాలిఫై అంటూ మా ఎమ్మెల్యేను వేదికపై కూర్చోబెట్టుకున్నారు

- 'జనజాతర'పై బీఆర్ఎస్ నేతల ఫైర్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పార్టీ మారితే తక్షణమే డిస్‌క్వాలిఫై అయ్యేలా చట్టం తెస్తామని తుక్కుగూడ సభలో కాంగ్రెస్ అగ్రనేత వ్యాఖ్యానించడాన్ని బీఆర్ఎస్ నేతలు తప్పుపట్టారు. సభలో ఆయన ఆ మాటలు చెప్పేటప్పుడు తమపార్టీకి చెందిన ఎమ్మెల్యే అదే వేదికపై ఉన్నాడని ఎద్దేవా చేశారు. ఆదివారంనాడిక్కడి తెలంగాణ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జీ జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్, వీ నర్సింహారెడ్డి మాట్లాడారు. గతంలో అదే ఏరియాలో సభ పెట్టి అడ్డమైన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేశారని విమర్శించారు.

ఓ వైపు పార్టీ మారిన వారిని పక్కన కూర్చోబెట్టుకుని, మరోవైపు పార్టీ మారిన వారిని డిస్ క్వాలిఫై చేయాలని చట్టం తెస్తామని మాట్లాడుతుంటే నవ్వాలో ఏడవాలో అర్థంకావట్లేదన్నారు. కేసీఆర్ పై అడ్డగోలుగా మాట్లాడుతున్నారనీ, రాష్ట్రంలో పాలన చూసి ఆయన సలహాలు ఇస్తుంటే స్వీకరించే స్థితిలో కాంగ్రెస్‌పార్టీ లేదన్నారు. ఎర్రటి ఎండలో కేసీఆర్ రైతులను పరామర్శించేందుకు కరీంనగర్ వెళ్తే, సీఎం రేవంత్‌రెడ్డి ఐపీఎల్ మ్యాచ్ చూసేందుకు వెళ్ళాడనీ, రాష్ట్రంలో 2014 కంటే ముందు అరాచకాలు మళ్లీ మొదలయ్యాయని అన్నారు.

# పొలిటికల్ హీట్..!





- పార్లమెంట్ ఎన్నికలకు సరికొత్త వ్యూహాలు
- ఆత్మీయ సమ్మేళనాలు, ప్రచార ప్రణాళికలతో హడావుడి
- అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్
- 'మల్కాజిగిరి' సెగ్మెంట్ పరిధిలో వేడెక్కిన రాజకీయాలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో.. 'మల్కాజిగిరి' పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో ప్రధాన పార్టీలు తమ అభ్యర్థుల విజయం కోసం సరికొత్త వ్యూహాలతో ముందుకెళ్తున్నాయి. కొత్త ఒరవడితో ఆత్మీయ సమ్మేళనాలు, ప్రచార ప్రణాళికలను అమలు చేసే పనిలో పోటాపోటీగా వ్యవహరిస్తున్నాయి. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ ఇప్పటికే.. మల్కాజిగిరి పార్లమెంట్ స్థానానికి అభ్యర్థులను ప్రకటించాయి. కాంగ్రెస్ నుంచి వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునితా మహేందర్‌రెడ్డి, బీజేపీ నుంచి ఈటల రాజేందర్, బీఆర్ఎస్ నుంచి రాగిడి లక్ష్మారెడ్డి తలపడనున్నారు.

**ఎవరి వ్యూహం వారిదే..**

మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాన్ని ఎలాగైనా కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో కాంగ్రెస్ నాయకులు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. ప్రజల్లో పలుకుబడి ఉన్న నేతలతో ప్రత్యేకంగా మాట్లాడుతున్నారు. ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, తదితరులు పార్టీలో చేరగా.. ఇతర పార్టీల్లోని కీలక నేతలను చేర్చుకోవడం ద్వారా ప్రత్యర్థి పార్టీని బలహీనపర్చే పని మొదలు పెట్టారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌ను వీడి ఇతర పార్టీల్లో చేరిన నేతలను తిరిగి రప్పించే ప్రయత్నాలూ మొదలు పెట్టారు. మేడ్చల్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలను పెద్దఎత్తున చేర్చుకుంటున్నారు. మిగిలిన నియోజకవర్గాల్లో సైతం చేరికలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులతో బహిరంగ సభలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

**ప్రణాళికలు.. ఎత్తుగడలు..**

బీసీ నాయకుడు, మాజీ మంత్రి, మాజీ సీఎం కేసీఆర్‌పైనే యుద్ధం చేసి వచ్చిన ఈటల రాజేందర్‌ను పార్టీలో చేర్చుకుని టికెట్ కేటాయించిన బీజేపీ.. ఈసారి మల్కాజిగిరి సీటును కైవసం చేసుకోవడానికి అవసరమైన వ్యూహాన్ని రచిస్తోంది. అభ్యర్థి క్షేత్రస్థాయిలో పర్యటించి జనం మధ్యే ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. బీఆర్ఎస్ ముఖ్య నేతలను పార్టీలోకి ఆహ్వానించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి బీజేపీ కండువా కప్పుకున్నారు. ఇదే దారిలో మరికొందరు వెళ్లే అవకాశం కనిపిస్తుంది.

**బేటీలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్..**

రాష్ట్రంలో అధికారం కోల్పోవడంతో పార్టీ కార్యకర్తలు కొంత నిరుత్సాహానికి గురైనా.. లోక్‌సభ ఎన్నికలకు వారిని సన్నద్ధం చేసేందుకు నియోజకవర్గస్థాయి సమావేశాలు నిర్వహిస్తూ మేమున్నామంటూ రాష్ట్ర నాయకత్వం భరోసానిస్తోంది. కాన్ఫరెన్సులు, సమీక్షల ద్వారా అలర్ట్ చేస్తున్నారు. ఇప్పటికే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా భేటీలు నిర్వహించారు. మాజీ మంత్రి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం సెగ్మెంట్ పరిధిలో పర్యటిస్తూ క్యాడర్, కార్యకర్తలు, నాయకులకు దిశా నిర్దేశం చేస్తున్నారు.

**గెలుపే లక్ష్యంగా..**

గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలు సరికొత్త వ్యూహాలతో ముందుకెళ్తున్నాయి. లోకసభ స్థానం పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ముఖ్య నేతలతో సమావేశమవుతూ సమన్వయం చేసే పనిలో పడ్డాయి. ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి అమలు చేసిన పథకాలు, అభివృద్ధి పనులు, చేపట్టబోయే పనుల గురించి ఓటర్లకు వివరించాలని కాంగ్రెస్ క్యాడర్‌కు పిలుపునిస్తోంది. ఇదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ఇక బీజేపీ నేతలు.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రధాని మోడీ అందిస్తున్న సుస్థిర పాలన గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని సభలు, సమావేశాలు ఏర్పాట్లకు సిద్ధమవుతోంది. ఇలా ప్రధాన పార్టీల వ్యూహాలతో 'మల్కాజిగిరి' పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.

**ఇన్‌చార్జిల నియామకం**

మల్కాజిగిరి పార్లమెంట్‌పై స్పెషల్ ఫోకస్ పెట్టిన ప్రధాన పార్టీలు ఇన్‌చార్జీలను నియమించాయి. బీజేపీ ఇన్‌చార్జీని నియమించకపోయినా.. ఈటల రాజేందర్ అన్ని నియోజకవర్గాల్లోని, అందరు నాయకులను కలుస్తూ ప్రచార పర్వం కొనసాగిస్తున్నారు. ఇక కాంగ్రెస్ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును ఇన్‌చార్జి మంత్రిగా నియమించగా.. ఇటీవల మైనంపల్లి హనుమంతరావుకు సైతం అదనపు బాధ్యతలను అప్పగించింది. ఇక బీఆర్ఎస్ ఇటీవల మల్కాజిగిరి సెగ్మెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకుగాను ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో కో-ఆర్డినేటర్‌ను నియమించింది. మేడ్చల్‌కు ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, మల్కాజిగిరికి మాజీ జెడ్పీ చైర్మెన్ నందికంటి శ్రీధర్, కుత్బుల్లాపూర్‌కు బీఆర్ఎస్ సీనియర్ నేత గొట్టిముక్కల వెంగళరావు, కూకట్‌పల్లికి ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, ఉప్పల్‌కు పార్టీ రాష్ట్ర సెక్రెటరీ జహంగీర్ పాష, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు మాజీ చైర్మెన్, రావుల శ్రీధర్‌రెడ్డి, ఎల్బీనగర్‌కు ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తాను నియమించింది.

## భద్రాచలంలో బీఆర్ఎస్ సమన్వయ కమిటీ ఏర్పాటు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణ కోసం భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయ కమిటీని నియమిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు ఆదివారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. కమిటీ సభ్యులుగా పది మంది పార్టీ సీనియర్ నాయకులను నియమించారు. కమిటీలో రావులపాటి రాంప్రసాద్, తాండ్ర వెంకటరమణారావు, మానే రామకష్ణ, బోదెబోయిన బుచ్చయ్య, గుడవర్తి నరసింహమూర్తి, సాగిని శ్రీనివాసరాజు, కోటేరు శ్రీనివాసరెడ్డి, దొడ్డి తాతారావు, రమేష్ గౌడ్, సాదనపల్లి చిట్టిబాబు సభ్యులుగా ఉన్నారు.

## మోడల్ స్కూల్స్ అడ్మిషన్ టెస్ట్‌కు 81.80 శాతం హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఎస్ మోడల్ స్కూల్స్ అడ్మిషన్ టెస్ట్-2024కు 81.80 శాతం మంది హాజరయ్యారు. ఆరు నుంచి పదవ తరగతిలో ప్రవేశం కోసం అడ్మిషన్ టెస్ట్ రాసేందుకు 62,983 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఆదివారం నిర్వహించిన ప్రవేశపరీక్షకు 51,525 మంది హాజరయ్యారు. 11,457 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు రాసిన వారిలో బాలురు 28,665 మంది ఉండగా, 22,860 మంది బాలికలున్నట్టు మోడల్ స్కూల్స్ అడిషనల్ డైరెక్టర్ ఎస్.శ్రీనివాసాచారి ఒక ప్రకటనలో తెలిపారు.





# ఫోన్ ట్యాపింగ్ మొదటి బాధితుడ్ని నేనే

- నా కుటుంబసభ్యులు, డ్రైవర్, వంట మనిషి ఫోన్లనూ వదల్లేదు..
- నేను పార్టీ మారలే.. బీఆర్ఎస్ గెంటేస్తే బీజేపీ ఆదరించింది
- జర్నలిస్టుల ఇంటి, ఇతర సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలి : మీట్‌ది మీడియాలో మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్




నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఫోన్ ట్యాపింగ్ మొదటి బాధితుడ్ని తానేననీ, తన కుటుంబసభ్యులు, డ్రైవర్, వంట మనిషి, ఇంట్లో పనిచేసే వాళ్ల ఫోన్లను కూడా ట్యాప్ చేశారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ చెప్పారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, వ్యాపారులు, భార్యాభర్తల సంభాషణలనూ ట్యాపింగ్ చేసి బెదిరించడం దుర్మార్గమన్నారు. దీనివల్ల కాపురాలు కూలిపోయాయన్నారు. ప్రజాస్వామ్యంలో ఇది విచారించదగినదన్నారు. తాను బీఆర్ఎస్ పార్టీని వీడలేదని మెడలు పట్టి బయటకు పంపారని మరోమారు స్పష్టం చేశారు. బీజేపీ తనను ఆదరించి దగ్గరకు తీసుకున్నదని తెలిపారు. తెలంగాణలో 12 ఎంపీ స్థానాలను బీజేపీ గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో తెలంగాణ జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో మీట్ ది ప్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ..బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించకుండా కాంగ్రెస్‌లో చేర్చుకోవడాన్ని తప్పుబట్టారు. కేసీఆర్ ఎదుటి వ్యక్తులను మాట్లాడనీయకుండా నలుగురిలో అవమానించి పగబట్టేవారనీ, ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి కూడా అదే పని చేస్తున్నారని విమర్శించారు. ఏ పార్టీ నేతలైనా సరే పత్రికల్లో పతాక శీర్షికల్లో నిలవడం కోసం అవతలి వ్యక్తుల గుండెకు తగిలేలా, కించపరిచేలా మాట్లాడటం తగదని హితవు పలికారు. ధరణి పోర్టల్‌తో ఉత్పన్నమైన భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు ఎదురుచూస్తున్నారని, దానిపై రేవంత్‌రెడ్డి దృష్టి సారించాలని సూచించారు.

అడ్డదారిలో అధికారంలోకి వచ్చేందుకు ఆరు గ్యారెంటీల హామీలిచ్చారా? అవగాహన లేక ఇచ్చారా? అనేది కాంగ్రెస్ పార్టీ నేతలే చెప్పాలన్నారు. డిసెంబర్ తొమ్మిదో తేదీనే చేస్తామన్న రూ.2 లక్షల రుణమాఫీ, ఎకరాకు రూ.15వేలు, కౌలు రైతుకు రూ.12 వేలు హామీలేమయ్యాయని నిలదీశారు. తెలంగాణలో కాంగ్రెస్ ఒకవేళ 15 సీట్లు గెలిస్తారని భావించినా దేశంలో ఆ పార్టీకి 60 సీట్లు దాటవనీ, అలాంటప్పుడు కేంద్రంలో ఎలా అధికారంలోకి వస్తుందని ప్రశ్నించారు. 'చచ్చేవయస్సులో ఏం పోయేకాలం.. పార్టీ ఎందుకు మారుతున్నావనీ' పొన్నాల లక్ష్మయ్యను తిట్టిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఎంపీ కేశవరావును ఎందుకు తీసుకున్నారని నిలదీశారు. దళితుడే కాదన్న కడియం శ్రీహరి కుటుంబానికి వరంగల్ సీటు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. మల్కాజిగిరికి రాజేందర్‌కు ఏం సంబంధమని కాంగ్రెస్ నేతలు అనటం సరికాదనీ, తనను ఓడిస్తానంటున్న రేవంత్‌రెడ్డికి మల్కాజిగిరికి ఏం సంబంధమని నిలదీశారు. భవిష్యత్ సీఎం అనేది తన చేతుల్లో లేదనీ, అనుకోవడం కూడా సరిగాదనీ, అది ప్రజలు తమ తీర్పు ద్వారా తేల్చాలన్నారు.

ఉన్నత చదువులు చదివి కలాన్ని నమ్ముకుని బతుకుతున్న జర్నలిస్టు ఇండ్ల స్థలాలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తాను గెలిస్తే కేంద్రం అండతో మల్కాజిగిరికి అధిక నిధులు తెచ్చి అభివృద్ధి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్‌డబ్ల్యూజే ఉపాధ్యక్షులు పెద్దాపురం నర్సింహ, తెలంగాణ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కప్పర ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి బింగి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఐజీ ప్రభాకర్‌రావు కోసం వేట

- ఇంటర్‌పోల్ సహాయం కోరనున్న స్పెషల్ టీం?
- ఫోన్‌ట్యాపింగ్ కేసులో అప్రూవర్లుగా మారనున్న ఇద్దరు అధికారులు


నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

రాష్ట్రంలో కలకలం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో నిందితుడిగా అనుమానిస్తున్న ఎస్ఐబీ మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు కోసం ఇంటర్‌పోల్ సహాయం కోరాలని కేసు దర్యాప్తు జరుపుతున్న స్పెషల్ టీం అధికారులు యోచిస్తున్నట్టు తెలిసింది. ఇందుకోసం, న్యాయ నిపుణుల సలహాలను వారు తీసుకుంటున్నారని సమాచారం. రాష్ట్రంలో ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారం వెలుగు చూసిన కొద్ది రోజుల ముందు ప్రభాకర్‌రావు అమెరికాకు వెళ్లిన విషయం తెలిసిందే. ఆయనతో పాటు ఈ కేసులో మరో అనుమానితుడు ఒక ప్రయివేటు ఛానెల్ సీఈఓ శ్రవణ్ కుమార్ కూడా అమెరికాకు వెళ్లిన విషయం తెలిసిందే. కాగా, ఇప్పటి వరకు ఈ కేసులో జరిగిన దర్యాప్తులో అరెస్టయిన నిందిత అధికారులు.. తాము ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకే విపక్షాల ప్రముఖులకు చెందిన ఫోన్‌ట్యాపింగ్‌లకు పాల్పడినట్టు వాంగ్మూలం ఇచ్చారు. ఈ సమాచారాన్ని కోర్టుకు కూడా దర్యాప్తు అధికారులు రిమాండ్ రిపోర్టులో అందజేశారు.

కాగా, తాను క్యాన్సర్ చికిత్స కోసం అమెరికాకు వెళ్లినట్టు తనకు తెలిసిన కొందరు అధికారులకు ప్రభాకర్‌రావు తెలియజేసినట్టు కూడా వార్తలు వచ్చాయి. అయితే, కేసులో ఇప్పటి వరకు ఒక్కరొక్కరిగా డీఎస్పీ ప్రణీత్‌రావు, అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, మాజీ డిప్యూటీ కమిషనర్ రాధాకిషన్‌రావులు అరెస్టయ్యారు. కాగా, మరోవైపు ఫోన్‌ట్యాపింగ్‌లకు సంబంధించి ప్రతిపక్ష బీఆర్ఎస్, అధికార కాంగ్రెస్ పార్టీల నేతల మధ్య ఆరోపణ, ప్రత్యారోపణలు వాడీవేడిగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో వీలైనంత త్వరగా ప్రభాకర్‌రావును తీసుకొచ్చి విచారించటం ద్వారా ఈ కేసులో అసలు రహస్యాలను వెలుగులోకి తేవాలని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. అయితే, ఈ కేసు దర్యాప్తు సాగుతున్నదనీ, అందులో తన పేరు ప్రముఖంగా వినిపిస్తున్నదనీ, ప్రచార సాధనాల ద్వారా సమాచారం ఉన్నప్పటికీ.. ఇప్పటి వరకు నేరుగా ప్రభాకర్‌రావు ఎందుకు స్పందించటం లేదనే సందేహం దర్యాప్తు అధికారులను వేధిస్తున్నది. చికిత్స కోసం తాను అమెరికాకు వెళ్లినట్టు ఇతరత్రా సమాచారం ఉన్నప్పటికీ.. ఆయన కుటుంబ సభ్యుల ద్వారా కానీ, అమెరికా నుంచి నేరుగా ప్రభాకర్‌రావు నుంచి కానీ సమాచారం తమకు లేదని స్పెషల్ టీం అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభాకర్‌రావును విచారించటానికి ఎట్టిపరిస్థితుల్లోనూ ఆయనను ఇండియాకు రప్పించాల్సిన అవసరం ఉన్నదని అధికార వర్గాలు చెప్తున్నాయి.

ఈ నేపథ్యంలోనే ఇప్పటికే లుకౌట్ నోటీసులు ఆయన కోసం జారీ చేశామనీ, ఇక మిగిలింది ఇంటర్‌పోల్ సాయాన్ని కోరటమేనని స్పెషల్ టీం వర్గాలు చెప్తున్నాయి. దీనికి సంబంధించి న్యాయపరంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలని దర్యాప్తు అధికారులు న్యాయ నిపుణులను సంప్రదిస్తున్నట్టు తెలిసింది. ఇదిలా ఉంటే, ఈ కేసులో ఇద్దరు పోలీసు అధికారులు అప్రూవర్లుగా మారటానికి తమ సమ్మతిని దర్యాప్తు అధికారులకు తెలిపినట్టు తెలిసింది. ఇందులో ఒకరు ఇప్పటికే అరెస్టయిన అధికారి కాగా.. మరో అధికారిని విచారణ కోసం స్పెషల్ టీం అధికారులు నోటీసు ఇచ్చి పిలుస్తున్నట్టు సమాచారం. కాగా, రాధాకిషన్‌రావును నాలుగో రోజు కూడా అధికారులు ఫోన్‌ట్యాపింగ్ జరిగిన తీరు తెన్నులపై ప్రశ్నించారని సమాచారం.



# ప్రతిపక్షాల గొంతును అణచలేరు

## ఆప్ మంత్రి గోపాల్ రాయ్

### పుర్కాయస్థకు సంఘీభావం

### న్యాయానికి నిర్వచనం మారిపోయింది : ఏచూరి

### ఫాసిస్టు ప్రభుత్వంతో పోరాడుతున్నాం : రాజా



**న్యూఢిల్లీ :** న్యూస్‌క్లిక్ పోర్టల్ సంపాదకుడు ప్రబీర్ పుర్కాయస్థ అరెస్టుపై అమ్‌ఆద్మీ పార్టీ తొలిసారిగా స్పందించింది. ప్రస్తుతం జైలులో ఉన్న పుర్కాయస్థకు మద్దతుగా దేశ రాజధానిలో శనివారం జరిగిన సంఘీభావ సమావేశానికి ఆ పార్టీ నేతలు హాజరయ్యారు. గత సంవత్సరం అక్టోబరులో న్యూస్‌క్లిక్ పోర్టల్ వెబ్‌సైట్ పైన, దాని ఉద్యోగుల పైన జరిగిన దాడులను అమ్‌ఆద్మీ పార్టీ అప్పుడే నిరసించింది. తాజాగా జైలులో ఉన్న పుర్కాయస్థకు సంఘీభావం తెలిపింది.

పుర్కాయస్థను చాలా కాలంగా కస్టడీలో ఉంచడాన్ని ఆప్ ఢిల్లీ విభాగం కన్వీనర్, రాష్ట్ర మంత్రి గోపాల్ రాయ్ తప్పుపట్టారు. సంఘీభావ సమావేశంలో ఆయన వామపక్ష నేతలతో కలిసి వేదికను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ కోద్ది రోజుల్లో తెలుస్తుంది బందీఖానా జైలు గోడల మధ్యనా..బయటనా..బందీలు అరెస్టు చేయబడి జైళ్లలో ఉన్నవారా..లేక బయట ఉన్న వారా అని..రాయ్ అన్నారు.

భారత్‌పై అంతర్జాతీయ పరిణామాలు చూపుతున్న ప్రభావంపై వీడియోలు రూపొందించినందుకు ఆయన పుర్కాయస్థను కొనియాడారు. ప్రత్యామ్నాయ మీడియా అనేది విప్లవానికి మాధ్యమం అని న్యూస్‌క్లిక్‌పై జరిగిన దాడులు నిరూపించాయని గోపాల్ రాయ్ చెప్పారు. 'ఈ విషయం కొందరికే తెలుసు. ఐదు సంవత్సరాల క్రితం ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పిన వారందరినీ అణచివేసి ఈడీ భయోత్పాతాన్ని సృష్టించింది. అయితే ఇలాంటి సామాజిక ఉద్యమాలకు ప్రతిపక్షాలు మద్దతు ఇస్తాయన్న విషయాన్ని వారు గుర్తించారు. ప్రతిపక్షాలకు అడ్డుకట్ట వేయకపోతే వాటి గొంతు మరింత పెరుగుతుందని వారికి అర్థమైంది. దేశ రాజధానిలో ప్రవేశించకుండా రైతులను నిలువరించడానికి రోడ్లపై సూదులు వేసినా వెరవకుండా అన్నదాతలు ఎంతగా గళం విప్పారో అంతకంటే ఎక్కువగానే ప్రతిపక్ష నేతలు ధ్వజమెత్తుతారన్న విషయం వారికి బాగా తెలుసు' అని రాయ్ అన్నారు. సీపీఐ(ఎం) సభ్యురాలు బృందాకరత్ మాట్లాడుతూ మోడీ హయాంలో నిరంకుశ ధోరణి పెరిగిపోయిందని విమర్శించారు.

**దేశాన్ని కాపాడుకోవాలి : ఏచూరి**



దేశంలో న్యాయానికి నిర్వచనం మారిపోయిందని సీపీఐ (ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి వ్యాఖ్యానించారు. నేరం రుజువయ్యే వరకూ అమాయకుడేననేది గతమని, అమాయకత్వాన్ని నిరూపించుకునేంత వరకూ తప్పు చేసిన వాడివేనన్నది ఇప్పటి అర్థమని చెప్పారు. 'అత్యవసర పరిస్థితి సమయంలో మేము ఎలా పోరాడి దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించామో ఇప్పుడు మనం నియంతృత్వాన్ని, ఫాసిస్టు ధోరణిని ఓడించి భవిష్యత్తులో మరింత మెరుగైన భారతావనిని నిర్మించాల్సిన అవసరం ఉన్నదని, తద్వారా దేశాన్ని కాపాడుకోవాలని ఏచూరి పిలుపునిచ్చారు.

**వారి ఏలుబడిలో ఇలాంటి చట్టాలే వస్తాయి : రాజా**



సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రసంగిస్తూ ఇప్పుడు మనం ఫాసిస్టు ప్రభుత్వంతో పోరాడుతున్నామని చెప్పారు. వారు అధికారంలో ఉన్నంతకాలం ఉపా వంటి క్రూరమైన చట్టాలను ఆమోదిస్తూనే ఉంటారని తెలిపారు. చరిత్రకారుడు రోమిలా థాపర్ పంపిన సందేశాన్ని పుర్కాయస్థ భాగస్వామి, రచయిత గీతా హరిహరన్ చదివి వినిపించారు.

# బీజేపీని ఒక్క సీటు గెలవనీయం

## మతోన్మాద, కార్పొరేట్ విధానాల పట్ల తీవ్ర వ్యతిరేకత

- మతాన్ని రాజకీయ అస్త్రంగా వాడుతున్న మోడీ
- బీజేపీ చేసిన విధ్వంసానికి ఈ ఎన్నికల్లో ప్రజలు చరమగీతం పాడాలి
- విపక్షాలను కలుపుకుపోయే బాధ్యత కాంగ్రెస్‌దే : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య
- జహంగీర్ గెలుపు కోసం లక్ష రూపాయల సహాయం



మాట్లాడుతున్న ఎస్. వీరయ్య

**నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి**

రాష్ట్రంలో బీజేపీని ఒక్క ఎంపీ సీటు కూడా గెలవనీయబోమని, బీజేపీని ఓడించేందుకు విపక్షాలను కలుపుకుపోయే బాధ్యత కాంగ్రెస్‌దేనని, అలాంటి ప్రయత్నం ఆ పార్టీ నుంచి కనిపించడంలేదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో నిర్వహించిన సీపీఐ(ఎం) జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ అనుకూల విధానాల పట్ల దేశ వ్యాప్తంగా తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతుందన్నారు. పదేండ్ల బీజేపీ పాలనలో చేసిన విధ్వంసానికి ఈ ఎన్నికల్లో దేశ ప్రజలు తగిన గుణపాఠం నేర్పి చరమగీతం పాడాల్సిన అవసరముందన్నారు. రాజ్యాంగాన్ని మార్చేసి ఆ స్థానంలో మనుధర్మాన్ని తీసుకొచ్చి ఫ్యూడల్ భావజాలం వైపు తీసుకుపోయేందుకు బీజేపీ కుట్ర చేస్తుందని తెలిపారు. కుల, మత, ప్రాంతీయ, భాషా విద్వేషాలను రెచ్చగొట్టి, మతాన్ని రాజకీయ అస్త్రంగా వాడుకుని ఎన్నికల్లో మోడీ లబ్ధిపొందాలని చూస్తున్నారన్నారు. ఎన్నికల్లో ప్రజా సమస్యల్ని ప్రస్తావించాల్సిన ప్రధాన మంత్రి రాముని గుడి పేరిట మత భజన చేయడం దుర్మార్గమైన ధోరణి అన్నారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ అసమానతలతో కూడిన దేశంగా భారత్ ఉందని, ఇది బ్రిటీష్ కాలం కంటే అధికమైందని ప్రపంచ మేధావులు ఘోషిస్తున్నారన్నారు. వంద కోట్ల మంది భారతీయులు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నరంటూ ఐక్య రాజ్య సమితి పేర్కొన్నదంటే మన పాలకుల చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతోందని తెలిపారు. ధరల పెరుగుదల వల్ల ప్రజల కొనుగోలు శక్తి పడిపోయిందని, నిరుద్యోగ సమస్య తీవ్రమవుతుందన్నారు. బీజేపీని ఓడించేందుకు దేశవ్యాప్తంగా విపక్షాలు ఐక్యమై ఇండియా కూటమిగా ఏర్పడిందన్నారు. ప్రజలకు ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల పాలనలో ప్రజా సమస్యల పరిష్కారం అంతంత మాత్రమేనన్నారు. ఇండ్లు లేని పేదలకు ఇండ్ల స్థలాలిస్తామని హామీ ఇచ్చి ఏ ఒక్కరికి కూడా పట్టాలివ్వలేదన్నారు. పైగా వేసుకున్న గుడిసెల్ని కూల్చి కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన నిఖరంగా నిలబడి పోరాడే సీపీఐ(ఎం) పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తుందన్నారు. సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ జహంగీర్ గెలుపునకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. సంగారెడ్డి సీపీఐ(ఎం) జిల్లా కమిటీ తరపున జహంగీర్ గెలుపు కోసం లక్ష రూపాయల్ని సహాయంగా అందజేయడం అభినందనీయమన్నారు.

**సామాజిక ఉద్యమాలను బలపర్చండి: చుక్క రాములు**

సామాజిక ఉద్యమాలను బలపర్చాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు పిలుపునిచ్చారు. కార్మికోద్యమ నేత బీటీ రణదీవె వర్థంతి ఏప్రిల్ 6 నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సామాజిక సంఘీభావ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళిత, బహుజన, మైనార్టీల సమస్యల్ని పరిష్కరించకుండా కేవలం వారిని ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే వాడుకుంటున్నాయన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దళిత, గిరిజన, మైనార్టీలకు నష్టం చేసేలా భారత రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చేందుకు కుట్ర చేస్తోందని తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల కోసం పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జి.జయరాజ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.రాజయ్య, బి.మల్లేశం, ఎ.మాణిక్యం, రామచంద్రం, జిల్లా కమిటీ సభ్యులు నర్సింహులు, ఎం.యాదగిరి, యాదవరెడ్డి, ప్రవీణ్‌కుమార్, విద్యాసాగర్, రేవంత్‌కుమార్, మహిపాల్, పాండురంగారెడ్డి నాయకులు నాగేశ్వర్‌రావు, అశోక్, కృష్ణ, రమేష్‌గౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీ పొత్తుతో పుదుచ్చేరికి ఎలాంటి ప్రయోజనం లేదు

**పుదుచ్చేరి:** పుదుచ్చేరి పాలక పార్టీ ఎఐఎన్ఆర్‌సి, బీజేపీతో పొత్తుతో పుదుచ్చేరికి ఎలాంటి ప్రయోజనం లేదని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం సాధిస్తే.. కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరికి రాష్ట్ర హోదా కల్పిస్తామని స్పష్టం చేశారు. బీజేపీతో పొత్తుతో పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్. రంగసామి రాష్ట్ర హోదా, పాలనా హక్కుల విషయంలో రాజీపడ్డారని అన్నారు. పుదుచ్చేరి లోక్‌సభ స్థానంలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి వి. వైతిలింగంకు మద్దతుగా ఆదివారం నిర్వహించిన భారీ బహిరంగ సభలో స్టాలిన్ పాల్గొ న్నారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ.. రంగసామి పూర్తిగా బీజేపీకి, కేంద్ర ప్రభుత్వానికి లొంగిపోయారని, ఆయన బిజెపికి 'డమ్మీ'గా మిగిలారని అన్నారు.

# అనంత్‌నాగ్‌లో ఆజాద్‌పై మెహబూబా పోటీ

- కాశ్మీర్‌లో 3 స్థానాల్లో పీడీపీ పోటీ
- జమ్ములో రెండు స్థానాల్లోనూ కాంగ్రెస్‌కు మద్దతు



**శ్రీనగర్ :** పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ అధినేత మెహబూబా ముఫ్తీ లోక్‌సభ ఎన్నికల్లో అనంత్‌నాగ్ - రాజౌరీ స్థానం నుంచి డీపీఏపీ అధ్యక్షులు గులాం నబీ ఆజాద్‌పై పోటీ చేయనున్నారు. ఈ స్థానంతో సహా జమ్ముకాశ్మీర్‌లోని మూడు స్థానాలకు పీడీపీ తమ అభ్యర్థులను ప్రకటించింది. పార్టీ యువ విభాగం అధ్యక్షులు వాహీద్ పర్రా శ్రీనగర్ నుంచి రాజ్యసభ మాజీ సభ్యులు మీర్ ఫయాజ్ బారాముల్లా లోక్ సభ స్థానం నుంచి పోటీ చేయనున్నట్లు పీడీపీ పార్లమెంటరీ బోర్డు చీఫ్ సర్తాజ్ మండి ఆదివారం చెప్పారు. అయితే కాశ్మీర్‌లోయలో మీకు కాంగ్రెస్ మద్దతు ఇస్తుందా అని ప్రశ్నించగా..తాము జాతీయ పార్టీ నుంచి క్విడ్ ప్రోకో తరహాలో మద్దతు ఆశించడం లేదని, భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునే పోరాటంలో భాగంగానే జమ్ములో కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నామని పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ తెలిపారు.

# కేజ్రీవాల్‌ను బేషరతుగా విడుదల చేయాలి

## ఆప్ సామూహిక నిరాహారదీక్ష

### కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ, ఆర్ఎస్పీ మద్దతు



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

**నవతెలంగాణ బ్యూరో**
**ముషీరాబాద్ - హైదరాబాద్**

ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను బేషరతుగా విడుదల చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసనల్లో భాగంగా ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని ధర్నాచౌక్ వద్ద సామూహిక నిరాహారదీక్ష చేపట్టారు. ఈ దీక్షకు కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ, ఆర్ఎస్పీ పార్టీలు మద్దతు తెలిపాయి. కేజ్రీవాల్ అరెస్టు కేవలం ప్రతిపక్షాల ప్రశ్నించే గొంతులను అణచివేయడంలో భాగమేనని ఆయా పార్టీల నేతలు విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే, సీపీఐ(ఎం) కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ కేజ్రీవాల్‌ను ఏదో ఒక విధంగా లొంగదీసుకోవాలని బీజేపీ మొదట్నుంచి ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. వివిధ రూపాల్లో ఢిల్లీ ప్రభుత్వ అధికారాలను తగ్గిస్తూ నిర్వీర్యం చేస్తున్నదని తెలిపారు. అయినప్పటికీ ఆప్ రోజు రోజుకు బలపడుతుండటంతో ఢిల్లీ లిక్కర్ స్కాం పేరుతో అరెస్టు చేశారని చెప్పారు. మోడీ విధానాలను వ్యతిరేకించే కేజ్రీవాల్ డబ్బుల కోసం కక్కుర్తి పడే ప్రసక్తే లేదన్నారు. ఇండియా కూటమి ఏర్పాటు, నాలుగైదు రాష్ట్రాల్లో బీజేపీకి వ్యతిరేకంగా ప్రభావం చూపించగల సత్తా ఆప్‌కు ఉండటంతో కేజ్రీవాల్‌ను జైలుకు పంపించారన్నారు. ఈడీ, సీబీఐ బీజేపీ జేబు సంస్థలుగా, అదానీ, అంబానీలు ఏటీఎంలుగా మారారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు వ్యతిరేక చట్టాలు తెచ్చి, జీఎస్టీతో సామాన్యులు, మధ్య తరగతిని దోచుకున్న మోడీ మనిషేనా? అని ప్రశ్నించారు. ప్రధానికి ఉండాల్సిన అర్హతలు మోడీకి లేవని విమర్శించారు. ప్రజలను మోసగించి మరోసారి అధికారంలోకి రావాలని మోడీ ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారని హెచ్చరించారు. రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు, ప్రజాస్వామ్య పరిరక్షణకు అందరం ఒక్కటిగా కదులుదామని తెలిపారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ కేజ్రీవాల్‌ను నేరుగా ఎదుర్కోలేక ఈడీ, సీబీఐలను అడ్డుపెట్టుకుని అక్రమ అరెస్టు చేశారని విమర్శించారు. బీజేపీ అవినీతికర ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారం బయటికి రావడంతో దానిపై చర్చను దారి మళ్లించేందుకే ఈ చర్య చేపట్టారని తెలిపారు. పదేండ్లుగా చేసిన అభివృద్ధి ఏమి లేకనే భావోద్వేగాలను రెచ్చగొట్టి మళ్లీ అధికారంలోకి రావాలని మోడీ ప్రయత్నిస్తున్నారని చెప్పారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాలమల్లేశ్ మాట్లాడుతూ మతోన్మాద వ్యతిరేక పోరాటంలో అందరం భాగస్వా ములవుదామని పిలుపునిచ్చారు. ప్రశ్నించే గొంతులను నొక్కేస్తూ 400 సీట్లు తెచ్చుకు నేందుకు మోడీ కుట్ర చేస్తున్నారని విమర్శి ంచారు. ఆర్ఎస్పీ తెలుగు రాష్ట్రాల కార్యద ర్శి జానకి రాములు మాట్లాడుతూ రామజ పం చేస్తున్న మోడీ మనువాద రాజ్యాన్ని నడిపిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తూ ఇచ్చిన హామీల ను అమలు చేయకుండా ఎన్నికల వేళ చర్చను దారి మళ్లిస్తున్నారని తెలిపారు.

**ఎదురొడ్డిన కేజ్రీవాల్‌కు భయపడ్డ మోడీ**

మనువాద బీజేపీ భావజాలానికి ఎదురొడ్డి నిలబడ్డ కేజ్రీవాల్ ను చూసి ప్రధాని మోడీ భయపడి జైళ్లో వేశారని దిడ్డి సుధాకర్ విమర్శించారు. ఢిల్లీ మద్యం కేసులో నిందితులు శరత్ చంద్రారెడ్డి ఎనిమిది సార్లు తాను కేజ్రీవాల్ ను కలవలేదని చెప్పారని గుర్తుచేశారు. తొమ్మిదో సారి కేజ్రీవాల్ ను కలిశానని చెప్పిన ఆయనకు బెయిల్ మంజూరైందనీ, వెంటనే అతన్నుంచి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో బీజేపీకి రూ.50 కోట్లు వెళ్లాయని తెలిపారు. ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న బీజేపీకి బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

**సీఎం విధులు నిర్వర్తిస్తే అరెస్టు చేస్తారా?**

సీఎంగా విధులు నిర్వర్తించిన అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడాన్ని ప్రముఖ న్యాయవాది, ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు సొలొమోన్ రాజు తప్పుపట్టారు. ముఖ్యమంత్రిగా కేజ్రీవాల్ రూపొందించిన మద్యం విధానంతో రాష్ట్ర ఆదాయం పెరిగిందని తెలిపారు. ఏ చట్టం కింద శరత్ చంద్రారెడ్డిని అప్రూవర్‌గా అనుమతించారని ప్రశ్నించారు. ఈడీ దగ్గర కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యాధారాలు లేవని తెలిపారు. విధాన రూపకల్పనే నేరమైతే దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఈడీ అరెస్టు చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఎలక్టోరల్ బాండ్లు చట్ట విరుద్ధమంటూ సుప్రీంకోర్టు ప్రకటించిందనీ, అయినా కేసులెందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. ఈ ధర్నాలో ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాముగౌడ్, ఎం.ఎ.మాజీద్, మహిళా విభాగం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హేమ జిల్లోజు, నర్సింగ్ యమున గౌడ్, అధికార ప్రతినిధి జావేద్ షరీఫ్, వికలాంగుల విభాగం కన్వీనర్ దర్శనం రమేష్, యువజన విభాగం అధ్యక్షులు విజయ్ ముల్లంగి తదితరులు పాల్గొన్నారు.

# గుజరాత్ మోడల్ కాదు..ద్రవిడ మోడల్ కావాలి

## కమల్‌హాసన్



**చెన్నై :** గుజరాత్ మోడల్‌ని వదిలి, దేశం ఇప్పుడు ద్రవిడ మోడల్‌ను అనుసరించాలని ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) అధ్యక్షుడు కమల్‌హాసన్ ప్రజలకు పిలుపునిచ్చారు. డిఎంకె దక్షిణ చెన్నై అభ్యర్థి తమిళచ్చి తంగపాండియన్‌కు మద్దతుగా మైలాపూర్‌లో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించి, నెలకు రూ.వెయ్యి నగదు పొందితే ఎంత బాగుంటుంతో ఆలోచించాలని ప్రజలకు సూచించారు. గుజరాత్ మోడల్‌తో దేశంలో పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం, నియంతృ త్వం పెరిగిపోయాయన్నారు. భారతదేశం ద్రవిడ నమూనాను అనుసరిస్తే మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. చిన్న తరహా వ్యాపారాలు దెబ్బతినడంతో.. మహిళలు పనులకు వెళ్లేందుకు ఉచిత బస్సు ప్రయాణం కొంతమేర సహాయపడిందని తెలిపారు. సిఎఎతో రాజ్యాంగంపై దాడి జరుగుతోందని, దీంతో ఇప్పుడు మన హక్కులను మనం సాధించుకోవాలని అన్నారు.

# ఐదేండ్లలో 30 రెట్లు

## అమాంతం పెరిగిన బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య ఆస్తులు

- 2019లో రూ.14 లక్షలు..2024కు రూ.4 కోట్లు
- ఇవన్నీ కూడా చరాస్తులే

### కారు, రుణం లేని బీజేవైఎం జాతీయాధ్యక్షుడు

### అఫిడవిట్‌లో వెల్లడించిన బెంగళూరు సౌత్ ఎంపీ



**బెంగళూరు:** కర్నాటక బీజేపీ ఎంపీ, ఆ పార్టీ యువమోర్చా జాతీయాధ్యక్షుడు తేజస్వి సూర్య ఆస్తులు అమాంతం పెరిగాయి. గత ఐదేండ్లలో దాదాపు 3,000 శాతం ఎగబాకాయి. 2019 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా దాఖలు చేసిన అఫిడవిట్ ప్రకారం ఆయన దాదాపు రూ. 14 లక్షల ఆస్తులను కలిగి ఉన్నాడు. అయితే, అది 2024 నాటికి దాదాపు రూ. 4 కోట్లకు పెరిగింది. గురువారం నామినేషన్‌తో పాటు దాఖలు చేసిన సూర్య ఎన్నికల అఫిడవిట్‌లో ఈ వివరాలు వెల్లడయ్యాయి. ఐదేండ్ల క్రితం ఎలాంటి పెట్టుబడులు లేకుండా ఉన్న ఆయన ఆస్తులు.. ప్రస్తుతం దాదాపు 26 మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్‌మెంట్స్ ద్వారా పెరిగాయి.

తేజస్వీ సూర్య.. బెంగళూరు, ఢిల్లీ, చెన్నైలలో కార్యాలయాలను కలిగి ఉన్న ట్రస్ట్ లో వ్యవస్థాపక భాగస్వామి. సంస్థను 2019 ప్రారంభంలో స్థాపించబడినప్పటి నుంచి అది విస్తరించిందనీ, దీనికి ఆరుగురికి పైగా భాగస్వాములు, 50 మంది అసోసియేట్‌లు, విస్తరిస్తున్న ఖాతాదారులను కలిగి ఉన్నారని దక్షిణ బెంగళూరు ఎంపీ సహచరుడు ఒకరు తెలిపారు. 2019కి ముందు.. సూర్య కర్నాటక మాజీ అడ్వకేట్ జనరల్(ఏజీ) అశోక్ హరన్‌హల్లి కార్యాలయంలో లా అసోసియేట్‌గా పనిచేశారు.

**'కార్లు లేవు.. అప్పుల్లేవు'**

సూర్య అనేక మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టినట్టు ఆయన ఎన్నికల అఫిడవిట్‌లో చూపించారు. అతని మ్యూచువల్ ఫండ్స్(ఎంఎఫ్) పోర్ట్‌ఫోలియోలో ప్రైవేట్ బ్యాంక్‌లు, కంపెనీలు ఉన్నాయి. ఆయన ఎంఎఫ్ పోర్ట్‌ఫోలియో గతనెల 27 నాటికి రూ. 1.99 కోట్లుగా ఉన్నది. అలాగే, దాదాపు రూ. 1.79 కోట్ల విలువైన షేర్లను కలిగి ఉన్నాడు. బీఎస్ఈ, తేజస్ నెట్‌వర్క్స్, గ్లెన్‌మ్ ఫార్మా, ఇండస్ టవర్స్, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, జగ్‌సన్‌పాల్ ఫార్మా మొదలైన వాటిలోనూ ఆయన వాటాదారుగా ఉన్నాడు.

**అవి చరాస్తులు మాత్రమే..!**

తేజస్వీ సూర్య.. సంపన్న భారతీయుడైన ముఖేశ్ అంబానీ నేతృత్వంలోని నెట్‌వర్క్ 18 మీడియా అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్‌లో గరిష్టంగా 30,000 షేర్లను కలిగి ఉన్నాడు. దీని విలువ రూ. 26,65,500గా ఉన్నది. 'చరాస్తుల విలువ' మాత్రమే రూ. 4,10,30,489.95గా ఉన్నదనీ, తన పేరుతో ఎలాంటి ఆస్తి, వాణిజ్య ఆస్తులు, వాహనాలు, రుణాలు లేవని బీజేపీ ఎంపీ ప్రకటించారు. తేజస్వీ సూర్యపై మూడు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

**కర్నాటకలో సంపన్న ప్రజాప్రతినిధులు**

దేశంలోనే కర్నాటక సంపన్నులైన ప్రజా ప్రతినిధులను కలిగి ఉన్నది. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు డి.కె శివకుమార్ రూ.1,413 కోట్ల ఆస్తులతో భారత్‌లోనే అత్యంత ధనిక ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన తర్వాత దేశంలోనే రెండో, మూడో అత్యంత సంపన్న ఎమ్మెల్యేలు కూడా కర్నాటకకు చెందినవారేనని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) డేటా వెల్లడించింది. రాష్ట్రానికి చెందిన స్వతంత్ర ఎమ్మెల్యే కె.హెచ్ పుట్టస్వామిగౌడ ఆస్తులు రూ.1,267 కోట్లుగా ప్రకటించారు. మాజీ మంత్రి ఎం.కృష్ణప్ప కుమారుడు ప్రియకృష్ణ ఆస్తులు రూ.1,156 కోట్లుగా ఉన్నాయి. దేశంలోని అత్యంత సంపన్న ఎమ్మెల్యేల టాప్-20 జాబితాలో కర్నాటక నుంచే 12 మంది ఉన్నారు.

కర్నాటక మాజీ ముఖ్యమంత్రి హెచ్.డి. కుమారస్వామి కుటుంబ ఆస్తులు గత ఐదేండ్లలో రూ.27 కోట్లు పెరిగాయి. అతని భార్య కొడుకుతో సహా కుటుంబం మొత్తం ఆస్తులు రూ.217 కోట్లుగా ఉన్నాయి. అలాగే, 20 ఆవులు, 50కి పైగా గొర్రెలు కూడా ఉన్నట్టు మాజీ సీఎం వివరించారు. బీజేపీ అభ్యర్థిగా ఎన్నికల రాజకీయాల్లోకి వచ్చిన ఆయన బావ, జయదేవ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్డియోవాస్కులర్ సైన్సెస్ మాజీ డైరెక్టర్ డాక్టర్ సి.ఎన్. మంజునాథ్ ఆస్తుల విలువ రూ.98.38 కోట్లుగా ఉన్నది. శివకుమార్ సోదరుడు డి.కె. సురేశ్ తన ఆస్తులు రూ. 593 కోట్లుగా ప్రకటించారు. అంటే, 2019 నుంచి 75 శాతం వృద్ధిని నమోదు చేశారు.

# అధికారులకు తీహార్ సవాల్

## వీవీఐపీ ఖైదీలు పెద్ద ఇబ్బంది | వారిని చాలా జాగ్రత్తగా ఉంచాలి

### ఢిల్లీ మాజీ పోలీసు కమిషనర్ నీరజ్ కుమార్ సూచన




**న్యూఢిల్లీ :** ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఇటీవలే తరలించిన ప్రసిద్ధ జైలు తీహార్‌లోని వీవీఐపీ ఖైదీలు అధికారులకు పెద్ద ఇబ్బంది అని ఢిల్లీ మాజీ పోలీసు కమిషనర్ నీరజ్ కుమార్ చెప్పారు. ఖైదీల మధ్య ఇతర దాడుల కారణంగా వారిని సురక్షితంగా ఉంచాలని తెలిపారు. గతంలో ఈయన జైళ్ల డైరెక్టర్ జనరల్‌గా కూడా పనిచేశారు. తీహార్ జైలులో తన పదవీకాలంలో గరిష్ఠ సంఖ్యలో వీవీఐపీలను చూసుకున్నానని చెప్పారు. "గరిష్ఠ సంఖ్యలో వీవీఐపీలను చూసుకునే ప్రత్యేక హక్కు నాకు ఉన్నది. కామన్వెల్త్ గేమ్స్ కుంభకోణం జరిగిన సమయంలో సురేశ్ కల్మాడీ, కనిమొళి, ఏ రాజా (2జీ స్పెక్ట్రమ్ స్కామ్), రిలయన్స్, సీడబ్ల్యూజీ, అమర్‌సింగ్‌ల నుంచి ఐఏఎస్ అధికారులు, ఐపీఎస్ అధికారులు కూడా ఇందులో ఉన్నారు" అని ఆయన తెలిపారు.

కేజ్రీవాల్‌తో పాటు ఆయన పార్టీకి చెందిన కీలక నాయకులు, మాజీ మంత్రులు సత్యేందర్ జైన్, మనీశ్ సిసోడియా సహా పలువురు ప్రముఖులు ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్న విషయం విదితమే. "వీఐపీని ఉంచినప్పుడు, వ్యక్తికి బస చేయటంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. ప్రస్తుతం కేజ్రీవాల్ లోపల ఉన్నారు. భద్రతా అంశాన్ని దృష్టిలో ఉంచుకుని చాలా జాగ్రత్తగా ఎంచుకున్న ప్రదేశంలో ఆయనను పెడతారు. ఎందుకంటే 'బ్లేడ్‌బాజీ' (బ్లేడ్‌లు లేదా బ్లేడ్ లాంటి వస్తువులను ఉపయోగించి దాడి చేయడం) వంటి చాలా విషయాలు జరగవచ్చు. మీరు జాగ్రత్తలు తీసుకోకపోతే, అతను దాడికి గురవచ్చు" అని నీరజ్ కుమార్ అన్నారు.

కేజ్రీవాల్‌ను దోషుల జైలులో ఉంచినట్టు మీడియా కథనాల ద్వారా తెలుసుకున్నానని కుమార్ చెప్పారు. అండర్ ట్రయల్‌లను ఉంచిన దానికంటే చాలా సురక్షితమైన, ప్రశాంతమైన ప్రదేశంలో అతన్ని ఉంచారన్నారు. నీరజ్ కుమార్ తన పదవీకాలంలో అత్యంత ప్రసిద్ధ పోలీసు అధికారులలో ఒకరు. ఢిల్లీలో సేవలందించటంపై మాట్లాడుతూ.. తనకు స్థానిక రాజకీయ నాయకుల నుంచి ఎలాంటి ఒత్తిళ్లు లేనందున ఢిల్లీ పోలీసులు ఆశీర్వదించారని అన్నారు.

## గుజరాత్ వర్సిటీలో ముస్లిం ఫోబియా

### హాస్టల్ నుంచి ఏడుగురు విదేశీ విద్యార్థుల గెంటివేత

**అహ్మదాబాద్ :** బీజేపీ అధికారంలో ఉన్న గుజరాత్‌లో ముస్లిం ఫోబియా విస్తరిస్తోంది. గుజరాత్ విశ్వవిద్యాలయంలో ఏడుగురు విదేశీ విద్యార్థులను వర్సిటీ యాజమాన్యం హాస్టల్ నుంచి వెళ్లగొట్టింది. నమాజ్ చేస్తున్న వీరిపై కొందరు దుండగులు దాడి చేసిన అనంతరం వారిని హాస్టల్స్ నుండి ఖాళీ చేయించినట్లు సీనియర్ అధికారి ఒకరు ఆదివారం తెలిపారు. హాస్టల్ ఆవరణలో నమాజ్ చేశారంటూ విదేశీ విద్యార్థులపై మార్చి 16న కొందరు దుండగులు దాడి చేసిన సంగతి తెలిసిందే. తజికిస్థాన్, శ్రీలంక విద్యార్థులు దాడి ఘటనతో ఆస్పత్రి పాలయ్యారు. ఈ ఘటన జరిగిన కొన్ని రోజుల అనంతరం ఆఫ్ఘనిస్థాన్, జాంబియన్ ప్రతినిధి బృందం యూనివర్సిటీని సందర్శించింది. భద్రతా చర్యలపై యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్‌తో సమావేశం నిర్వహించింది. ఈ అంశంపై యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ నిరజా గుప్తా మీడియాతో మాట్లాడారు. ఆఫ్ఘనిస్థాన్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు, తూర్పు ఆఫ్రికాకు చెందిన మరో విద్యార్థి చదువు పూర్తయినా హాస్టల్‌లోనే ఉంటున్నట్లు గుర్తించామని అన్నారు. అడ్మినిస్ట్రేటివ్ వర్క్ కారణంగా హాస్టల్‌లో మాజీ విద్యార్థులుగా ఉంటున్నారని అన్నారు.

## తర్జుమా తరంగిణి

### ఒక పాటను మోస్తూ ...

లోపల ఒక పాటను మోస్తూ
అటూయిటూ తిరుగుతుంటాన్నేను
అందుకే నా శరీరం రాయిలా,
నా కళ్లు జ్వలించే దివిటీలలా,
నా వేళ్ల పదునైన కత్తుల్లా ఉంటాయి
పాటను పదిలంగా ఉంచేందుకు
ఇవన్నీ అవసరం మరి
ఒక మనిషెవరైనా ఎప్పుడైనా నాకు
తారసపడితే
రాయిలాంటి నా శరీరం వెన్నలా
కరుగుతుంది,



కాగడాల్లాంటి నా
కన్నుల్లోంచి
శీతల జలాల ఊటలు
శిరసెత్తుతాయి,
నా చేతివేళ్ల సున్నితమైన
సుమదళాలౌతాయి
ఆ వేళ నా పాటను ఆ
మనిషిలోకి వొంపుతాన్నేను
అప్పుడు,
ఆ వ్యక్తిలో ఈ మార్పులు జరుగుతాయి:
శరీరం రాయిగా మారుతుంది,
కళ్లు మండే దివిటీలౌతాయి,
వేళ్లు పదునైన కత్తులౌతాయి
ఆ వ్యక్తిలో నా పాట భద్రంగా ఉంటుంది!

ఆంగ్లమూలం: లలిత్ మగోత్రా
అనువాదం: ఎలనాగ

# వావిళ్ల ముద్రణ సాహితీ సేవ

తెలుగుభాషాసాహిత్య సంస్కృతి సంరక్షణకూ, సంవృద్ధికీ మహత్తరమైన సేవచేసిన ప్రచురణ సంస్థల్లో వావిళ్ల ప్రెస్ తలమానికమైనది. 1854లో మద్రాసులో వావిళ్ల రామస్వామిశాస్త్రి స్థాపించిన ఆదిసరస్వతీనిలయ ముద్రణాలయం 1906లో వావిళ్ల రామస్వామిశాస్త్రి అండ్ సన్స్ గాను, 1918లో వావిళ్ల ప్రెస్ గానూ నామాంతరంచెంది, 2000 ప్రాంతంలో హైదరాబాద్ మహానగరానికి తరలివచ్చి కనిపించని అందాలు, వినిపించని రాగాలుగా తెలుగు సాహిత్య ప్రియులకు హృదయాహ్లాదకరంగా పాటుపడుతుంది. 170 ఏళ్లుగా అనవరతసేన చేస్తున్న ఈ చదువులతల్లి ఆటపట్టు పుట్టుపూర్వోత్తరాల్ని తవ్వి తీసి, కుప్పపోసి ఒప్పులకుప్పగా 'వావిళ్ల సాహితీ వికాసం వావిళ్ల నుంచి వావిళ్ల దాకా...' అన్న బృహత్ పరిశోధన గ్రంథాన్ని తీర్చిదిద్దిన పరిశ్రమ డా. వి.వి. వెంకటరమణగారిది.

1886లో వెలుగుచూసింది. కాలక్రమంలో ఈ సంస్థ రూపాంతరాలుచెంది వావిళ్ల ప్రెస్'గా కీర్తి గడించింది. వావిళ్ల సంస్థ తెలుగు, సంస్కృతభాషల్లోనూ, తమిళం, కన్నడం, ఇంగ్లీషుభాషల్లోనూ వేయికి పైగా పుస్తకాలు ప్రచురించింది.


'వావిళ్ల వారి పత్రికలు' వావిళ్ల వెంకటేశ్వరశాస్త్రి 1914 జనవరిలో 'త్రిలిఙ్గ' అనే మాసపత్రికను ప్రారంభించారు. ప్రసిద్ధ విద్వాంసులు అక్కిరాజు ఉమాకాంతం ఈ పత్రిక తొలి సంపాదకులు. ఇది పక్ష, వారపత్రికగా కూడా కొంతకాలం వెలువడింది. 22 ఏళ్లకు పైగా వారపత్రికగా పాఠకుల మన్ననలు పొందగలిగింది.

వావిళ్లవారు 1918లో 'బాలవినోదిని' అనే తమిళ మాసపత్రికను వెలువరించారు. 15 ఏళ్లపాటు వెలువడ్డ ఈ పత్రికకు మహాకవి సుబ్రహ్మణ్యభారతి మూడేళ్లపాటు సంపాదకత్వం నిర్వహించారు.

ప్రాచీన తెలుగు సాహిత్యానికే కాదు, ఆధునికాంధ్ర సాహిత్యానికి కూడా వావిళ్లవారు చేసిన సేవ అద్వితీయమైనది, అమోఘమైనదీనూ. ఈ సంస్థ ప్రచురించిన ప్రాచీన తెలుగు కావ్యాలు చక్కగా పరిష్కృతమై పరిశీలనాత్మకమైన ప్రబుద్ధ పీఠికలతో వెలువడేవి. ఈ కారణంగా కావ్యాలకు పాఠకుల ఆదరణ లభించింది. కొమ్ములు తిరిగిన సహృదయ విద్యాంసులు రాసిన విమర్శనా మద్రాసులోని ఇతర ముద్రణశాలలు కూడ ఆస్థాన విద్వాంసులచే 'బాలశిక్ష'లు, 'పెద్దబాలశిక్ష'లు రాయించి గంట్లు మూట కట్టుకొన్నారు.

వావిళ్ల ప్రెస్ సంస్కృత, తెలుగు భాషల్లోని కావ్య నాటక, లాక్షణిక, నానాశాస్త్ర గ్రంథాల్ని వ్యాఖ్యాన సహితంగా వెలువరించి పండిత, పామర జనాలకి జ్ఞానభిక్ష పెట్టింది. వావిళ్ల రామస్వామిశాస్త్రి, వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రి గారలు మహాపండితులకు తృణమో, పణమో ఇచ్చి వాళ్ల చేత పాఠ పరిష్కరణ, పీఠికారచన, ముద్రారాక్షస పరిహారం చేయించడంతోపాటు ముద్రణ, బైండింగ్, పంపిణీల విషయంలో తీసుకొన్న శ్రద్ధాసక్తులు అనితరసాధ్యం. వావిళ్ల ప్రెస్‌లో 1970 దాకా పుస్తకాల అమ్మకానికి ముందు ప్రతి పుస్తకం, ప్రతి పేజీ సరిగ్గా అచ్చయిందా లేదా, పుటలు తారుమారైనాయా, మడతలు పడ్డాయా, మధ్యలో తెల్లకాగితాలొచ్చాయా ఇవన్నీ సరిచూసిన తర్వాతే విక్రయానికి పంపేవారు.

'వావిళ్ల వారి బహుముఖ సేవ'లో వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రిగారి నానాముఖ సేవ వివరంగా చెప్పబడింది. 'వావిళ్ల వివిధ'లో వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రిగారు శృంగార కావ్యాల ముద్రణకు సంబంధించిన కోర్టు వ్యవహారాల్లో చిక్కుకొని 15 ఏళ్లపాటు తన్నుకులాడిన




వావిళ్ల రామస్వామిశాస్త్రి, ఆయన సుపుత్రులు శ్రీ వేంకటేశ్వరశాస్త్రి, తర్వాతి వారసులు సంస్కృతం, తెలుగు, తమిళం, కన్నడభాషల్లోనూ, ఇంగ్లీషుభాషలో కూడా విలువైన గ్రంథాల్ని ప్రచురించిన, చరిత్రను వివరించిన అమూల్య రచన. 'వావిళ్ల వైభవమ్' అన్న ముందుమాటలో "ఆధునిక భారతీయ సారస్వత జగత్తులో గీతాప్రెస్, గోరఖ్ పూర్ వారిని మినహాయిస్తే, ప్రచురణరంగంలో ఇంత భాషాసేవ గావించిన వ్యక్తులు శ్రీ వావిళ్ల వారు మాత్రమేనేమో!" - అన్న డా.పి. రమేష్ నారాయణ అభిప్రాయం గమనించదగ్గది.

679 పేజీల ఈ గ్రంథం వావిళ్ల వారి అసాధారణమైన సంస్కృతాంధ్ర సాహితీసేవ పరువును పరిపరివిధాల పెంచే బరువైన రచన. ఈ పుస్తకంలో 11 అధ్యాయాలూ, ఒక అనుబంధం ఉన్నాయి. ఇవన్నీ ఎంతో విలువైన, ఈ తరానికీ, అంతకుముందు తరానికీ తెలియని సమాచారాన్ని అందించేవే.

'ముద్రణారంగం తొలిరోజులు'లో, డా॥ వి.వి.వి.రమణ, ప్రపంచంలో ముద్రణ తొలిరోజుల్ని, భారతదేశంలో అచ్చు ప్రారంభమైన దినాల్ని వివరించారు. 'నాటి ముద్రణారంగం'లో, భారతదేశంలో ఆంగ్లేయులు స్థాపించిన అచ్చుకూటాలు, మద్రాసులో స్థానీయులు నెలకొల్పిన ముద్రణాలయాల చరిత్రను వెల్లడించారు. 'పుదూరు ద్రావిడులు- ముద్రణారంగం: 1836లో వజ్జల సీతారామశాస్త్రి మద్రాసులో సరస్వతీ అచ్చుకూటం స్థాపిస్తే పురాణం హయగ్రీవశాస్త్రి, వేదం వేంకటాచలశాస్త్రి ప్రభృతులు వెరసి 16 ముద్రణాలయాల్ని నడిపిన ఘనులు.

'ముద్రణారంగంలో వావిళ్ల రామస్వామిశాస్త్రి, వేంకటేశ్వరశాస్త్రి సి.పి.బ్రౌన్ పాఠపరిష్కరణా విధానం ప్రకారమే తెలుగు కావ్య పరిష్కరణలు చేసి, పండితులతో చేయించారు. వావిళ్ల అనంతనారాయణశాస్త్రి, రామస్వామిశాస్త్రి సోదరులు మేనమామ వేదం వెంకటాచలశాస్త్రితో కలిసి 1847లో మద్రాసు నగరంలో 'వివేకరత్నాకరము' అనే ముద్రణశాలను స్థాపించారు. ఈ సంస్థ 'వాల్మీకి రామాయణా'న్ని నాలుగు సంపుటాలుగా వెలువరించింది. పోతన రచించిన శ్రీమదాంధ్రభాగవతాన్ని 1848లో ప్రచురించింది. సరస్వతీనిలయ ముద్రాక్షరశాల 1857లో సింగళిసూరన 'రాఘవ పాండవీయాన్ని, 1859లో కాకునూరి అప్పకవి రాసిన 'అప్పకవీయము'ను ప్రచురించింది. 1868లో 'మనుచరిత్ర, 1869లో 'ఆముక్తమాల్యద', 1870లో 'ఆంధ్రమహాభారతము' వెలువడ్డాయి. గురజాడ శ్రీరామమూర్తిగారి 'కవిజీవితములు'

> 679 పేజీల ఈ గ్రంథం వావిళ్ల వారి అసాధారణమైన సంస్కృతాంధ్ర సాహితీసేవ పరువును పరిపరివిధాల పెంచే బరువైన రచన. ఈ పుస్తకంలో 11 అధ్యాయాలూ, ఒక అనుబంధం ఉన్నాయి. ఇవన్నీ ఎంతో విలువైన, ఈ తరానికీ, అంతకుముందు తరానికీ తెలియని సమాచారాన్ని అందించేవే.

గ్రంథాలు ఆ కావ్యాల సౌందర్యానికి మెరుగులు దిద్దాయి. వజ్జల చిన సీతారామశాస్త్రి 'వసుచరిత్ర- విమర్శనము, జనమంచి శేషాద్రిశర్మగారి మనుచరిత్ర హృదయావిష్కరణము, కట్టమంచి రామలింగారెడ్డి గారు 'కళాపూర్ణోదయము' ప్రబంధానికి రాసిన పీఠిక, బండారు తమ్మయ్యగారు 'క్రీడాభిరామము', 'బసవపురాణము'లకు రాసిన పాండిత్యపూర్ణమైన విపుల పీఠికలు ఆయా కావ్యాల అధ్యయనానికి ఎంతగానో దోహద మొనర్చాయి. వేటూరి ప్రభాకరశాస్త్రిగారి 'మనుచరిత్ర పీఠిక, హంసవింశతి'కి మద్దులపల్లి వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రిగారి లోతైన పీఠిక- ఇది మచ్చుతునకలే కాదు, మెచ్చు తునకలుకూడా. వావిళ్ల వారు ఎన్నో కావ్యాలకు, ప్రబంధాలకు విద్యాంసులచేత టీక, వ్యాఖ్యానాలు రాయించి, వాటికి విశాల పాఠక ప్రపంచాన్ని సంతరించిపెట్టారు. కళాశాల, విశ్వవిద్యాలయ విద్యార్థులకు పాఠ్యభాగాలైన తెలుగు కావ్య ప్రబంధ, శతకాలకు పండితప్రవరులచేత సరళమైన, రసవంతమైన వ్యాఖ్యానాలు రాయింపజేసి ఆ రచనలకు బహుళ ప్రచారం కలిగింప చేశారు. 'రంగనాథ రామాయణము పండితారాధ్య చరిత్ర', 'బసవపురాణము' గౌరన హరిశ్చంద్ర చరిత్ర' మొదలైన ద్విపద కావ్యాలు ప్రచురించి రసహృదయుల్ని వాటివైపు ఆకర్షింపజేశారు వావిళ్లవారు. 'భోజకాళిదాస కథలు', 'తాతాచార్యుల కథలు', 'మర్యాదరామన్న కథలు', 'పరమానందయ్య కథలు', 'రేచుక్క పగటిచుక్క కథలు', 'చార్ దర్వేష్ కథలు' మొదలైన ఆసక్తికరమైన, కుతూహలం పెంపొందించే కథా సంపుటాలు ప్రచురించి పాఠక సముదాయాన్ని పదింతలు చేసిందీ సంస్థ. ప్రౌఢ సాహిత్య రచనలతోపాటు పామరరంజకమైన సాహిత్యంపట్ల కూడా సమదర్శిత్వాన్ని ప్రదర్శించింది. బాల సాహిత్యాన్ని సృష్టింపజేసి ఆబాలగోపాలానికి మహదానందం కలిగించడంలో వావిళ్ల ప్రెస్ వహించిన పాత్ర గణనీయమైంది. పుదూరు సీతారామశాస్త్రి 1832 ప్రాంతంలో బాలబాలికలకు మనోల్లాసంతోబాటు మనోవికాసం కలిగించే 'బాలశిక్ష'ను రూపొందిస్తే, వావిళ్ల ప్రెస్ 1916లో 'పెద్దబాలశిక్షను ప్రచురించి పేరు ప్రసిద్ధులు పొందింది.

సంగతులు వివరింపబడ్డాయి. వివిధ ప్రాంతాల్లో శాస్త్రిగారికి జరిగిన సన్మాన సమాచారం కూర్చబడింది. 1955 డిశంబరు 3వతేదిన విశాఖపట్నంలో ఆంధ్ర విశ్వకళాపరిషత్తు కళాప్రపూర్ణ పట్టా ఇచ్చి గౌరవించింది. శాస్త్రిగారికి పలుచోట్ల సన్మానాలు, అభినందన సభలు జరిగాయి. 'వావిళ్ల తర్వాత'లో వేంకటేశ్వరశాస్త్రిగారు చెన్నపట్టణంలోనే 1956 ఫిబ్రవరి 9వతేదీన మరణించిన తర్వాతి విషయాలు క్రోడీకరింపబడ్డాయి. వావిళ్ల ట్రస్టు నియమించి ముద్రణాలయం ఆశయాల్ని ఆచరణల్ని స్పష్టంగా ప్రకటించారు. 'ప్రత్యేక సంపుటాలు'లో శాస్త్రులవారి షష్టిపూర్తి, శతజయంతి, వావిళ్ల 150 వసంతాల సంచికల గురించి విశదంగా చెప్పబడింది. 'వావిళ్ల పునర్వైభవం'లో వావిళ్ల సంస్థ హైదరాబాదుకు మకాం మార్చడం, అక్కడినుంచే కొన్ని పాత పుస్తకాల పునర్ముద్రణ, కొత్త పుస్తకాల ప్రకాశనం చేస్తున్న వివరాలు పొందుపర్చబడ్డాయి.

ఇంత భారీ గ్రంథం రాసి గ్రంథకర్త సాధించి, మనకిచ్చిన పాథేయమేమిటి? అన్న ప్రశ్న కలుగుతుంది. మరుపూరు కోదండరామి రెడ్డి, పునుగు శంకరశాస్త్రి, బులుసు వెంకటరమణయ్య, వజ్జల వేంకట సుబ్రహ్మణ్య శర్మ మొదలైన పండితుల విలువైన పుస్తకాలు, ఇంకా మరెన్నో గ్రంథాలు, పత్రికలు చదివి గ్రంథకర్త తన పరిశోధనాంశాల్నీ జోడించి ఈ గ్రంథరాజాన్ని వెలువరించారు. వావిళ్ల సంస్థ 170 ఏళ్లనాడు ప్రచురించిన గ్రంథాల ముఖపత్రాలు, ప్రకాశకుల విన్నపాలు, ఘనపాఠీల పీఠికాభిప్రాయాలు సమకూర్చి పెట్టారు. పైగా ఎంతోమంది మహనీయుల ఫోటోలు ప్రచురించారు. వావిళ్ల సంస్థ ప్రారంభకాలం గురించి సవరణ చేశారు. వావిళ్ల సంస్థ బహుముఖీన సేవ గురించి పరిశోధన చేయడానికి తలుపులు తెరిచి విద్వాంసుల్ని ఆహ్వానించారు డా.వి.వి. వేంకటరమణ.



శ్రీ ఘట్టమరాజు, 9984082078

## 'క్రోధి' కోపించాలి!

అవినీతిపరుల్ని చీల్చి చెండాడడానికి..
అశ్లీల మృగాళ్లను అంతం చేయడానికి..
దురాలోచనల్ని కట్టడి చేయడానికి
అనైతిక పోకడల్ని అడ్డుకోవడానికి..
ప్రకృతి విధ్వంస రెక్కల్ని నరికేయడానికి..
లంచగొండుల లాగులూడదీయడానికి..
అబద్ధాలకోరుల విషం కక్కించడానికి..
కాలుష్యకారుల కాళ్లను కట్టేయడానికి..
కల్తీరాయుళ్లకు బేడీలు వేయడానికి..
వెన్నుపోటుదారుల్ని వేటాడడానికి..
ఈర్ష్యాద్వేషాల్ని ఈడ్చిపారేయడానికి..
రక్తం పీల్చే జలగల్ని రప్పాడించడానికి..
దుష్టశక్తుల్ని తన్ని తరిమేయడానికి..
రాజకీయ రాక్షసుల్ని రచ్చకీడ్చడానికి..
డబ్బున్న బిచ్చగాళ్ల పీచమణచడానికి..
పన్ను ఎగవేతదారుల పంతం పట్టడానికి..
సైబర్ మోసగాళ్లపై కత్తి దూసేయడానికి..
చొరబాటుదారుల తల నరకేయడానికి..
చావు తెలివిగాండ్ల చాపచుట్టేయడానికి..
బొక్కసాన్ని బుక్కే ఎలుకల్ని ఏరేయడానికి..
'క్రోధి' వత్సరం క్రోధంతో ఊగి తూగుతూ..
విశ్వ శాంతి, విజ్ఞాన దీపాల్ని వెలిగించాలె !

- మధుపాలీ, 9949700037

## శ్రీకారం..!



ఉదయం లేలేత చిగురుటాకులపై
సూర్య కిరణాల కాంతి ప్రసరిస్తే
మామిడి పూతల చిటారు కొమ్మపై కోకిల
వసంత ఋతురాగాన్ని ఆలాపిస్తుంది..!
భానుడి భగ భగలను లెక్క చేయకుండా
చికాకుల చెమటతో సహవాసం చేస్తూ
పని ఒత్తిడిలోని సమస్యల పరిష్కారానికి
గ్రీష్మ తాపం ఆలోచనల సెగ
పుట్టిస్తుంది..!
తొలి చినుకుల సంబురంతో
మనసు కోరికల మయూరం
ఉత్సాహంతో పరవశించి పురి విప్పుకుని
వర్షం వేదికపై నాట్యమాడుతుంది..!
తుమ్మెద మోసుకు వచ్చిన
పువ్వుల మధువును స్వాగతించి
చల్లని గాలుల స్పర్శకి స్పందించి
శరత్ కాలపు వెన్నెల ఊరటనిస్తుంది..!
ఓర్పుతో దినమంతా శ్రమిస్తూ
చీకటి రాత్రులలో వెచ్చగా విశ్రమిస్తూ
నేర్పుతో ఇష్టాలను పండించుకుని
హేమంతం తియ్యని విందు చేస్తుంది..!
అన్నీ బాగానే ఉన్నాయని
ఏమరుపాటుతో ఒళ్లు విరుస్తున్నపుడు
ఆశగా కట్టుకున్న రంగుల కల
శిశిరమై ఒక్కోసారి రాలుతుంది..!
అయినా కాలం గీసిన రేఖలపై
మార్పులకు ఎదురొడ్డి నిలిచి
వసంతంలో మళ్లీ మొగ్గ తొడిగి
షట్ ఋతువులలో షడ్రుచుల జీవనం
యుగాదికి శ్రీకారం చుడుతుంది..!!

- డా. వాసాల వరప్రసాద్,
9490189847

### డా॥ వి.చంద్రశేఖర రావు జయంతి సభ

ఈ నెల 13 సాయంత్రం 6 గంటలకు గుంటూరు 2/7 బ్రాడీపేట, కొరటాల భవన్‌లో డాక్టర్ వి.చంద్రశేఖర రావు జయంతి -పురస్కారం 2024 సభలో చరణ్ పరిమికి పురస్కారం అందజేస్తారు. ఈ సభలో పెనుగొండ లక్ష్మీ నారాయణ, పాపినేని శివశంకర్, వాసిరెడ్డి నవీన్,సీతారాం, ఎస్.స్పందన, కందిమళ్ళ శివప్రసాద్, వి.ప్రసూన, కాట్రగడ్డ దయానంద్ , పాల్గొంటారు.

- డాక్టర్ వి.ప్రసూన

### అక్కినేని జీవితం, నట జీవితంపై వ్యాసరచన, మినీకవితల పోటీ

సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు సౌజన్యంతో యువకళావాహిని- సాహితీకిరణం సంయుక్త ఆధ్వర్యంలో అక్కినేని శతజయంతి సందర్భంగా వ్యాసరచన, మినీకవితల పోటీ నిర్వహిస్తోంది. అంశాలు: 1) అక్కినేని పౌరాణిక, భక్తి చిత్రాలు 2) అక్కినేని జానపద, చారిత్రాత్మక చిత్రాలు, 3) అక్కినేని సాంఘిక చిత్రాలు 4) అక్కినేని జీవిత వ్యక్తిత్వం. ప్రతి అంశానికి రెండు బహుమతులు: ప్రథమ 2500/-, ద్వితీయ 1500/-. అక్కినేని నటనపై 12లైన్లు మించకుండా మినీకవితలు పోటీలో 4 మినీకవితలకు ఒక్కొక్క కవితలకు రూ॥1000/-. 2024లో అక్కినేని శతజయంతి వేడుకలలో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానం చేయబడును. వ్యాసాలు/మినీకవితలు పోస్టు/కొరియర్ ద్వారా మాత్రమే ఏప్రిల్ 30 లోపు సాహితీకిరణం, ఇం.నెం.11-13-154, అలకాపురి, రోడ్‌నెం.3, హైదరాబాద్-500102 చిరునామాకు పంపాలి. వివరాలకు :పొత్తూరి సుబ్బారావు, 9490751681.

### శివేగారి దేవమ్మ కథా పురస్కారాలు - 2023

శివేగారి దేవమ్మ కథా పురస్కారాలు- 2023 సం.కోసం 2022-23 లో ప్రచురితమైన కథాసంపుటాలు, బాలల కథాసంపుటాలను ఆహ్వానిస్తున్నారు. ఎంపికైన ఉత్తమ కథా సంపుటానికి 7000/- , బాలల కథా సంపుటానికి 3000/- , పురస్కార వుంటుంది. సంపుటాలు మూడేసి ప్రతులు ఏప్రిల్ 20 లోపు K.V Meghanath Reddy, H.No. 11/21/01, N.G.O s colony, Puttur - 517583,Tirupathi (D), AP. చిరునామాకు అందేలా పంపాలి. **వివరాలకు :కె.వి.మేఘనాథ్ రెడ్డి. 6300318230.**

### 'వీలునామా' కవితలకు ఆహ్వానం

ప్రముఖ కవయిత్రి బైరి ఇందిరగారి రాసిన 'వీలునామా' కవిత ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అందరికి సుపరిచితమే. ఆమె కోరిక మేరకు 'వీలునామా' కవితా సంకలనం తీసుకురావాలని వారి కుటుంబం, తెలంగాణ సాహితి రాష్ట్ర కమిటీ భావించింది. 'వీలునామా' అనే అంశంపై రాసిన కవితలు ఏప్రిల్ 30వ తేదీలోపు indira.veelunama.gmail.com కు పంపగలరు.

- హిమజారామం, మోహన్‌కృష్ణ అనంతోజు, 8897765417

# నవయుగ సంఘర్షణలు ఈ కథలు



- డా॥ఎస్.కె.సాబిరా

I am no bird, and no net ensnares me; I am a free human being with an independent will. Which I now exert to leave you.( Charlotte Bronte, Jane Eyre-1847)

(నేను పక్షిని కాదు. ఏ వలా నన్ను బంధించలేదు, నేనో స్వేచ్ఛా జీవిని. స్వతంత్ర అభిప్రాయాలతో ఉన్నాను. ఇప్పుడు నిన్ను విడిచి పెట్టడానికి ఎంతో బాధపడుతున్నాను. (షార్లెట్ బ్రోంటే, జేన్ ఐర్-1847))

"I Know what I want, I have a goal, an opinion... let me be myself and then I am satisfies, I know that I am a women a woman with inward strength and plenty of couragew" (Anne frank, The diary of a young girl. 1942-1944)

("నాకేం కావాలో నాకు తెలుసు. నాకో లక్ష్యం ఉంది. ఒక అభిప్రామూ ఉంది... నన్ను నన్నుగానే ఉండనిస్తేనే నాకు తృప్తి. నేనో మహిళనని తెలుసు. ఒక మహిళ లోపలి నుంచి ఎంత బలంగా, ధైర్యంగా ఉండగలదో ఇంకా బాగా తెలుసు." (అన్నే ఫ్రాంక్, ది డైరీ ఆఫ్ ఎ యంగ్ గర్ల్. 1942-1944))

ఈ రెండు కొటేషన్స్ మధ్య నూరేళ్ళ ప్రయాణం ఉంది. అయినా పరిస్థితులలో ఎటువంటి మార్పు లేదు. కట్ చేస్తే 2024లో దాస్తాన్ కథలు చదువుతున్నప్పుడు కొన్ని సందర్భాలు, కొన్ని సంఘటనలు, కొన్ని సంవాదాలు పాఠకులను ఆలోచనల్లో పడేస్తాయి.

"పుట్టుకతో నేను మేధావినే... నా చుట్టూ ఉన్న సమాజమే నన్ను పిరికిని చేసింది." ఇక్కడ రచయిత్రి Simone de Beauvoir అసంకల్పితంగా గుర్తుకు వస్తుంది. తాత్వికత నిండిన మాటలతో ప్రపంచాన్నే తాదాత్మ్యతా ఒడికి చేర్చిన గొప్ప ఉద్యమకారిణి ఆమె.


"One is not born, but rather becomes, a women." (The Second Sex 1949). ఒక పెద్ద విమర్శకు పునాది అయిన చర్చ ఆ పరంపర నుంచే వచ్చింది. ఈ దాస్తాన్ లో నస్రీన్ ఖాన్ తనదైన శైలిలో - "సమస్య తెలుసుకున్నాను. పరిష్కారం దిశగా పోరాటమే చేస్తున్నానిప్పుడు" అంటారు.

TS Eliot ఒక వ్యాసంలో ఇలా చెప్తారు... ఒక రచయిత తన సాహిత్య పరంపరను కొనసాగించడానికి గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోవాలి.

నస్రీన్ ఖాన్ ఒక రచయిత. మహిళా రచయిత. ముస్లిమ్ మహిళా రచయిత. ఈ విషయం అర్థమయినప్పుడు కచ్చితంగా మన చుట్టూ జరుగుతున్న విషయాల పట్ల పాఠకులకుగాని, విమర్శకులకుగాని ఒక అవగాహన వస్తుంది. మనం ఒక ప్రత్యేకమైన సమాజానికి న్యాయం చెయగలుగుతాం.

'దేహంపైని గాయాలు మానతాయి. కానీ, మనసుపైనున్న గాయాలు మానడం చాలా కష్టం' అంటారు అజ్గర్ అలీ ఇంజినియర్.

దాస్తాన్ లోని పది కథలలోని పాత్రలు ఎదుర్కొన్న భయానక పరిస్థితులను చూస్తుంటే ఈ కాలంలోనూ ఇటువంటి హింస కొనసాగుతుందా అనే ఆవేదన కలుగకమానదు. జుగుప్సాకరమైన రాజకీయాలకు దశాబ్దాలుగా బలవంతంగా బలవుతున్న సమాజానికి ఈ కథలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఇందుకు 'లాపతా' కథను ఉదాహరణగా చెప్పవచ్చు.




రఫీఖాను మాధ్యమంగా చేసుకుని కథను మలుపు తిప్పిన విధానం ఎంతో బాగుంటుంది. కథ చదువుతున్నప్పుడు ఇటువంటి కథ ఇంతకు మునుపు చదివామని అనిపిస్తుంది. కానీ, నస్రీన్ ఖాన్ రాసిన ఈ కథ మరో ఎత్తు. సమకాలీన పరిస్థితులకు సరికొత్త కోణాన్ని అద్దారు. దాంతో ప్రత్యేక కథల కోవలోకి చేరుతుంది. ఇక్కడ మళ్ళీ ఇలియట్ గుర్తుకు వస్తాడు. సాంప్రదాయం, ఆధునికతల మేలు కలయికల సరికొత్త పరిమళాలు వెదజల్లుతుందీ కథ.

"మొగోని లెక్కనే ఇంటిని సంభాలించిన - కనురెప్పలు వేగంగా కదిలిస్తూ మనవారాళ్లను ఉద్దేశించి అన్నది" ప్రతి ఇంట్లో అమ్మ చేసే పని అదే. కానీ పురుష ప్రధాన సమాజంలో దానికి గుర్తింపే ఉండదు.

ఈ కథలు కొన్ని సందర్భాలలో అడ్వాన్స్‌డ్ గా కూడా కనిపిస్తాయి. ఉదాహరణకు దిశమార్చుకున్న గాలి. ఈ కథలో జైనబ్, ముంతాజ్‌ల మధ్య సిస్టర్హుడ్ చక్కగా కనిపిస్తుంది. జైనబ్ తీసుకున్న నిర్ణయం ఒక అద్భుతం... "అతడు నాకు స్పర్మ్ డోనర్ తప్ప మరేమీ కాదు." అంటుంది పాత్ర.

స్త్రీ స్వరం ఒక సోషియో- పొలిటికల్ వాయిస్ (Socio-Political Voice)గా మారడం మొదలై వందేళ్లకు పైబడింది. సమాజం మారింది. నిజమే. స్త్రీ పట్ల ఉన్న వివక్ష కూడా సరికొత్త రూపాలు మార్చుకుంటున్నది. దీనికి నిదర్శనమే ఈ దాస్తానాలు.

తెలుగులో ముస్లిం సమాజ సాహిత్యం తెలుగు సాహిత్యానికి ఒక కొత్త చేర్పు అని ఇదివరకే గుర్తించారు. అయినప్పటికీ ముస్లిం రచయిత్రులు, ముస్లిం స్త్రీల రచనల కోణం నుంచి చూస్తే అంత సంతోషకరమైన పరిణామమేమీ కనపడదు. పరిస్థితి ఇంకా చీకటిగానే ఉంది. ఈ దాస్తాన్ ఆ చిక్కటి చీకటిని కొంతైనా ఛేదించే ఒక ఆశా కిరణం అనిపిస్తుంది.

ఇదివరకు చెప్పినట్టు నస్రీన్ ఖాన్ ఒక రైటర్. ముస్లిం స్త్రీల వరకే పరిమితమైపోని వ్యక్తిత్వం ఆమెది. పలు విధాలుగా దాస్తాన్ కథల సంపుటి విశిష్టతను గుర్తించవచ్చు.

భరోసా ఒకరు ఇస్తే వచ్చేదికాదు. అది మనకు మనమే లోపలనుంచి పెంచుకోవలసి వస్తుంది. అది ఏ బాంధవ్యమైనా, ఎవరి గురించి అయినా. ఇలాంటి కథనాలు, కథలు కొత్త ఏమీకాదు. కానీ చెప్పే పద్ధతి, తీసుకున్న నిర్ణయాలు చాలా కన్విన్సింగ్‌గా ఉన్నాయి.

నయాదౌర్ కథ ఎంతగా ఆలోచింపచేస్తుందో! నిస్సందేహంగా కాలం మారింది. కానీ, ఆలోచనలు? ఆలోచనలు మటుకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉన్నాయి.

కాలానికి తగినట్లుగనే దోపిడీ పంజా బలం పుంజుకుంటున్నాకొద్దీ సరికొత్త చైతన్యం ఉద్భవిస్తూనే ఉంటుంది. ఇదే నవ యుగానికి సూచిక.

## ఆప్‌ను ఖతం చేసేలా బీజేపీ కుట్ర

(మొదటిపేజీ తరువాయి)



కర్నాటక తదితర రాష్ట్రాల్లో నిరసనలు హోరెత్తాయి. ఆదివారం జంతర్ మంతర్ వద్ద దీక్ష చేపట్టారు. రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్, ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ రామ్‌నివాస్ గోయల్, డిప్యూటీ స్పీకర్ రాఖీ బిల్లా, మంత్రులు అతిషి, గోపాల్ రాయ్, సౌరబ్ భరద్వాజ్, ఇమ్రాన్ హుస్సేన్, ఎంపీ సందీప్ పాఠక్, సీనియర్ నేత సోమనాథ్ భారతితోపాటు ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

### బీజేపీ కుట్రలను తిప్పి కొడదాం..

ఆమ్ ఆద్మీ పార్టీని నామరూపాలు లేకుండా చేయడం కోసమే బీజేపీ ఈ తరహా కుట్ర పన్నిందని మంత్రి గోపాల్‌రాయ్ విమర్శించారు. అందులో భాగంగానే ఢిల్లీ మద్యం కేసులో అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేసిందన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ రామ్‌నివాస్ గోయల్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్యానికి మద్దతుపలికేవారంతా ఈ రోజు నిరాహారదీక్ష చేపడుతున్నారని అన్నారు. ఎన్నికైన ప్రభుత్వాలకు చెందిన ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ఆయా ప్రభుత్వాలను కూలదోసేవారిపై పోరాటం ఆరంభమైందని, తాము భారత రాజ్యాంగాన్ని కాపాడతామని స్పష్టం చేశారు. కాషాయ పాలకులు ఆప్‌ను చీల్చాలని కోరుకుంటున్నారని, అయితే తాము మరింతగా బలపడతామని దీమా వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య ప్రియులు అరవింద్ కేజ్రీవాల్‌కు బాసటగా నిలుస్తున్నారని తెలిపారు.మరోవైపు అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్‌కు నిరసనగా దేశ విదేశాల్లో ఆప్ నేతలు ఈ తరహా నిరాహార దీక్షలు చేపట్టారు. పంజాబ్ ముఖ్యమంత్రి, ఆప్ నేత భగవంత్ సింగ్ మాన్ ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు భగత్ సింగ్ స్వగ్రామం కత్‌కర్ కలాన్‌లో దీక్ష చేపట్టారు. ఈ నిరాహార దీక్షకు ప్రజలు పోటెత్తారు. విదేశాల్లో సైతం అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్‌కు నిరసనగా ఈ దీక్షలు చేపట్టారు. బోస్టన్‌లో హార్వర్డ్ స్క్వేర్, లాస్ ఏంజెల్స్‌లోని హాలీవుడ్ సైన్, వాషింగ్టన్ డీసీలోని ఇండియా రాయబార కార్యాలయం వెలుపల, న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్, టోరంటో, లండన్, మెల్‌బోర్న్‌లలో ఈ నిరాహార దీక్షలు చేపట్టినట్టు ఆప్ నేతలు వివరించారు. ఇక ఢిల్లీ లిక్కర్ కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడి అరెస్ట్ చేసి, ఆయన జ్యూడిషియల్ కస్టడీని ఏప్రిల్ 15వ తేదీ వరకు పొడిగించిన విషయం విదితమే.

## లెక్క తీస్తాం...

(మొదటిపేజీ తరువాయి)

కమిషన్ లక్ష్యాలు వివరించారు. పై అంశాలకు సంబంధించిన సమాచారం, సాక్ష్యాలు, ఆధారాలను ఎవరైనా కమిషన్ దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. ఈ అంశాలతో సంబంధం ఉందని కమిషన్ భావిస్తే మాజీ ముఖ్యమంత్రి, మాజీ మంత్రులను కూడా విచారణకు పిలుస్తామని విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. మొదట రిక్వెస్ట్ లెటర్స్ రాస్తామనీ, వాటికి స్పందించకుంటే సమన్లు పంపుతామన్నారు. కమిషన్‌కు ఆ అధికారాలు ఉన్నాయని స్పష్టం చేశారు. మూడు ఒప్పందాలకు సంబంధించిన ఫైళ్లు తమ కార్యాలయానికి చేరాయని ఆయన తెలిపారు. వాటి ప్రాథమిక పరిశీలన కూడా పూర్తయ్యిందనీ, అవసరమైతే మిగిలిన ఫైళ్లను అడుగుతామన్నారు. దీనిపై త్వరలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తామనీ, దీనికోసం త్వరలో బహిరంగ ప్రకటన విడుదల చేస్తామన్నారు. తమ వద్ద ఉన్నసమాచారాన్ని ఎవరైనా ఈ-మెయిల్ లేదా లేఖల తమ కార్యాలయానికి పంపొచ్చన్నారు. సాంకేతిక పరిజ్ఞానం కలిగిన కొద్ది మంది వ్యక్తుల నుంచి సమాచార సేకరణ కోసం బహిరంగ విచారణ కూడా నిర్వహిస్తామన్నారు. విద్యుత్ ఉద్యోగులు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్ఈఆర్సీ) బహిరంగ విచారణలకు హాజరు కావద్దని గతంలో ఆంక్షలు విధించారనే విషయాన్ని విలేకరులు కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. దానిపై విద్యుత్ సంస్థల అభిప్రాయం తీసుకుంటామనీ, దూషణలు, రాజకీయ విమర్శలకు తావులేకుండా విచారణకు సహకరించాలని ఆయన కోరారు.

## జనజాతర కాదు..హామీల పాతర

(మొదటిపేజీ తరువాయి)

అసత్యాలతో జాతర చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించారని, అధికారంలోకి వచ్చాక నరకం చూపిస్తున్నారని విమర్శించారు.కాంగ్రెస్ అసమర్థ పాలనలో సాగునీరు లేక అన్నదాతలు పంట నష్టపోతున్నారని చెప్పారు. రుణమాఫీ లేక రైతులు అప్పుల పాలవుతున్నారని, తాగునీటికి తెలంగాణ ప్రజలు తండ్లాడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ మోసాలపై మహిళలు మండిపడుతున్నారని పేర్కొన్నారు.రాహుల్ గారు.. మా అన్నదాతల ఆర్తనాదాలు వినిపించడం లేదా?, లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినా స్పందించరా, 200కిపైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నా ఆదుకోరా?, చేనేతరంగం సంక్షోభంలో కూరుకుపోయినా కనికరించరా?, డిసెంబర్ 9న చేస్తానన్న రుణమాఫీపై సర్కారును నిలదీయరా అంటూ ప్రశ్నాస్త్రాలు సంధించారు.

75 ఏండ్ల స్వాతంత్ర భారత చరిత్రలో దేశంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, ఇంకా వెనకబడి ఉన్నారంటే కారణమే కాంగ్రెస్ పార్టీ అని ఆరోపించారు. కులగణన పేరిట మీ కొత్త పల్లవికి ఓట్లు రాలవని, చేతి గుర్తుకు ఓటేస్తే చేతులెత్తేయడం ఖాయమని తెలంగాణ సమాజానికి అర్థమైపోయిందన్నారు. సకల రంగాలను సంక్షోభంలోకి నెట్టిన భస్మాసుర హస్తాన్ని నెత్తిన పెట్టుకుంటే నిండా మునగడం ఖాయమని తేలిపోయిందని చెప్పారు. అందుకే వందరోజుల్లోనే హామీలను బొందపెట్టిన కాంగ్రెస్‌కు వచ్చే ఎన్నికల్లో తెలంగాణ ప్రజల చేతిలో గుణపాఠం ఖాయమన్నారు.

## కాలుష్యం లేని సీవరేజ్ పైపులను వాడాలి..

- పర్యావరణ రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి : తెలంగాణ ఎస్‌డబ్ల్యూజీ పైప్స్ మ్యానుఫ్యాక్చరింగ్ అసోసియేషన్




హైదరాబాద్ : కాలుష్యం లేని సీవరేజ్ పైపులను వాడి, పర్యావరణ రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఎస్‌డబ్ల్యూజీ పైప్స్ మ్యానుఫ్యాక్చరింగ్ అసోసియేషన్ సూచిస్తూ.. ఓ ప్రకటన విడుదల చేసింది. ఎస్‌డబ్ల్యూజీ పైపుల ఆవశ్యకత, అవసరాల గురించి వివరించింది.తెలంగాణలో 36 ఎస్.డబ్ల్యూ.జీ. (డ్రైనేజ్) మట్టి పైపులను ఉత్పత్తి చేసే చిన్న పరిశ్రమలున్నాయి. మన దేశంలోని మిగిలిన రాష్ట్రాలతో పోల్చితే మట్టి పైపుల పరిశ్రమలు తెలంగాణలో ఎక్కువగా ఉన్నాయని, ఈ మట్టి పైపులు మురుగునీటి పారుదలకు ఉపయోగిస్తారు. రాష్ట్రంలో 36 కంపెనీల్లో దాదాపు 4000 మంది కార్మికులు పనిచేస్తున్నారు. అయితే ప్లాస్టిక్ పైపుల వాడకం వల్ల రోజురోజుకు ఈ పైపులకు డిమాండ్ తగ్గుతోంది. చాలా వరకు పరిశ్రమలు మూతపడే దశలో ఉన్నాయి. వీటిలో ఎలాంటి రసాయనాలు ఉపయోగించకపోవడం వల్ల పూర్తిగా పర్యావరణానికి అనుకూలమైనవి. మల మూత్రాలలో ఉండే ఆమ్లా లేక క్షారాల వల్ల ఇతర పైపులు కొద్దికాలానికి దెబ్బతింటాయి. ఈ పైపులు ఆమ్లా, క్షారాలతో పాటు ఎలుకలు, పందికొక్కులు వంటివి చేరినా పైపులను నాశనం చేయలేవు. చెదలు కూడా ఈ పైపులను ఏమీ చేయలేవు. ప్లాస్టిక్ పైపులు ఇందుకు విరుద్ధంగా ఉంటాయని తెలిపింది. ఎస్‌డబ్ల్యూజీ పైపుల వాడకం పెంచి పర్యావరణాన్ని కాపడడంతో పాటు, ఈ పరిశ్రమలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉంది. సీఎం రేవంత్ రెడ్డి చొరువ తీసుకొని ప్రస్తుతం ప్రభుత్వ పరంగా నడిచే జీహెచ్ఎంసీ, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్ఈబీ, గ్రామపంచాయతీల పరిధిలో నిర్వహించే డ్రైనేజీ అవసరాలకు ఈ పైపులను ఉపయోగించవచ్చు. వీటితో పాటు ప్రస్తుతం కొత్తగా ఏర్పడుతున్న డీటీపీసీ లే అవుట్లలో సైతం ఎస్‌డబ్ల్యూజీ పైపులను మాత్రమే ఉపయోగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అంతేకాదు ఈ పైపులు చౌకగా లభించడంతో పాటు 150 ఏండ్ల వరకు మన్నుతాయని తెలంగాణ ఎస్ డబ్ల్యూ జి పైప్స్ మ్యానుఫ్యాక్చరింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. వర ప్రసాద్ రావు, సభ్యులు భూమయ్య గుప్తా, వినోద్ రెడ్డి, మధు సూదన్, భాస్కర్ గుప్తా, బ్రీజ్ మోహన్ తదితరులు కోరుతున్నారు.

# వామపక్షాలపైనా అక్కసు

## కాంగ్రెస్‌ను జిన్నా ముస్లిం లీగ్‌తో పోల్చిన మోడీ



న్యూఢిల్లీ: ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ ప్రధాని మోడీలో అసహనం పెరిగిపోతోంది. ప్రతిపక్షాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో ఒక వైపు దాడులు చేయిస్తూ, మరోక వైపు ప్రతిపక్షాలపై బురదచల్లే కార్యక్రమాన్ని తీవ్రతరం చేశారు. శనివారం షహరాన్‌పూర్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగిస్తూ, కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. స్వాతంత్ర్యానికి ముందు జిన్నా ముస్లిం లీగ్ భావజాలంతో పోల్చి విభజన రాజకీయాలకు ఆజ్యం పోసే ప్రయత్నం చేశారాయన. ఈ కాంగ్రెస్ 21వ శతాబ్దంలో భారతదేశాన్ని ముందుకు తీసుకెళ్ళదని ఆక్రోశించారు..." వామపక్షాలపైనా అక్కసు వెళ్లగక్కారు. 'ఇండియా' వేదిక నాయకులపైనా రుసరుసలాడారు. ఈ వేదికలో చాలా మంది నాయకులున్నారు. వారి దృష్టి అంతా ప్రధాని కుర్చీపైనేనని మోడీ ఆరోపించారు. వామపక్షాలు కానీ, కాంగ్రెస్ కానీ తమ మ్యానిఫెస్టోలో దేశ రాజ్యాంగాన్ని పరిరక్షించడం గురించి నొక్కిచెప్పాయి. మరోవైపు ప్రజా ఆధారిత కార్యక్రమాలకు ప్రాధాన్యమిచ్చాయి.. ప్రజాస్వామంమంచ సమాజంలోని అన్ని వర్గాలు పౌర హక్కుల పరిరక్షణకు పిలుపునిచ్చాయి. మోడీ అక్కసుకు ఇదే కారణమని పరిశీలకులు భావిస్తున్నారు.

స్వాతంత్ర్య పోరాటం నడిపిన కాంగ్రెస్ దశాబ్దాల క్రితం నాటిదని, నేటి కాంగ్రెస్‌కు దేశానికి దిశా నిర్దేశం చేసే విజన్ ఏమీ లేదని ఆయన ఆరోపించారు. వామపక్షాలను కూడా మోడీ లాగుతూ, ముస్లిం లీగ్ ఆలోచన తర్వాత , ఆ స్థానంలో వామపక్షాల ఆలోచన చొరబడిందంటూ విషం గక్కారు.

కమ్యూనిస్టులపై దాడి ఇదే మొదటి సారి కాదు. గత సంవత్సరం ఆరెస్సెస్ వ్యవస్థాపక దినమైన 'విజయ దశమి' నాడు ఆ సంస్థ అధిపతి మోహన్ భగవత్ మాట్లాడుతూ, " ప్రస్తుతం దేశానికి ప్రధాన శత్రువు సాంస్కృతిక మార్క్సిస్టులే" అంటూ చిందులేశారు. ప్రతిపక్షాలు మైనార్టీల హక్కుల గురించి డిమాండ్ చేసినప్పుడల్లా " ముస్లింలను బుజ్జగిస్తున్నారు" అంటూ బిజెపి, ఆరెస్సెస్ విరుచుకుపడుతున్నాయి. కొన్నిసార్లు నిరసనకారులను తుక్డే తుక్డే గ్యాంగ్‌లని, వారు సమాజాన్ని విచ్ఛిన్నం చేయాలనుకుంటున్నారని ఆరోపించాయి. ఈసారి మహమ్మద్ అలీ జిన్నా ముస్లిం లీగ్‌ని నేరుగా లాగారు. జిన్నా విషయాన్ని అలా ఉంచితే, స్వాతంత్ర్య పోరాటంలో ఆరెస్సెస్ పాత్ర ఏమిటో మోడీ మహాశయుడు సెలవిస్తే బాగుండేదని పరిశీలకులు వ్యాఖ్యానించారు.

'ఇండి' బ్లాక్ అనిశ్చితికి, అస్థిరతకు పర్యాయపదం" అని, . ప్రజలు కూడా వాటిని పట్టించుకోవడం లేదని మోడీ విమర్శించారు.

మోడీ వ్యాఖ్యలపై ప్రతిపక్షాల నేతలు స్పందిస్తూ, ఎన్నికల్లో ఓటమి భయంతోనే మోడీ ఇటువంటి ప్రేలాపనలు పేలుతున్నారని అన్నారు. 'ఇండియా' వేదిక మార్చి 31న ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో నిర్వహించిన ర్యాలీకి పెద్దయెత్తున జనం రావడంతో. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు బెంబేలెత్తుతున్నాయన్నారు.

# ఎండల వేళ.. నగరవాసులకు మెట్రో గట్టి షాక్..!

(మొదటిపేజీ తరువాయి)




ప్రజలు కూడా ఈ ఆఫర్లను వినియోగించుకునేందుకు ఆసక్తి కనబరుస్తూ వచ్చారు. రెండేండ్ల క్రితం హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ సూపర్ సేవర్ ఆఫర్-59ను ప్రవేశపెట్టింది. సెలవు దినాలు, పండుగల రోజుల్లో ఉపయోగపడే ఈ ఆఫర్‌కు ప్రజల నుంచి విపరీతమైన ఆదరణ లభించింది. ఫలితంగా మెట్రో రైలులో రోజువారి ప్రయాణికుల రద్దీ పెరిగింది. దీంతో గతేడాది సూపర్ సేవర్ ఆఫర్-59 స్థానంలో 99 రూపాయలకు పెంచింది. అయినప్పటికీ మెట్రో ప్రయాణికుల నుంచి ఆదరణ తగ్గలేదు. ఇక అదే సమయంలో ప్రయాణికుల తాకిడి తట్టుకునేందుకు అప్పటివరకు రద్దీ వేళల్లో ప్రయాణికులకు ఇచ్చిన రాయితీలకూ కోత పెట్టింది. గతంలో మెట్రో కార్డు, క్యూ ఆర్ కోడ్‌పై ప్రతి ప్రయాణ చార్జీల్లో 10శాతం డిస్కౌంట్ ఉండేది. దీనిని గతేడాది నుంచి కేవలం ఆఫ్ పీక్ అవర్స్‌లో ఉదయం 6 నుంచి 8గంటల వరకు, రాత్రి 8 నుంచి 12గంటల వరకు మాత్రమే కాంటాక్ట్ లెస్ స్మార్ట్‌కార్డుల(సీఎస్‌సీ)పై 10శాతం రాయితీని ఇచ్చింది. ఇప్పుడు దీనిని సైతం పూర్తిగా ఎత్తివేసింది. దీంతో మెట్రో అధికారులు తాజాగా తీసుకున్న నిర్ణయంపై ప్రయాణికులు మండిపడుతున్నారు. నగరంలో ట్రాఫిక్ రహిత, సురక్షితమైన, వేగవంతమైన ప్రయాణం అందిస్తున్న తరుణంలో రాయితీలు ఎత్తివేయడంపై సామాన్య మధ్య తరగతి ప్రజలు మెట్రో ప్రయాణాలకు దూరమయ్యే అవకాశం ఉందని, హాలీడే కార్డుతో పాటు మెట్రో కార్డు, క్యూఆర్ కోడ్‌పై ఎల్అండ్‌టీ మెట్రో అధికారులు యథావిధిగా పదిశాతం డిస్కౌంట్ కొనసాగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

### రద్దీకి అనుగుణంగా రైళ్లను పెంచని మెట్రో

నగరంలోని నాగోల్-రాయదుర్గం, ఎల్బీనగర్-మియాపూర్ , జేబీఎస్-ఎంజీబీఎస్ మూడు కారిడార్లలోని 57 స్టేషన్ గుండా ప్రతిరోజు వెయ్యికిపైగా మెట్రో సర్వీసులు నడుస్తుండగా.. 5లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఉదయం 6 నుంచి రాత్రి 12 గంటల వరకు నడుస్తున్న రైళ్లలో ఎప్పుడూ రద్దీ ఉంటోంది. కాలేజీ విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు మొదలుకుని వివిధ తరగతుల ప్రజలు మెట్రో రైళ్లను వినియోగించుకుంటున్నారు. ముఖ్యంగా నగరంలో ఎలాంటి ట్రాఫిక్ చిక్కులు లేకుండా తక్కువ సమయంలో ప్రజలు, ఉద్యోగులు తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. దాంతో ఉదయం, సాయంత్రం వేళల్లో, సెలవు రోజుల్లో మెట్రో ప్రయాణంపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఇక గత కొన్ని రోజులుగా ఎండలు దంచికొడుతుండటంతో ప్రజలు మెట్రోకి క్యూ కడుతున్నారు. మెట్రో రైళ్లు ఫుల్ రష్‌తో నడుస్తున్నాయి. మెట్రో రైళ్లలో కాలుతీసి కాలుపెట్టలేనంత మంది ప్రయాణికులు జర్నీ చేస్తున్నారు. అయితే రద్దీకి సరిపడ రైళ్లను పెంచని మెట్రో యాజమాన్యం... రాయితీలను ఎత్తి వేయడం ఏంటని ప్రయాణికులు మండిపడుతున్నారు. మెట్రో అధికారులు ఇప్పటికైనా తమ నిర్ణయాన్ని పునరాలోచన చేయాలని ప్రయాణికుల డిమాండ్ చేస్తున్నారు.

# 'భువనగిరి' అభివృద్ధి సీపీఐ(ఎం)తోనే సాధ్యం

- రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్



నవ తెలంగాణ - జనగామ

భువనగిరి పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు నియోజకవర్గాల అభివృద్ధి సీపీఐ(ఎం)తోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ అన్నారు. జనగామ జిల్లా పసరమడ్ల గ్రామంలో గడ్డం ప్రభాకర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో అబ్బాస్ మాట్లాడారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో సీపీఐ(ఎం) నుంచి పోటీ చేస్తున్న ఎండీ జహంగీర్ గెలుపుకు పార్టీలోని ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. గత బీఆర్ఎస్ పాలకుల పుణ్యమా అని భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని విమర్శించారు. పార్లమెంటులో వామపక్షాల బలం తగ్గడంతో బీజేపీ, కార్పొరేట్ శక్తులు పదేండ్ల నుంచి ప్రజా వ్యతిరేక బిల్లులను తీసుకొచ్చి పార్లమెంట్‌లో ఆమోదింపజేసుకుంటున్నాయని ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్యం అత్యంత ప్రమాదంలో పడిందని, భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుంచి ఎంతోమంది అమరవీరులు.. తమ ప్రాణాలను సైతం త్యాగం చేసి పేదలకు 10 లక్షల ఎకరాల భూమి పంచిన చరిత్ర ఎర్రజెండాకు ఉందని గుర్తు చేశారు. అంతటి చరిత్ర కలిగిన ఎర్ర జెండాను ఆదరించి ప్రశ్నించే గొంతును పార్లమెంటుకి పంపించి ప్రజా సమస్యల పరిష్కారానికి భువనగిరి పార్లమెంటు అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఇందుకు భువనగిరి పార్లమెంట్ సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ జహంగీర్ సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సాంబరాజు యాదగిరి, జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజేందర్, నాయకులు అన్నబోయిన రాజు, బెజ్జరమైన మల్లేశం, గంధమాల యాదగిరి, ఎర్రబోయిన కరుణాకర్, బెజ్జరమైన శ్రీను, బోయిని స్వాములు, బోయిని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నెతన్యాహు 'తక్షణమే దిగిపోవాలి'

### వేలాది నిరసనకారుల డిమాండ్



ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు రాజీనామా చేయాలని, గాజాలో ఇప్పటికీ హమాస్ చేతిలో ఉన్న బందీలను తిరిగి తీసుకురావాలని ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్‌లో పదివేల మంది నిరసనకారులు డిమాండ్ చేశారు. ఇజ్రాయెల్ హమాస్‌పై యుద్ధం ప్రకటించినప్పటి నుండి దాదాపు ఆరు నెలల కాలంలో శనివారం సాయంత్రం టెల్ అవీవ్ డెమోక్రసీ స్క్వేర్‌లో సుమారు 100,000 మంది ప్రజలు నిరసన ప్రదర్శన చేశారని నిర్వాహకులు పేర్కొన్నారు. ఇజ్రాయెల్ జెండాలను మోస్తూ, ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ, ప్రదర్శనకారులు ముందస్తు ఎన్నికలకు డిమాండ్ చేశారు. హమాస్ తో ఒప్పందం కుదుర్చుకుని 100 మందికి పైగా బందీలుగావున్న ఇజ్రాయెలీలను విడిపించాలని కోరారు.నెతన్యాహు తన తీవ్రవాద సంకీర్ణ భాగస్వాములను సంతోషపెట్టడానికి ఉద్దేశపూర్వకంగా హమాస్‌తో ఒప్పందం చేసుకోకుండా తప్పించుకుంటున్నాడని గాజాలో బందీగా వున్న వ్యక్తి తండ్రి ఐనవ్ జంగౌకర్ నిరసన ప్రదర్శనకు ముందు జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్ ప్రకారం, "నెతన్యాహు ఈ ఒప్పందాన్ని ఉద్దేశపూర్వకంగా జరగకుండా చేస్తున్నాడు. అతను మాకు, గాజాలోని మా ప్రియమైనవారికి మధ్య అడ్డంకిగా ఉన్నాడు" అని జాన్‌గౌకర్ అన్నాడు. "బందీలకు ఎన్నికలదాకా వేచి ఉండటానికి సమయం లేదు. ఒప్పందానికి ఉన్న అడ్డంకులను ఇప్పుడే తొలగించాలి. అలాగే నెతన్యాహు వెంటనే ప్రధాని పదవినుంచి వైదొలగాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

టెల్ అవీవ్‌లో పెద్దఎత్తున నిరసన ప్రదర్శన జరగటంతో ఈజిప్టు, ఖతార్‌ల మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ చర్చల కోసం ఇజ్రాయెల్, హమాస్ ప్రతినిధులు ఆదివారం కైరోకు వెళ్లడానికి సిద్ధమయ్యారు. నవంబర్ చివరలో తాత్కాలిక కాల్పుల విరమణ కారణంగా ఇజ్రాయెల్ జైళ్లలో ఉన్న 240 మంది పాలస్తీనా ఖైదీల కోసం 105 మంది బందీలను హమాస్ విడుదల చేసింది. హమాస్ ప్రతిపాదించిన బందీల దశలవారీ విడుదలను అంగీకరించడానికి ఇజ్రాయెల్ నిరాకరించింది. మిలిటెంట్లు అంతకంటే తక్కువ దేనినీ అంగీకరించడానికి నిరాకరించారు. ఆ తరువాత వరుసగా చర్చలు విఫలమయ్యాయి. గాజా నుండి పూర్తిగా ఇజ్రాయెల్ ఉపసంహరించుకోవాలని హమాస్, అలాగే హమాస్‌పై ఇజ్రాయెల్ "పూర్తిగా విజయం" సాధించే వరకు ఇజ్రాయెల్ పోరాడుతూనే ఉంటుందని, యుద్ధం ముగిసిన తర్వాత యూదు రాజ్యం గాజాపై "పూర్తి భద్రతా నియంత్రణను" నిర్వహిస్తుందని నెతన్యాహు పట్టుబడుతున్నారు.

అనేక అవినీతి కుంభకోణాలు, వివాదాస్పద న్యాయ సంస్కరణల ప్యాకేజీపై రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దాదాపు ప్రతి వారం పదివేల మంది ప్రజలు నిరసన ప్రదర్శనలు చేసిన నేపథ్యంలో అక్టోబరులో యుద్ధం ప్రారంభం కావడానికి ముందు ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి ప్రజాదరణ కోల్పోయాడు. యుద్ధం కారణంగా ఈ సంవత్సరం ప్రారంభం వరకు నిరసన ప్రదర్శనలు ఆగిపోయాయి. అయితే గత నెల నుండి నిరసన ప్రదర్శనల స్థాయి పెరిగింది.

## ఫ్యామిలీ ప్యాక్..

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ కార్యకర్త ఎలా కష్టపడతారో తాను కూడా అంతే కష్టపడుతున్నానని చెప్పుకొచ్చారు. ఇక కేంద్ర మాజీ మంత్రి, ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి రాజమండ్రి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. ఆమె ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు కుమార్తె అన్న విషయం తెలిసిందే. మహారాష్ట్రలో ఆరుగురు మహిళా అభ్యర్థులు బీజేపీ తరపున పోటీకి దిగారు. ఎన్సీపీతో తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన సిట్టింగ్ ఎంపీ భారతి పవార్ దిన్డోరీలో పోటీ చేస్తున్నారు. ఆమె మామ ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా పనిచేశారు. కుమారుడు కూడా శాసనసభ్యుడే. బీజేపీ ఎంపీ హీనా గవిట్ మూడోసారి విజయం కోసం నందుర్బన్ నుంచి రంగంలో దిగారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన గిరిజన నేత విజయ్ గవిట్‌కు ఆమె కుమార్తె. దివంగత బీజేపీ నేత గోపీనాథ్ ముండే కుమార్తె పంకజ ముండే బీడ్ లోక్‌సభ స్థానంలో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

సిట్టింగ్ ఎంపీ రక్షా ఖడ్సే మరోసారి రావర్ నుంచి పోటీ చేస్తున్నారు. ఆమె మామ ఏక్‌నాథ్ ఖడ్సే 2020లో బీజేపీని వీడి శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీలో చేరారు. జలగావ్‌లో సిట్టింగ్ ఎంపీ ఉన్మేష్ పాటిల్‌కు బీజేపీ టిక్కెట్ నిరాకరించింది. ఎమ్మెల్సీ స్మితా వాఘ్‌ను బరిలో దింపింది. ఆమె భర్త ఉదయ్ వాఘ్ జలగావ్ జిల్లా బీజేపీ అధ్యక్షుడుగా పనిచేస్తున్నారు. సిట్టింగ్ ఎంపీ నవనీత్ రాణా అమరావతి నుంచి పోటీకి దిగారు. ఇప్పటి వరకూ బీజేపీ తరపున మధ్యప్రదేశ్ నుంచి ఆరుగురు మహిళా అభ్యర్థులు హిమాద్రి సింగ్ (షదాల్), సంధ్యారాయ్ (భింద్), లతా వాంఖేడే (సాగర్), అనితా చౌహాన్ (రత్లాం), భారతి పార్ధి (బాగాఘాట్), సావిత్రి ఠాకూర్ (ధార్) పోటీలో ఉన్నారు. వీరిలో సావిత్రి ఠాకూర్ మినహా మిగిలిన వారందరూ రాజకీయ కుటుంబాల నుంచి వచ్చిన వారే.

## మాజీ రాజవంశీకులే...

(మొదటిపేజీ తరువాయి)

జ్యోతి మీర్థా (నాగౌర్), మహిమా విశ్వరాజ్ సింగ్ (రాజ్‌సమంద్) బీజేపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. వీరిలో మహిమా విశ్వరాజ్ సింగ్ రాజకుటుంబానికి చెందిన వారు. ప్రియాంక బాలన్ కుటుంబంలో మాత్రం ఎవరూ రాజకీయాలలో లేరు. మిగిలిన వారందరూ రాజకీయ కుటుంబాలకు చెందిన వారే.ఒడిషాలో ఇప్పటి వరకూ నలుగురు మహిళా అభ్యర్థులను బీజేపీ ఎంపిక చేసింది. వీరిలో ముగ్గురు పేరున్న రాజకీయ కుటుంబాలకు చెందిన వారే. తూర్పు ప్రాంతమైన జార్ఖండ్ నుంచి ముగ్గురు మహిళా అభ్యర్థులు బీజేపీ తరపున పోటీ చేస్తున్నారు. వీరందరికీ రాజకీయ నేపథ్యం ఉంది. బీహార్ నుండి పోటీ చేసేందుకు బీజేపీ ఇప్పటి వరకూ మహిళా అభ్యర్థులను ఎంపిక చేయలేదు. దాద్రా నగర్ హవేలీలో సిట్టింగ్ ఎంపీ కళాబెన్ దేల్కర్‌కే బీజేపీ మరోసారి టిక్కెట్ ఇచ్చింది. హర్యానాలోని అంబాలా నుంచి బీజేపీ తరపున మహిళా అభ్యర్థి పోటీ చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్ నుంచి పోటీ చేస్తున్న రేఖా వర్మ, మేనకా గాంధీ రాజకీయ కుటుంబాల నుంచి వచ్చిన వారే. కాగా రాజకీయ కుటుంబాలకు చెందిన మహిళలకే బీజేపీ టిక్కెట్లు ఇచ్చిందన్న వాదనను ఆ పార్టీ నేతలు తోసిపుచ్చారు. వీరిలో చాలా మంది తొలిసారి ఎన్నికల బరిలో దిగుతున్న వారేనని చెప్పుకొచ్చారు.

## ఈడీ, ఐటీ గూండాగిరీ

- సీపీఐ(ఎం) కేరళ రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిందన్



తిరువనంతపురం : ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి), ఆదాయ పన్ను శాఖలు గూండాయిజాన్ని ప్రదర్శిస్తున్నాయని సీపీఐ(ఎం) కేరళ రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిందన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. సిపిఎం బ్యాంకు ఖాతాలన్నింటినీ చట్టబద్ధంగా నిర్వహిస్తోందని అన్నారు. సీపీఐ(ఎం) త్రిస్సూర్ జిల్లా కమిటీ బ్యాంక్ ఖాతాను ఆదాయపన్ను శాఖ అధికారులు స్తంభింపచేశారు. పార్టీకి శనివారం రాత్రి నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ అంశాన్ని చట్టపరంగా సవాలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ చర్య పార్టీని భయభ్రాంతులకు గురిచేసే యత్నమని అన్నారు. ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాటంలో దాడిని ఎదుర్కోవలసిందేనని అన్నారు. చట్టబద్ధం కాని ప్రతీది చట్టబద్ధంగా వ్యవహరించాలని ఉద్దేశించింది. త్రిసూర్‌లో ఖాతాల గురించి పార్టీ నాయకత్వానికి తెలుసు. వాస్తవానికి అన్ని ఖాతాలు కేంద్రానికి ఇచ్చామని అన్నారు. వారికి తెలియని ఒప్పందం ఏమైనా ఉందా, అంతా పారదర్శకం కాదా అని ప్రశ్నించారు. 14 జిల్లాల, రాష్ట్ర కమిటీల ఖాతాలను కూడా ఇచ్చామని అన్నారు.

### పెరుగుతున్న ఖర్చులను తట్టుకోవడానికి

## అమెరికన్లు భోజనం మానేస్తున్నారు - పోల్



సగం మంది అమెరికన్లు తమ పెరుగుతున్న గృహ నిర్వహణ ఖర్చులను భరించలేక ఇబ్బంది పడుతున్నారని, చాలా మందికి ఆర్థిక ఒత్తిడి చాలా తీవ్రంగా ఉందని, ప్రతి ఐదుగురిలో ఒకరు భోజనాన్ని మానేస్తున్నారని ఒక కొత్త పోల్ వెల్లడించింది. సీటెల్ ఆధారిత రియల్ ఎస్టేట్ బ్రోకరేజ్ రెడ్‌ఫిన్ ఆధ్వర్యంలో శుక్రవారం విడుదల చేసిన సర్వేలో 50శాతం అమెరికా గృహ యజమానులు, అద్దెకు వున్నవాళ్ల తమ గృహ అవసరాలకు చేయవలసిన చెల్లింపులు చేయడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుస్తోంది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను ఎదుర్కోవటం కష్టంగా వుందని చాలా మంది తెలిపారు. ఉదాహరణకు 22 శాతం మంది భోజనానికి దూరంగా ఉన్నారని, 21శాతం మంది తమ వస్తువులలో కొన్నింటిని విక్రయించారని, 37 శాతం మంది అదనపు గంటలు పని చేశారని లేదా అదనపు ఉద్యోగాలను తీసుకున్నారని ఈ సర్వేలో తేలింది."అమెరికాలో గృహనిర్మాణం చాలా ఆర్థిక భారంగా మారింది. కొన్ని కుటుంబాలు ఇకపై ఆహారం, వైద్య సంరక్షణతో సహా ఇతర నిత్యావసరాలను కొనుగోలు చేయలేవు. అనివార్యంగా ఈ కుటుంబాలు అనేక త్యాగాలు చేయవలసి వస్తోంది. తమ నెలవారీ ఖర్చులను భరించటం కోసం ఓవర్ టైం పని చేయడం, అప్పులు చేయటం తప్పటం లేదు" అని రెడ్‌ఫిన్ ఆర్థిక పరిశోధనా చీఫ్ చెన్ జావో తెలిపారు. అనేక అమెరికా నగరాల్లో గృహాల ధరలు, అద్దెలు బాగా పెరిగాయి. గత అక్టోబర్‌లో అవి 23 సంవత్సరాల గరిష్ట స్థాయికి చేరుకున్న తర్వాత తనఖా రేట్లు పెంచబడ్డాయి. మధ్యస్థ ధర కలిగిన ఇంటిని కొనుగోలు చేయడానికి అవసరమైన స్థాయి కంటే సాధారణ అమెరికా గృహ ఆదాయం సంవత్సరానికి 30,000 డాలర్లు తక్కువగా ఉంటుందని రెడ్‌ఫిన్ తెలిపింది.దాదాపు 35 శాతం మంది తమ హౌసింగ్ చెల్లింపులను కొనసాగించడానికి తక్కువ సెలవులు తీసుకుంటున్నారని లేదా ఏదీ తీసుకోలేదని చెప్పారు. సుమారు 18 శాతం మంది స్నేహితులు, కుటుంబ సభ్యుల నుండి డబ్బును అప్పుగా తీసుకున్నారు లేదా వారి పదవీ విరమణ పొదుపును వాడారు. 16 శాతం మందికి నగదు కొరత కారణంగా వారు వైద్య సంరక్షణను ఆలస్యం చేయవలసి వచ్చింది లేదా వదులుకోవాల్సి వచ్చింది. అమెరికా ద్రవ్యోల్బణం రేటు జూన్ 2022లో 40 సంవత్సరాలలో అత్యధిక స్థాయికి పెరిగినందున ధరలను తగ్గించే ప్రయత్నంలో వడ్డీ రేట్లను పెంచడానికి ఫెడరల్ రిజర్వ్ నిర్ణయించింది. అప్పటి నుండి ద్రవ్యోల్బణం వేగం తగ్గింది.అయితే ఆర్థికవేత్తలు ఊహించిన దాని కంటే ఎక్కువగా ఫిబ్రవరికి ముందు ఒక సంవత్సరం ధరలు 3.2 శాతం పెరిగాయి. అమెరికా సెంట్రల్ బ్యాంక్ త్వరలో వడ్డీ రేట్లను తగ్గిస్తుందనే ఆశలను ఈ పెరుగుదల మసకబార్చింది. చాలా మంది యువ అమెరికన్లకు తమ అపార్ట్ మెంట్‌లను వదులుకొని వారి తల్లిదండ్రులతో జీవించవలసిన పరిస్థితి ఏర్పడింది. గత సెప్టెంబరులో హారిస్/బ్లూమ్‌బెర్గ్ నిర్వహించిన పోల్‌లో 18 నుండి 29 సంవత్సరాల వయస్సు గల వారిలో 45 శాతం మంది తమ తల్లిదండ్రులు లేదా ఇతర బంధువులతో కలిసి నివసిస్తున్నారని తేలింది. 1940ల తరువాత ఇంతటి స్థాయిలో ఇది ఎన్నడూ లేదు.

ప్రపంచ గమనం

## బీటీ రణదివే గొప్ప విప్లవకారుడు

- సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు



**నవతెలంగాణ-సిటీబ్యూరో**

బీటీ రణదివే గొప్ప విప్లవకారుడు, మేధావి అని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు కొనియాడారు. బీటీ రణదివే వర్ధంతి సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఈసీఐఎల్ కమలానగర్‌లోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో 'సామాజిక సమస్యలు-కార్మిక వర్గం కర్తవ్యం' అంశంపై నాయకులు శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆనాడు బీటీ రణదివే విషయాలు నేడు అక్షర సత్యాలు అవుతున్నాయని గుర్తు చేసుకున్నారు. కుల నిర్మూలనకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేయాలని ఆనాడే బీటీ పిలుపునిచ్చారని, ఆయన చెప్పినట్టుగా నేటికీ కుల వివక్షత, కార్మిక దోపిడీ జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 14 రోజులు నిర్వహించే వారోత్సవాల్లో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. బీటీ ఆశయ సాధనకు కృషి చేసి, ఆయన మార్గంలో నడవడమే మనం ఆయనకు ఇచ్చే నివాళి అని తెలిపారు. సీఐటీయూ రాష్ట్ర నాయకులు ప్రసాద్ మాట్లాడుతూ.. బీటీ అనేక పోరాటాలు చేశారని, మహిళలు, కార్మికులను పోరాటబాట పట్టించారని గుర్తు చేసుకున్నారు. కార్మిక ఐక్యత కోసం కృషి చేశారన్నారు. కోవిడ్ సమయంలో చాలా కంపెనీలు మూత పడటంతో కార్మికులు రోడ్డున పడ్డారని, రోజురోజుకు దేశంలో నిరుద్యోగ సమస్య పెరిగిపోతోందని తెలిపారు. ఆకలి చావులు కూడా ఎక్కువయ్యాయని, లక్షా 27 వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్టు వెల్లడించారు. పాలకుల ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. గత ఎన్నికల సమయంలో ప్రధాని మోడీ ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. మీడియా మొత్తాన్ని బీజేపీ కొనేసిందని, సమస్యలపై మీడియాలో ఇటీవల చర్చలు జరగడం లేదని వాపోయారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఐక్య పోరాటాల కోసమే సీఐటీయూ ఏర్పాటయిందన్నారు. ఆర్ఎస్ఎస్ బలపడి ప్రజలు, మతాల మధ్య చిచ్చు పెడుతోందని దుయ్యబట్టారు. ముస్లింలు దేశ ద్రోహులు అనేలా బీజేపీ వ్యవహరిస్తోందని.. మతసామరస్యాన్ని కాపాడుకోవడానికి సీఐటీయూ అండగా ఉంటుందన్నారు. సీఐటీయూ బలపడితే తప్ప మతోన్మాదాన్ని తిప్పి కొట్టలేమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు చెరువులో పడి.. ఇద్దరు మృతి

- సాలూర క్యాంప్ గ్రామంలో విషాదఛాయలు

**నవతెలంగాణ-బోధన్**



ప్రమాదవశాత్తు చెరువులో పడి ఇద్దరు మృతి చెందిన ఘటన నిజామాబాద్ జిల్లా సాలూర మండలంలోని కుమ్మన్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. బోధన్ రూరల్ ఎస్ఐ నాగనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. సాలూర క్యాంప్ గ్రామానికి చెందిన గాదే మనోజ్‌రెడ్డి (22), మనోజ్ కుమార్ (22) యువకులిద్దరూ స్నేహితులు. ఎప్పటిలాగే ఇద్దరూ కలిసి శనివారం సాయంకాలం నడకలో భాగంగా కుమ్మన్‌పల్లి చెరువు వైపు వెళ్లారు. అక్కడ వారి కాళ్లకు బురద అంటుకోవడంతో కడుక్కోవడానికి చెరువులోకి దిగగా ప్రమాదవశాత్తు కాలుజారి పడ్డారు. ఈ క్రమంలో వారికి ఈత రాకపోవడంతో చెరువులో మునిగిపోయారు. వారిద్దరూ ఎంతకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు పలుచోట్ల గాలించారు. వారి ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం చెరువు వైపు వెళ్ళిన స్థానికులకు మృతదేహాలు నీటిపై తేలుతూ కనిపించాయి. దీంతో వారు బోధన్ రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను గజ ఈతగాళ్ల సహాయంతో వెలికితీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చేతికందివచ్చిన కుమారులు ఇలా ప్రమాదవశాత్తు మృతి చెందడంతో ఇరు కుటుంబ సభ్యులు తీవ్రంగా రోదించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నాగనాథ్ తెలిపారు.

## బండ్లగూడ రత్నదీప్ సూపర్ మార్కెట్‌లో అగ్ని ప్రమాదం

- మరమ్మతులు చేస్తుండగా చెలరేగిన మంటలు
- పరుగులు పెట్టిన సిబ్బంది
- మంటలను అదుపు చేసిన ఫైర్‌ఇంజన్లు




**నవతెలంగాణ-గండిపేట్**

రంగారెడ్డి జిల్లా బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలో ప్రారంభానికి సిద్ధమవుతున్న రత్నదీప్ సూపర్ మార్కెట్‌లో ఆదివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ సన్‌సిటీలోని రత్నదీప్ సూపర్ మార్కెట్‌లో మరమ్మతులు చేస్తుండగా మంటలు చెలరేగాయి. మంటలతో దట్టమైన పొగ వ్యాపించడంతో రత్నదీప్ యాజమానులు, సిబ్బంది బయటకు పరుగులు తీశారు. వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో రెండు ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశాయి. అలాగే నార్సింగి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, వారు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటనకు గల కారణాలపై ఆరా తీశారు. ఈ ఘటనలో స్టోర్ ప్రారంభానికి తీసుకు వచ్చిన వస్తువులు, ప్లాస్టిక్ కుర్చీలు, టేబుల్స్, ఇతర సామాగ్రి పూర్తిగా కాలి బూడిదైపోయాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. అయితే రత్నదీప్ సూపర్ మార్కెట్ యజమాన్యం ఎలాంటి ఫైర్ నిబంధనలను పాటించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు, అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఘటనకు గల కారణాలపై ఆరా తీశారు.



## వడదెబ్బతో మహిళ మృతి

**నవతెలంగాణ-కోదాడరూరల్**

వడదెబ్బతో మహిళ మృతి చెందిన సంఘటన సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలో తొగర్రాయి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కన్నెబోయిన కోటమ్మ (50) కూలి పని చేసుకుంటూ జీవనం సాగించేది. వేసవి తాపానికి తట్టుకోలేక వడదెబ్బ తగిలి ఆదివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, అమరనేని వెంకటేశ్వర్‌రావు, గ్రామస్తులు ఆమె మతదేహానికి సంఘీభావం తెలుపుతూ ఘన నివాళులర్పించారు. మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు.

# బడుల్లో కీచకులు



- అభం శుభం తెలియని విద్యార్థినుల పట్ల.. పలువురి ఉపాధ్యాయుల అసభ్య ప్రవర్తన
- గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించే సమయంలో.. వెలుగులోకి వస్తున్న ఉపాధ్యాయుల తీరు
- వారిలో నైతిక విలువలు పెంపొందించేలా.. శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలని పలువురి సూచనలు

**నవతెలంగాణ-లింగంపేట్**

కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలంలో ఓ గ్రామంలోని పాఠశాలలో పని చేస్తున్న ప్రవీణ్ అనే ఉపాధ్యాయుడు.. విద్యార్థినులను ఎక్కడ పడితే అక్కడ టచ్ చేస్తూ.. ఒంటరిగా తీసుకెళ్తూ పత్రికలో రాయలేని విధంగా అసభ్యంగా ప్రవర్తించేవాడు. ఇటీవల ఫోక్సో కింద కేసు నమోదు కావడంతో సస్పెండ్ అయ్యారు.

ఈ ఘటన మరువకముందే.. 15 రోజుల వ్యవధిలో లింగంపేట్ మండలంలోని ఓ పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు పండితులు శ్రీనివాస్ శర్మ విద్యార్థినులతో కాకుండా ఉపాధ్యాయినీలతో సైతం అసభ్యంగా ప్రవర్తించేవాడు. ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయుల సమక్షంలో రెండు నెలల క్రితం పద్ధతి మార్చుకోవాలని హెచ్చరిక సైతం చేశారు. దాంతో సదరు ఉపాధ్యాయుడు స్కూళ్లో ఉన్న బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం ప్రారంభించాడు. మద్యం తాగి విధులకు వస్తూ విద్యార్థుల భుజం మీద చేతులు వేయడం, దగ్గరికి తీసుకోవడం లాంటి పనులు చేసినట్టు సమాచారం. దాంతో విద్యార్థినులు వారి తల్లిదండ్రులకు చెప్పారు. తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయునికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. బిచ్కుందలో సైతం ఇలాంటి ఘటనలు చోటుచేసుకోగా.. సదరు ఉపాధ్యాయుడిని స్థానికులు చితకబాదారు. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలో సైతం ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంది.

ఇలాంటి ఎన్నో ఘటనలు ఇటీవల కాలంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో చోటుచేసుకున్నాయి. బావిభారత పౌరులను తీర్చేదిద్దాల్సిన కొందరు ఉపాధ్యాయులు.. వారి వృత్తికే మాయని మచ్చగా మారుతున్నారు. విద్యాబుద్ధులు నేర్పాల్సింది పోయి.. అభం శుభం తెలియని విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ కీచకులుగా మారుతున్నారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై స్కూళ్లల్లో అవగాహన కల్పిస్తున్న సమయాల్లో విద్యార్థినులు తమ బాధలను చెప్పుకుంటూ బోరుమంటున్నారు. పలువురు ఉపాధ్యాయులు తమతో అదే విధంగా ప్రవర్తిస్తున్నట్టు వాపోతున్నారు.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 24 మండలాల్లో 1257 ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ఒక లక్షా పదివేల మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. వారికి 3800 మందికిపైగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు. నేటి సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి చాలా గౌరవం ఉన్నది. ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైంది. విద్యార్థిని విద్యార్థుల దశ దిశ మార్చేది వారే. కానీ కొంతమంది ఉపాధ్యాయులు తమ విలువను దిగజార్చుకుంటూ బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తుండటంతో రోజురోజుకూ ఉపాధ్యాయుల నైతిక విలువలు దిగజారిపోతున్నాయి. ఇలాంటి ఘటనల్లో పలువురు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకున్నా, ఉపాధ్యాయులను చితకబాది చర్యలు తీసుకున్నా.. ఇప్పటివరకు వారి తీరుమాత్రం మారడం లేదు.

### గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌తో ఉపాధ్యాయుల తీరు వెలుగులోకి..

షీ టీం ఆధ్వర్యంలో ఇటీవల స్కూళ్లలో విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గుడ్ టచ్, బ్యాట్ టచ్‌పై విద్యార్థినులకు విశదీకరిస్తూ చెప్తుండటంతో.. పలువురు విద్యార్థినులు షీ టీం ఎదుట బోరున విలపిస్తున్నారు. తమను ఉపాధ్యాయులు అదే విధంగా టచ్ చేస్తున్నారంటూ కన్నీరు పెట్టుకుంటున్నారు. నాగిరెడ్డిపేట్‌లో ప్రవీణ్, లింగంపేట్‌లో శ్రీనివాస్‌శర్మ తీరు షీ టీమ్ ద్వారానే వెలుగులోకి వచ్చింది. ఆయా స్కూళ్లలో అవగాహన కల్పించినప్పుడు విద్యార్థినులు సదరు ఉపాధ్యాయుల తీరుపై వివరించడంతో వారు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దాంతో పోలీసులు వచ్చి విచారణ చేపట్టి ఉపాధ్యాయ ముసుగులో ఉన్న కీచకలపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కటకటాలకు పంపారు.

### షీ టీమ్ పనితీరు కీలకం

పోలీస్ శాఖ సైతం స్పందించి షీ టీమ్‌లను మరింత మెరుగుపరిచి ప్రభుత్వ, ప్రయివేటు స్కూళ్లల్లో నిరంతరం గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలి. విద్యార్థినుల్లో మానసిక స్థైర్యం పెంపొందించేలా.. ఉపాధ్యాయులు అసభ్యంగా ప్రవర్తించినప్పుడు ఆ విషయం ప్రధానోపాధ్యాయుల దృష్టికి, కుటుంబీకుల దృష్టికి తీసుకెళ్లాలా వారికి అవగాహన కల్పించాలి. అప్పుడే ఇలాంటి కీచకుల ఆటకట్టించవచ్చు. అదే విధంగా విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకొని, వారిపై తీసుకుంటున్న కఠిన చర్యలను ఎప్పటికప్పుడు బహిరంగంగా ప్రకటిస్తే.. కీచకల్లో మార్పు వచ్చే అవకాశం ఉంది.

### మారుమూల ప్రాంతాల స్కూళ్లల్లో పెరుగుతున్న ఘటనలు..

ఎంఈవోల కొరత, ప్రధానోపాధ్యాయులకు క్లస్టర్ బాధ్యతలు ఇవ్వడంతో మారుమూల గ్రామాల్లోని స్కూళ్లల్లో పర్యవేక్షణ కొరవడింది. దాంతో పలువురు ఉపాధ్యాయులు చదువు చెప్పడంలో శ్రద్ధ చూపెడుతూ దారితప్పి తప్పటడుగులు వేస్తున్నారు. ఇప్పటి వరకు వెలుగుజూసిన ఘటనలు ఎక్కువగా మారుమూల గ్రామాల్లో చోటుచేసుకున్నవే. కొంతమంది బాలికలు బయటకు చెప్పుకోలేక, తల్లిదండ్రులకు చెప్పుకోలేక కుమిలిపోతున్నారు. మరికొన్ని పాఠశాలల్లో ఇలాంటి ఘటనలు బయటకు రాకుండా గోప్యంగా ఉంచుతున్నారు.

### ఉపాధ్యాయుల్లో నైతిక విలువలు పెంచాలి

విద్యాశాఖాధికారులు స్పందించి ఉపాధ్యాయులకు వృత్తి, నైతిక విలువలపై ప్రత్యేక సదస్సులు నిర్వహించాలి. అప్పుడైనా ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా నివారించే అవకాశం ఉంది. అధికారుల పర్యవేక్షణ లేక పలువురు ఉపాధ్యాయులు మద్యం సేవించి మరీ విధులకు హాజరవుతున్నారు. పలుసార్లు మందలించినా వారి ప్రవర్తన మార్చుకోలేదు. విద్యార్థి విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ మద్యం మత్తులో ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నట్టు సమాచారం. వృత్తి ధర్మం, ప్రవర్తన, ఉపాధ్యాయ శైలి, బోధన విధానం, విద్యార్థినీ విద్యార్థుల పట్ల మాట్లాడే విధానంపై ప్రత్యేకంగా సదస్సులు నిర్వహించాల్సిన అవసరం ఉంది.

## ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడేది కమ్యూనిస్టులే

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండ శ్రీశైలం
- భువనగిరి ఎంపీ అభ్యర్థి జహంగీర్ తరపున ఇంటింటి ప్రచారం



**నవతెలంగాణ-చండూరు**

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండ శ్రీశైలం అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా చండూరు మండలం నేర్మట గ్రామంలో భువనగిరి పార్లమెంట్ సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ జహంగీర్ గెలుపు కోసం ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భువనగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో కమ్యూనిస్టులు ప్రాతినిధ్యం వహించి అభివృద్ధి చేశారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టులను గెలిపించుకోవాలని కోరారు. తెలంగాణ ప్రాంత అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తూ, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వివక్ష చూపిందని, ఓటు అడిగే నైతిక హక్కు బీజేపీకి లేదన్నారు. అభ్యుదయ వాదులకు, అవకాశవాదులకు మధ్య ఈ పోటీ కొనసాగుతుందన్నారు. డబ్బులు వెదజల్లి గెలవాలని చూస్తున్న పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ ప్రాంతంలో భూ పోరాటాలతో పాటు, తాగు, సాగునీటి కోసం అవిశ్రాంత పోరాటాలు నిర్వహించి సాధించామని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసి సమస్యల పరిష్కారానికి ఉద్యమించే తత్వం కమ్యూనిస్టులకు మాత్రమే ఉందన్నారు. గత యూపీఏ ప్రభుత్వంలో వామపక్షాల బలం ఉన్న కారణంగానే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కుల చట్టాన్ని సాధించుకున్నామని గుర్తుచేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) చండూరు మండల కార్యదర్శి మొగుదాల వెంకటేశం, నాయకులు జెర్రిపోతుల ధనంజయగౌడ్, సీనియర్ నాయకులు అంతిరెడ్డి, సీపీఐ(ఎం) గ్రామ నాయకులు ఈరటి వెంకన్న, బుర్కల అంజయ్యగౌడ్, ఈరగట్ల స్వామి, బల్లెం స్వామి, కొత్తపల్లి లక్ష్మమ్మ, యాదయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణతోనే దేశం బలోపేతం

- లండన్‌లో ప్రజాదీవెన సభ
- టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ వేణుగోపాల్

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

రాజ్యాంగ పరిరక్షణతోనే దేశం బలోపేతమవుతోందని టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ గంప వేణుగోపాల్ తెలిపారు. ఆదివారం లండన్‌లో ప్రజాదీవెన సభ పేరుతో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, మానవ హక్కులకు రక్షణ ఉండాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వంలో అనేక చట్ట ఉల్లంఘనలు జరిగాయని తెలిపారు. ఎలక్టోరల్ బాండ్ విధానం ద్వారా బీజేపీ ప్రపంచ చరిత్రలోనే అతి పెద్ద అవినీతికి పాల్పడిందని, ఒక్క అరబిందో ఫార్మా ద్వారానే 50మిలియన్లను బీజేపీ తీసుకున్నదని ఆరోపించారు. ఇందులో బీఆర్ఎస్ కూడా తక్కువేమీ కాదని విమర్శించారు. బీజేపీ పాలనలో మీడియా సంస్థలతో పాటు ప్రతిపక్ష పార్టీలపై నియంతృత్వం కొనసాగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన కార్యదర్శి శ్రీధర్ నీలా అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ ఎన్నారై సెల్ కో కన్వీనర్ సుధాకర్ గౌడ్, టీపీసీసీ కార్యవర్గ సభ్యులు శీలం శ్రీనివాస్ రెడ్డి, మధుకర్ రెడ్డి, అమర పాల్ రెడ్డి, మరుపల్లి అవినాష్ గౌడ్, అభినవ్ రెడ్డి, కిట్టు రెడ్డి, రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గూటికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం



**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో ఆయన హస్తం గూటికి చేరారు. సీఎం రేవంత్ ఆయనకు కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ కీలక నేత, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి అనుచరుడిగా ఉన్న తెల్లం వెంకట్రావ్ శనివారం జరిగిన తక్కుగూడలో కాంగ్రెస్ నిర్వహించిన జనజాతర సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వేదికపై ఆయన రాహుల్‌గాంధీని కలిశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## రూ.2500కే దిక్కులేదు..రూ.లక్ష ఇస్తారంట..

- పంచ న్యాయాల పేరుతో పంగనామాలకు తెర : ఓబీసీ మోర్చా డైరీ ఆవిష్కరణలో ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇస్తామన్న రూ.2,500కే దిక్కు లేదుగానీ దేశవ్యాప్తంగా ఒక్కో మహిళకు లక్షరూపాయలిస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ ఎద్దేవాచేశారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఓబీసీ మోర్చా తెలంగాణ శాఖ డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ సామాజిక న్యాయం గురించి మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్టుందన్నారు. అంబేద్కర్‌ను కాంగ్రెస్ పార్టీ అవమానించి ఆయన ఫొటోను వాడుకుంటున్నదని విమర్శించారు. చరణ్‌సింగ్, పీవీ నర్సింహారావులను కాంగ్రెస్ అవమానిస్తే మోడీ ప్రభుత్వం భారతరత్న ఇచ్చి గౌరవించిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాజకీయంగా మోడీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందనీ, దానికి క్యాబినెట్‌లోని మంత్రుల సంఖ్యనే నిదర్శనమని వెల్లడించారు. ఆదివాసీ బిడ్డ అయిన రాష్ట్రపతి ద్రౌపదిముర్మును ఓడించడానికి కాంగ్రెస్ ప్రయత్నించిందని విమర్శించారు.

# పేదల కన్నీళ్లు తుడిచేది సీపీఐ(ఎం) మాత్రమే..

- గుడిసెవాసులకు అండగా ఉంటాం
- బెదిరింపులకు భయపడేది లేదు
- ప్రభుత్వం.. రియల్ ఎస్టేట్ల వైపా? పేదల వైపా?
- స్టాలిన్ నగర్‌ను సందర్శించిన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్, మల్లు లక్ష్మి




**నవతెలంగాణ-కాశిబుగ్గ**

తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వ భూమిలో పేదలకు ఇంటి స్థలాలతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. రియల్ ఎస్టేట్ వ్యాపారుల వైపా.. పేదల వైపు.. ఉంటుందో తేల్చుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్, మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ పరిధి పైడిపల్లి శివారులోని ఎస్సారెస్పీ కాలువ సమీపంలో స్టాలిన్ నగర్ పేరుతో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పేదలు వేసుకున్న గుడిసెలను శనివారం తెల్లవారుజామున అధికారులు కూల్చివేసిన విషయం తెలిసిందే. కాగా, ఆదివారం సీపీఐ(ఎం) సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్, మల్లు లక్ష్మితో పాటు మరికొందరు బృందం ఆ కాలనీని సందర్శించి అండగా ఉంటామని బాధితులకు భరోసా నిచ్చారు. అనంతరం స్టాలిన్‌నగర్ వ్యవస్థాపక అధ్యక్షులు అక్కనపల్లి యాదగిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాగర్ మాట్లాడారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు 125 గజాల ఇంటి స్థలంతో పాటు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కట్టిస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేకపోయిందని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం.. పేదలకు ప్రభుత్వ స్థలంలో పట్టాలిచ్చి పక్కా ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షలు ఆర్థిక సహాయం అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇవ్వడంతో పేదలు కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చారని గుర్తుచేశారు.

ఈ క్రమంలో పైడిపల్లి శివారులోని ఎస్సారెస్పీ కాలువ సమీపంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రెండేండ్ల క్రితం 1560 నిరుపేద కుటుంబాలు వేసుకున్న గుడిసెలకు పట్టాలిచ్చి ఇంటి నిర్మాణానికి సహాయం చేయవలసిన ప్రభుత్వం అర్ధరాత్రి ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా జేసీబీలతో కూల్చడం హేయమైన చర్య అని అన్నారు. కూలీ, నాలి చేసుకునే పేదలు.. ఒక్కొక్కరు రూ.30 వేల నుంచి లక్ష రూపాయల వరకు అప్పులు చేసి నిర్మించుకున్న ఇండ్లను నిర్ధాక్షణంగా కూల్చడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ప్రభుత్వ బెదిరింపులకు భయపడేది లేదని, స్టాలిన్‌నగర్ గుడిసె వాసులకు న్యాయం జరిగే వరకూ సీపీఐ(ఎం) అండగా ఉంటుందన్నారు.

అనంతరం మల్లు లక్ష్మీ మాట్లాడుతూ.. వృద్ధులు, మహిళలు చిన్నపిల్లలు నిద్రలో ఉండగా అర్ధరాత్రి వేళ పోలీసులు పేదల ఇండ్లను కూల్చడమే కాకుండా మహిళల పట్ల దురుసుగా ప్రవర్తించడం బాధాకరమన్నారు. వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ పార్టీ నాయకులు ఆక్రమిస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర కమిటీ సభ్యులు సైలాబ్‌బాబు మాట్లాడుతూ.. దళితులు, మైనారిటీలు వెనుకబడిన తరగతులకు చెందిన పేదలు నివాసం ఉంటున్న గుడిసెలను తొలగించిన అధికారులు.. ధనవంతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకున్న ప్రభుత్వ స్థలాల జోలికి ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రమేష్ మాట్లాడుతూ.. విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు నివాస స్థలాల కోసం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకుంటే వాటిని ప్రభుత్వం తొలగించడాన్ని ఖండిస్తున్నట్టు చెప్పారు. సీపీఐ(ఎం) వరంగల్ జిల్లా కార్యదర్శి రంగయ్య మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాలో 30ఏండ్లుగా అనేక భూపోరాట కేంద్రాలు నిర్మించి వేలాదిమందికి ఇంటి స్థలాలు ఇచ్చిన చరిత్ర సీపీఐ(ఎం)దని గుర్తుచేశారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో స్టాలిన్‌నగర్ పేరుతో పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించడం బాధాకరమని, తక్షణమే గుడిసెలు తొలగించిన ప్రభుత్వ భూమిలోని ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కాసు మాధవి మాట్లాడుతూ.. పేదరికంలో ఉన్న వందలాదిమంది కార్మిక కుటుంబాలు స్టాలిన్ నగర్‌లో గుడిసెలు వేసుకుంటే అర్ధరాత్రి దాడి చేసి తొలగించడం బాధాకరమని వారికి న్యాయం జరిగే వరకు సీఐటీయూ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) వరంగల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈసంపల్లి బాబు, గోనె కుమారస్వామి జిల్లా కమిటీ సభ్యులు ఎం.సాగర్, నామిండ్ల స్వామి, హనుమకొండ శ్రీధర్, ఆరూరి కుమార్, కాశిబుగ్గ ఏరియా కార్యదర్శి ఎండీ బషీర్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి దుర్గయ్య, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సాంబమూర్తి, స్టాలిన్ నగర్ నాయకులు రవిరాకుల ప్రసంగి, సుస్మిత, రాజలింగం, శ్రీనివాస్, పాషా, నాగరాజు, రవి, శివకుమార్, సమ్మక్క, అనిత, మంజుల, ఉమా, మొగిలి, గౌస్ పాషా, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

## బహుదూర్ పుర అసెంబ్లీ కో-ఆర్డినేటర్‌గా కే.సంజయ్ కుమార్ యాదవ్ నియామకం



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ లోని బహుదూర్ పుర అసెంబ్లీ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినే కోఆర్డినేటర్‌గా మాజీ పీసీసీ కార్యదర్శి కే సంజయ్ కుమార్ యాదవ్‌ను టీపీసీసీ నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎం పి అభ్యర్థి ని గెలిపించేందుకు కృషి చేస్తానన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.

## మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసినా నివేదిత

### ఉప ఎన్నికల టికెట్ నివేదితకే అని భరోసా ఇచ్చిన కేసీఆర్

నవతెలంగాణ-కంటోన్మెంట్



దివంగతఎమ్మెల్యే లాస్య నందిత సోదరి నివేదిత ఆదివారం సాయంత్రం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మర్యా ద పూర్వకంగా కలిశారు. కేసీఆర్‌కు పుష్పగు పుష్పగుచాలు అందజేశారు. ఈ సం దర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ ఉప ఎన్ని కల టికెట్ తనకే ఇస్తానని భరోసా ఇచ్చి నట్టు సమాచారం. మల్కాజగిరి పార్లమె ంటరీ బీఆర్ ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి శ్రీనివాస్. కార్పొరేటర్ ఆకుల రూప తదితరులు మాజీ ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి కేసీఆర్ ను కలిసిన వారిలో ఉన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-ఓయూ

ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఆదివారం సికింద్రాబాద్ నియోజకవర్గం సీతాఫల్మండి చౌరస్తాలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీల ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎంఎస్పీ సీతాఫల్మండి డివిజన్ కన్వీనర్ ఎన్. సీతారాం మాదిగ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఎంఎస్పీ హైదరా బాద్ జిల్లా అధికార ప్రతినిధి డప్పుమల్లికార్జున్ మాదిగ మాట్లాడుతూ ఇటీవలే కాంగ్రెస్ ప్రకటిం చిన పార్లమెంట్ స్థానాల్లో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు స్థానం కల్పించకుండా చేసిన తీవ్రమైన అన్యాయాన్ని నిరసిస్తూ రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసిన్నట్లు చెప్పారు. సీఎం కు మాదిగల ఓట్లు అడిగే నైతిక హక్కు కోల్పోయాడన్నారు. కాంగ్రెస్ మాదిగలకే కాదు బీసీలకు కూడా అన్యాయం చేసిందని 4శాతం లేని రెడ్లకు 6 స్థానాలు కేటాయించి, 50శాతం ఉన్న బీసీలకు 2 స్థానాలు, మాదిగలకు గుండు "సున్నా" పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్రం అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ సికింద్రాబాద్ ఇన్‌చార్జి తుమ్మల శివప్రసాద్ మాదిగ, నాయకులు దయ్యాల నర్సింగ్ రావు మాదిగ గసగంటి విజయకుమార్ మాదిగ మహేందర్‌మాదిగ , దేవేందర్ మాదిగ, నాయకురాలు సూరారం సుజాత మాదిగ, మురళీధర్ మాదిగ పాల్గొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికల సీఎం రివ్యూ సమావేశంలో పాల్గొన్న ఆదం సంతోష్



నవతెలంగాణ-ఓయూ

సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం ఏర్పాటు చేసిన సికింద్రాబాద్ పార్లమెంట్ రివ్యూ సమా వేశం లో సికింద్రాబాద్ కంటెస్టడ్ ఎమ్మెల్యే అభ్యర్థి అదం సంతోష్ కుమార్, అయిన తనయుడు రాష్ట్ర ఎన్ఎస్‌యుఐ ఉపాధ్యక్షుడు అదం సృజన్ కుమార్ పాల్గొన్నారు. రానున్న ఎన్నికల్లో సికింద్రాబాద్ అభ్యర్థి గెలుపు కోసం ముమ్మరంగా ప్రచారం చేయడంతో పాటుగా పార్టీ అమలు చేస్తున్న పథకాలు ప్రజల్లోకి తీసుకు పోతున్నట్లు తెలిపారు. సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో పలు వురు వివిధ పార్టీల నేతలు కార్యకర్తలు ఆకర్షించేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ జన్మదిన వేడుకలు



### శుభాకాంక్షలు తెలిపిన నేతలు, కార్యకర్తలు

నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ శాసనసభ్యుడు, బీఆర్ఎస్. సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావుగౌడ్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సికింద్రా బాద్ లోని పద్మారావు గౌడ్ నివాసం నేతలు, కార్యకర్తలతో సందడిగా మారింది. తొలుత బంజారా హిల్స్ లోని తెలంగాణా భవన్‌లో నగరానికి చెందిన ఎంఎల్ఏ లు, నేతల సమక్షంలో పద్మారావు గౌడ్ జన్మ దిన వేడుకలు నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి, మిఠాయిలు పంచడంతో పాటు పద్మా రావు గౌడ్‌గౌడ్ ను ఘనంగా సత్కరించారు. వారితోపాటు కార్పొరేటర్లు, నాయకులు, ఉద్యమ కారులు పాల్గొన్నారు. తెలంగాణా తొలి ముఖ్యమంత్రి కెసిఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామా రావులతో పాటు పలువురు ప్రముఖులు పద్మారావు గౌడ్‌కు ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మోండా మార్కెట్ లోని తన నివాసంలో పద్మారావుగౌడ్‌ను కార్పొరేటర్లు, నేతలు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. వివిధ డివిజన్లలో నేతలు ఈ సందర్భంగా పలు సేవ కార్యక్రమాలు నిర్వహించారు.

## సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిని గెలుపించుకోవాలి



### సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-బంజారా హిల్స్

కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు సమన్వయంతో పని చేసి సికింద్రాబాద్ పార్లమెంటు స్థానాన్ని భారీ మెజార్టీతో కైవసం చేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఖైరతాబాద్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి,టీపీసీసీ కార్యదర్శి పి.విజయారెడ్డి నేతృత్వంలో నియోజక వర్గ ఎమ్మెల్యే దానం నాగేందర్, నాంపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి ఫిరోజ్‌ఖాన్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేఅభ్యర్థి మహమ్మద్ అజారుద్దీన్, సనత్ నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి కోటా నిలిమ, ఎమ్మెల్యే అభ్యర్థులు నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి,రోహిన్‌రెడ్డిలు సీఎంరేవంత్‌రెడ్డి నివాసంలో సమావేశంలో ఆయన అందరూ ఐక్యమ త్యంతో కలిసి సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిని గెలిపించుకోవాలని సూచించారు. సీని యర్లు, జూని యర్లు అన్న భేదం లేకుండా కలిసి కట్టుగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక మంలో ధనరాజ్ రాథోడ్, కంటెస్టెడ్ కార్పొరేటర్ బంజారాహిల్స్ డివిజన్, మోహన్ యాదవ్ జూబ్లీ హిల్స్ సీనియర్ కాంగ్రెస్ లీడర్, సిటీ బీసీ నాయకులు, నరేష్ సోమజిగూడా డివిజన్, ప్రవీణ్ యాదవ్, భీంరావు ఎస్సీ సెల్ కన్వీనర్ సిటీ,సోను సోషల్ మీడియా, బాబా గౌడ్,కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి మనిషి జీవితం రాజకీయాలతో

# ముడిపడి ఉంటుంది

- కావాల్సింది పంచాంగ శ్రవణం కాదు రాజకీయ చైతన్యం
- ఓటుతోనే జీవితం షడ్రసోపేతం
- ఎన్నికల ఉగాది కవి సమ్మేళనంలో వక్తలు

నవతెలంగాణ- ముషీరాబాద్

ప్రతి మనిషి జీవితం రాజకీయాలతో ముడిపడి ఉంటుంది కావాల్సింది ఉగాది పంచాంగ శ్రవణం కాదు రాజకీయ చైతన్యం ఓటుతోనే జీవితం ఉగాది రుచుల షడ్రసోపేతం అవుతుందని ఎన్నికల ఉగాది కవిసమ్మేళనంలో వక్తలు అభిప్రాయపడ్డారు. ఉగాది సంద ర్భంగా తెలంగాణ సాహితి హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో ఎం హెచ్ భవన్‌లో నిర్వహించిన ఎన్నికల్లో ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ సా హితి రాష్ట్ర ఉపాధ్యక్షులు తంగిరాల చక్రవర్తి,తెలంగాణ సాహితి రాష్ట్ర ఉపాధ్యక్షులు అనంతోజు మోహన్ కృష్ణ, అనుముల ప్రభాకరాచారి హాజరయ్యా రు. తంగిరాల చక్రవర్తి మాట్లాడుతూ. కవిత్వాలు మనసుకు విన సొంపుగా ఉండడమే కాకుండా ప్రజలను జాగృతం పరుస్తూ సమాజ శ్రేయస్సు కృషి చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 300 పైచిలుకు సాహితీ సంఘాలు ఉన్నాయని వాటన్నిటిలోకెల్లా తెలంగాణ సాహితీ సంఘం ఎంతో ప్రసిద్ధి చెందిం దన్నారు ప్రత్యేక లక్ష్యంతో ప్రజల మన్ననలు పొందుతుందని తెలిపారు. ఏదైనా కథ కవిత్వం పాట లేదా వ్యాసం రాసినప్పుడు అది చదివిన ప్రజలలో మార్పు కనిపిస్తే కవి విజయం సాధించినట్లే అవుతుందన్నారు. తెలంగాణ సాహితి సం ఘం ప్రపంచీకరణకు, టెర్రరిజానికి, సామ్రాజ్యవాదానికి మతోన్మాదానికి పూర్తిగా వ్యతిరేకమన్నారు. అగ్రశ్రేణికి చెందిన కవి రచయితలు మేధావులు వారి జీవిత చరిత్రలను 800 పేజీలతో పుస్తకాన్ని రచించి విడుదల చేయడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో ఊర్లు ప్రదేశాలు సందర్శించి ప్రముఖ కవుల రచయితల జీవిత చరిత్ర వారు నివసించిన ప్రదేశాలను వారి సమాధులను చూసినప్పుడు ఎంతో ఆవేదన కలిగిందన్నారు శిధిలా వ్యవస్థలో చేరి ఎవరు పట్టించుకోని స్థితిలో ఉన్నాయని అటువంటి వాటిని గుర్తించి నవ యువ కవులు సందర్శించే విధంగా పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేయాలని కోరారు. తెలంగాణ సమాజం చాలా చైతన్య మైంది. రానున్న ఎన్నికల్లో తమ ఓటు హక్కుతో సరైన పాలకులను ఎన్నుకుంటారని, కవులు ఆ తరహా చైతన్యం కలిగించే కవిత్వం రాయాలని ఆయన తెలిపారు. ఉపాధ్యక్షులు అనంతోజు మోహన్ కృష్ణ మాట్లాడుతూ ప్రతి మనిషి జీవితం రాజకీయాలతో ముడిపడి ఉందని, అందుకే ఇప్పుడు కావాల్సింది పంచాంగ శ్రవణాలు కాదు.. రాజకీయ చైతన్యం కావాలని అన్నారు. తమ అమూల్యమైన ఓటు హక్కుతో ప్రజా సమస్యలు ఎరిగిన నాయకుల్ని వాటి పరిష్కారానికి కృషి చేసే నాయకున్ని ఎన్నుకొని తమ బతుకులను బాగుపరచుకోవా లని ఓటు అనే ఆయుధాన్ని ఎట్టి పరిస్థితిలో అశ్రద్ధ చేయకుండా సరైన సమయంలో ఆ ఆ యుధాన్ని ఉపయోగించాల న్నారు. యువతరం ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వాలు పని చేయాలని సూచించారు.

ఈ ఎన్నికల్లో దాదాపు 18 కోట్ల మంది యువకులు కొత్తగా తమ ఓటు హక్కును వినియో గించడానికి సిద్ధంగా ఉన్నారని అటువంటి యువత ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని కోరా రు. ఈ ఎన్నికలు అవినీతికి కుట్ర కుతంత్రాలకు తావు లేకుండా సభ్య సమాజం మంచి నాయకున్ని ఎన్నుకునే విధంగా ఆదర్శంగా ఉంటా యని కోరారు. ఈ కార్యక్రమంలో మే రెడ్డి రేఖ,తెలంగాణ సాహితి నాయకులు సలీమ, అజయ్ కుమార్, మహేష్ దుర్గే , ముజాహిదీన్, అశోక్, అనురాధ, పృథ్వీ, వాసీమ్, భరత్, శ్రావణి పాల్గొన్నారు.

## బీపీ షుగర్ పేషంట్ కు జీవనశైలిలో మార్పులు అత్యవసరం

- సీనియర్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ప్రత్యూష నేరెళ్ల ఉద్ఘాటన




నవ తెలంగాణ - ముషీరాబాద్

బీపీ షుగర్ పేషంట్ కు జీవనశైలిలో మార్పులు అత్యవసరం అని సీనియర్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ప్రత్యూష నేరెళ్ల ఉద్ఘాటన సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ జిందాబాద్ ప్రధాన కార్యదర్శి కె. వీరయ్య అధ్యక్షత బాగ్లింగంపల్లి లో అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ ప్రత్యూష నేరెళ్ళ మాట్లాడుతూ. బీపీ, షుగర్ పేషెంట్లకు మందుల వాడకంతోపాటు జీవనశైలి లో కూడా మార్పులు అవసరమని అన్నారు. వ్యాయామం అవసరమని, కానీ వ్యాయామం అంటే ఫోన్ మాట్లాడుతూ అలసట లేని మెల్లగా నడిచే నడక కాదని, అలసట వచ్చేలా బ్రిస్క్ వాకింగ్ చేస్తేనే ఉపయోగమని అన్నారు. ప్రతి పేషంటు తమ ఆహారంలో పీచు పదార్థం తప్పని సరిగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. లంచ్, డిన్నర్ లలో తప్పనిసరిగా కూరగాయల సలాడ్ లను తప్పని సరిగా తీసుకోవాలని సూచించారు. ఉబకాయం వలన థైరాయిడ్ వస్తుందని, థైరాయిడ్ ఊబకాయానికి దారితీస్తుంది అన్నారు. బరువుని నియంత్రించుకోవడం చాలా అవసరమని, అధిక బరువు ఆరోగ్యానికి అనర్థకమని, అధిక బరువు రాకుండా చర్యలు తీసుకో వాలని, జీవనశైలి ని మార్చుకోవాలని అన్నారు. సదస్సులో పాల్గొన్న ప్రేక్షకులు అడిగిన అనేక ప్రశ్నలకు డాక్టర్ ప్రత్యూష ఆసక్తికరమైన సమాధానాలు ఇచ్చారు. డాక్టర్ జయసూర్య మాట్లాడుతూ .మన శరీరంలోని అవయవాలను కృత్రిమంగా ఏర్పాటు చేసుకోవాలంటే కోట్లాది రూపాయలు ఖర్చవుతుందని ఆరోగ్యకరమైన అవయవాలతో కూడిన శరీరం మనకు ఒక వరం అని దానిని కాపాడుకునేందుకు అందరం కృషి చేయాలని అన్నారు. సామాజికవేత్త సీ. హెచ్. రాజీవ్ మాట్లాడుతూ. సమాజంలోని పౌరులంతా ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజం కూడా సౌభాగ్యవంతంగా ఉంటుందని, ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ప్రతి ఒక్కరు తమ ఆరోగ్య సంరక్షణ కోసం ప్లాన్ చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిందాబాద్ నగర నాయకులు ఎం. శ్రీనివాసరావు, పి. శ్రీనివాసరావు, డి. సైదులు, పి. నాగేష్, రాజమౌళి, సుకుమార్, మోహన్, గోపాల్, హస్మిత, సంగీత, %ఖ%.లలిత, శంకరయ్య, రవీంద్రనాథ్, రాములు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కొట్టిన బాజా కొట్టద్దు




### ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్

నవతెలంగాణ-బంజారాహిల్స్

కొట్టిన బాజా కొట్టద్దు నిద్ర పోయే భాషన ప్రజలకోసం పని చేసే నాయ కులను ప్రజలే ఎన్నుకుంటారని ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ అన్నారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్ సికింద్రాబాద్ పార్లమె ంట్ ఎన్నికల సన్నాహాక సమావేశాల్లో భాగంగా ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మన్నే గోవర్ధన్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ భవన్ జరిగిన ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సమన్వయ సమా వేశంలో సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు గౌడ్కి మద్దతుగా మాజీ మంత్రి సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్,జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్,ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్,అంబర్పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ చైర్మన్ విప్లవ్ కుమార్,సీనియర్ నాయకులు శ్రావణ్, నియోజకవర్గ కార్పొరేటర్లు ఉద్యమకారులు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాల గురించి చర్చ గోష్టి నిర్వహించారు ప్రజా మనిషిగా అందరికీ అందుబాటులో ఉండే వ్యక్తి పద్మారావు గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకో వాలని నగర ప్రజలు ఆ విశ్వాసంతోనే బిఆర్ ఎస్‌కు పట్టం కట్టారని అన్నారు. అనంతరం పద్మారావు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

## 'పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి పైపులను ఉపయోగించాలి




- మట్టి పైపుల వినియోగానికి సీఎం ఎ.రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేయాలి
- తెలంగాణ ఎస్ డబ్ల్యూజీ పైప్స్ మ్యానుఫ్యాక్చరింగ్ అసోసియేషన్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ కోసం ఎస్ డబ్ల్యూజీ (డ్రయినేజీ) మట్టి పైపులను వినియోగించాలని, అందుకు సీఎం ఎ.రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేయాలని తెలంగాణ ఎస్ డబ్ల్యూజీ పైప్స్ మ్యానుఫ్యాక్చరింగ్ అసోసియేషన్ కోరింది.ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షులు పి.వరప్రసాదరావు మాట్లాడుతూ నిజాం ప్రభుత్వ కాలంలో ఉపయోగించిన ఈ మట్టిపైపులు నేటికి నిరాటంకంగా 150 సంవత్సరాల నుంచి పని చేస్తున్నాయని, ఎలాంటి కెమికల్ ప్రభావం లేదని, పైపుల లీకేజీ ఉండదని, ఆరోగ్య రీత్యా మేలు చేస్తాయన్నారు.రాష్ట్రంలో ఉన్న ఈ మట్టి పైపులు ఏ రాష్ట్రంలో లేవని, తెలంగాణలో 36 పరిశ్రమలు ఉన్నాయని, నాలుగు వేల మంది కార్మికులు పని చేస్తున్నారని, ఈ పైపులు 65 శాతం సిలికా, 25 శాతం అల్యూమినియం కలిగిన తెల్ల మట్టితో తయారు చేయబడతాయని, ఎలాంటి రసాయనాలు లేకుండా పూర్తిగా పర్యావరణానికి అనుకూలమైనవని, మల, మూత్రాలలో ఆమ్లం, క్షరాలు కలిగి ఉండి ఎలుకలు, పందికొ క్కులు,చెదలు నివారణకు ఎంతో ఉపయోగప డతాయన్నారు.క్షీణిస్తున్న జీవావరణం గురించి ప్రపంచం మొత్తం ఆందోళన చెందుతుందని, పర్యావరణానికి వంద శాతం అనుకూలమైన ఎస్ డబ్ల్యూజీ పైపులు వాడించి పరిశ్రమలను ప్రోత్సహించాలని ఆయన సీఎం ఎ.రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.ప్రస్తుతం ప్రభుత్వం అన్ని జీహెచ్ ఎంసీ, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్ ఈబీ, గ్రామ పంచా యితీలు, డీటీపీసీ లే అవుట్లలో ఈ పైపులను మాత్రమే వినియోగించాలని అందుకు రాష్ట్ర సీఎం ఆదేశాలు జారీ చేయాలని కోరారు.ఈ సమావేశంలో అసోసియేషన్ నాయ కులు వినోద్ రెడ్డి, మధుసూదన్, భూమయ్య గుప్త పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి స్పందన

నవతెలంగాణ-సుల్తాన్ బజార్




ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అనురాగ నిలయం వృద్ధ శ్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సోసైటి ఉచిత ఆరోగ్య శిబిరం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ బ్రాంచ్ చైర్మన్ మామిడి భీంరెడ్డి, క్యాంప్ కో కన్వీనర్ కల్పన దత్తా అద్వర్యంలో అనురాగ నిలయం వృద్ధాశ్రమం లో 60 సంవత్సరాల పైబడిన వారి కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేసారు. శిబిరంలో డాక్టర్ కీర్తన అసిస్ట్ ప్రొఫెసర్ రోగులను పరీక్షించి చికిత్స చేసి మందులు పంపిణీ చేశా రు. ఈ కార్యక్రమంలో క్యాంపు కో కన్వీనర్ కల్పన, సుజాత, సుప్రభ, సులోచన, సత్యనారాయణ, గోపాల్, సందీప్, నాయుడు పాల్గొన్నారు.

## కల్చరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటుతో సాంస్కృతిక విధానం



నవతెలంగాణ-కల్చరల్

రాష్ట్ర ప్రభుత్వానికి సాంస్కృతిక విధానం లేనందున కళాకారులకు ప్రోత్సాహం లభించటం లేదని వివిధ రంగాల ప్ర ముఖులు అవేదన వెలి బుచ్చారు. వారు తెలుగు విశ్వ విద్యాలయం లోని సమావేశ మందిరం లో సమావేశమై కల్చరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరారు కార్పొరేషన్ ద్వారా జిల్లా రాష్ట్ర స్థాయిలో వివిధ కళా ప్రక్రియల్లో పోటీలు నిర్వహించి విజేతలకు నగదు పురస్కారం బహుకరించాలని ప్రతి జిల్లా కేంద్రం లో కళా ప్రదర్శన మందిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.గతం లో మాదిరిగా సాంస్కృతిక సంస్థ లకు కళాకారులకు గ్రాంట్స్ ఇవ్వాలని, కళా శాల స్థాయి వరకు యువతను కళా ప్రక్రియలో పాల్గొనే లా ప్రోత్సాహించాలనీ కోరారు. క్రీడా కారులకు విద్యారంగం ఉద్యోగాలలో కోటా కల్పించినట్లు గానే కళాకారులకు కల్పించాలని ముఖ్యం గా కార్పొరేషన్ కు బడ్జెట్ కేటాయించి చైర్మన్ ను సలహామండలి నీ నియమించాలని మరికొన్ని సూచనలతో కూడిన తీర్మానం చేశారు. ఈ సమావేశం లో రంగస్థల కళాకారుడు గుమ్మడి గోపాల కృష్ణ కవి వడ్డేపల్లి కృష్ణ మధు వాకిటి వేణుగానం కళాకారుడు నాగరాజు,గాయని మణి పాండురంగ ముతలిక్,కోట్ల అనిత, పీ.వీ.సాయి నాట్య గురువు మృణాళిని కిన్నెర రఘురాం జయధీర్ తిరుమలరావు తదితరులు పాల్గొనగా ఇంద్రజాల కళాకారుడు వేణు సామల అధ్యక్షత వహించారు

## వచ్చే ఎన్నికల్లో దేశం కోసం ఓటు వేయండి



### కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి

నవతెలంగాణ-అంబర్‌పేట:

వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ దేశం కోసం ఓటు వేయాలని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి కోరారు. దేశ అభివృద్ధి, సమగ్రత, సమైక్యత, దేశంలో అవినీతిని ఆరికట్టేందుకు, మౌళిక వస తులు పెంచేందుకు ఓటు వేయాలని విన్నవించారు. బాగ్ అంబర్‌పేట డివిజన్ పరిధిలోని డీడీకాలనీలో గల అహోబిలమఠం హాల్లో డీడీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌ఆధ్వర్యంలో వివిధ కాలనీ వాసుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా కిషన్ రెడ్డి హాజరై ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలుకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈసమావేశంలో డీడీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. లక్ష్మీకాంత్ రెడ్డి, మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డా. ఎన్.గౌతంరావు, పి.గోవర్ధన్ రెడ్డి,డా .హరిచరణ్, డా.పుట్ట పాండురంగయ్య, డా. రాజిరెడ్డి, కరణ్ రెడ్డి, సుబ్బారెడ్డి, ఆర్.రాంరెడ్డి, చుక్క జగన్, చలమారెడ్డి, మల్లారెడ్డి, కళ్యాణ్ నాయక్, ఉమాశేఖర్ పాల్గొన్నారు.

### సికింద్రాబాద్‌ను కైవసం చేసుకునేది బీజేపీనే

### ఎన్నికల ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్

భారీ మెజారిటీతో సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకోవడం ఖాయమని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, ఈశాన్య రాష్ట్రాల మంత్రి, రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అనంతరం బీజేపీ నగర కార్యాలయంలో నిర్వహించిన సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కమిటీ సమావేశానికి ఎన్నికల ఇంచార్జ్ అభయ్ పాటిల్ తో కలిసి కిషన్ రెడ్డి హాజరై . ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడారు. ఈ సమావేశంలో బిజెపి నేతలు చింతల రామచంద్రారెడ్డి, కృష్ణ యాదవ్, ఓ. శ్రీనివాస్ రెడ్డి, శ్యామ్ సుందర్ గౌడ్, రాజశేఖర్ రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, అట్లూరి రామకృష్ణ, మహేందర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
సోమవారం | ఏప్రిల్ 08, 2024 | www.navatelangana.com

## బీజేఆర్ కాలనీలో జ్ఞానమాల కార్యక్రమం



నవతెలంగాణ-కాప్రా

కాప్రా పరిధిలోని జమ్మిగడ్డ బీజేఆర్ కాలనీలో చేపట్టిన మహనీయుల జ్ఞానమాల కార్యక్రమం 97వ వారానికి చేరింది. ఆదివారం మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు జ్ఞానమాల టీ సభ్యులు పూలమాల వేసి జ్ఞానమాల సమర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రజక సంఘాల సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి పెద్దాపురం కుమారస్వామి, జ్ఞానమాల టీం ఆర్గనైజర్ తాడూరి గగన్ కుమార్, సభ్యులు నర్సింహ్మా చారి, దయానంద్, మెకానిక్ కొండల్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ చేరిన కీసర ఎంపీపీ



నవతెలంగాణ-కీసర

కీసర మండల ఎంపీపీ మల్లారపు ఇందిరా, చీర్యాల లక్ష్మీ నృసింహ్మా స్వామి ఆలయ చైర్మెన్ మల్లారపు లక్ష్మీనారాయణగౌడ్‌లు సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి సీఎం పార్టీ కండువా కప్పి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, బీ బ్లాక్ ప్రెసిడెంట్ మహేష్ గౌడ్, కీసర మండలాధ్యక్షుడు కోలా కృష్ణ యాదవ్, నాయకులు శివ, లింగాల శ్రీనివాస్ గౌడ్, ఈ. శ్రీనివాస్, మల్లారపు శ్రీహరి పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేసిన మర్రి



నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరిలోని 139 డివిజన్ పరిధిలో ఉన్న ఈస్ట్ ఆనంద్ బాగ్ కస్తూరిబాయ్ నగర్‌కు చెందిన ఎం.శ్రీనివాస్ అనారోగ్యంతో బాధపడుతూ సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఆయనకు మంజూరైన రూ.75 వేల ఎల్‌వోసీ చెక్కుకు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

## అల్వాల్ ప్రజలతో పట్నం సునీత సమావేశం




నవతెలంగాణ-అల్వాల్

కాంగ్రెస్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి అల్వాల్ పరిధిలోని పలు కాలనీవాసులతో హెచ్ఎంటీ కాలనీలో ఉన్న బతుకమ్మ పార్కులో సమావేశం నిర్వహించారు. ఆదివారం హెచ్ఎంటీ కాలనీ, మంజీర కాలనీ, సాయిబాబా కాలనీ ప్రజలతో మాట్లాడుతూ..వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కాలనీవాసులు వారి సమస్యలను ఆమెకు విన్నవించారు. తాగునీటి సమస్య జఠిలంగా ఉందని, బాక్స్ డ్రైన్ పనులను సత్వరమే పూర్తి చేయాలని కోరారు. తాను గెలిపించిన వెంటనే కేంద్రం నుంచి నిధులు తెచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసానిచ్చారు. అనంతరం పార్కు దగ్గర ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ జితేంద్రనాథ్‌తో కలిసి సునీత మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, భూపతి రెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వీరారెడ్డి, సమ్మిరెడ్డి, తిరుపతిరావు, సుధాకర్ రెడ్డి, ప్రమోద్‌రెడ్డి నాయకులు బొబ్బిలి సురేందర్‌రెడ్డి, నిమ్మ అశోక్‌రెడ్డి, రాజసింహారెడ్డి, బలవంతరెడ్డి, విగ్నేశ్వర్‌రెడ్డి, నాగేశ్వరరావు, శకుంతల నాయుడు, లావణ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కామ్రేడ్ దుర్గా ప్రసాద్ మరణం తీరని లోటు



నవతెలంగాణ-కాప్రా

కామ్రేడ్ దుర్గా ప్రసాద్ మరణం కార్మిక వర్గానికి తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీఎస్.బోస్ అన్నారు. చర్లపల్లి డివిజన్‌ల పరిధిలోని ఈసీ నగర్‌కు చెందిన దుర్గా ప్రసాద్ అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు మృతుడి భౌతిక కాయంపై ఎర్ర జెండాను కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీఎస్. బోస్ మాట్లాడుతూ.. దుర్గాప్రసాద్ ఏఐటీయూసీ కార్మిక విభాగంలో ఎనలేని కృషి చేశారని, నిత్యం కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని గుర్తు చేశారు. అలాంటి నిస్వార్థ వ్యక్తి లేకపోవడం బాధాకరమన్నారు. దుర్గాప్రసాద్ ఈసీఐఎల్ కంపెనీలో ఏఐటీయూసీ కార్మిక విభాగానికి యూనిట్ సెక్రెటరీగా, ఈసీఐఎల్ పీఎఫ్ ట్రస్టీగా, ఈసీనగర్ సొసైటీ డైరెక్టర్‌గా పనిచేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జీ. దామోదర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్. శంకర్‌రావు, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు నర్సింహా, శ్రీనారాయణ, సుధాకర్, ఏఐటీయూసీ నేతలు రాంప్రభు, మోహన్, సూర్యప్రకాష్, కృష్ణారెడ్డి, పట్వారీ పాల్గొన్నారు.

## 'గాంధీ'లో చికిత్స పొందుతూ బాలుడు మృతి



నవతెలంగాణ-జవహర్‌నగర్

ఇటీవల గ్యాస్ సిలిండర్ పేలి గాయాల పాలైన బాలుడు గాంధీ ఆస్పత్రి లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్లితే జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బీజేఆర్ నగర్, జ్యోతిరావ్ కాలనీలో నాలుగు రోజుల క్రితం (మంగళవారం) ఇండియన్ వంట గ్యాస్ పేలడంతో బన్నీ అనే ఏడేండ్ల బాలుడు తీవ్ర గాయాల పాలైన విషయం తెలిసిందే. నాటి నుంచి గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు ఆదివారం మృత్యువు ఒడిలోకి చేరా డు. కొడుకు మరణంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు రోదనలు చూపరు లను కన్నీరు పెట్టించింది. బాధిత కుటుంబానికి ఇండియన్ గ్యాస్ యాజమా న్యం, ప్రభుత్వం న్యాయం చేసి ఆదుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి




- మాజీ వార్డు సభ్యురాలు రామిడి స్వప్న విజయ్‌రెడ్డి

నవతెలంగాణ-కీసర

ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని కీసర మాజీ వార్డు సభ్యురాలు రామిడి స్వప్న విజయ్ రెడ్డి అన్నారు. ఆదివారం కీసర మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కాప్రా, ఏఎస్‌రావు నగర్ వారి సహకారంతో కీసర మాజీ వార్డు సభ్యురాలు రామిడి స్వప్న విజయ్ రెడ్డి ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలోని సుమారు 100 మందికి పైగా ప్రజలు శిబిరంలో పాల్గొన్ని చికిత్సలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు దినేష్, అనీల్, కీసర మండల సహకార సొసైటీ చైర్మెన్ రామిడి ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.



**డివిజన్ పరిధిలోని పాలోమి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న హెచ్ఎం టీవీ రిపోర్టర్ హరీశ్‌ను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి.**

**-నవతెలంగాణ,కాప్రా**

## కేంద్రంలో బీజేపీని గద్దె దించాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర సమితి




నవతెలంగాణ-హిమాయత్ నగర్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలపై వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సమర శంఖారావం పూరించి గద్దెదించాలని ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర సమితి శ్రామిక వర్గానికి పిలుపునిచ్చింది. ఏఐటియుసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ.యూసుఫ్ అధ్యక్షతన ఆదివారం హిమాయత్ నగర్‌లోని ఎన్.సత్యనారాయణరెడ్డి భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయుసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ మాట్లాడుతూ 1991లో తీసుకువచ్చిన నూతన ఆర్థిక విధానాల ఫలితంగా దేశంలో కోటీశ్వరుల సంఖ్య పెరుగుతూ వారి అనుకూల విధానాల వల్ల ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పరం చేస్తున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో యావత్ కార్మిక వర్గం ఐక్యమై బీజేపీ హటావో దేశ్ కీ బచావో అనే నినాదంతో 17 పార్టీలతో ఏర్పడిన ఇండియా కూటమి, లౌకిక ప్రజాస్వామ్య శక్తులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ఉపాధ్యక్షులు ఉజ్జిని రత్నాకర్ రావు, పి.ప్రేమ్ పావని, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## వివేకానంద నగర్ బస్తీ బాధితులకు న్యాయం చేయాలి




నవతెలంగాణ-ముషీరాబాద్

శ్రీస్వామి వివేకానంద నగర్ బస్తీలో ఇండ్ల కూల్చివేత బాధితులకు న్యాయం చేయాలని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్, దళిత మోర్చా నాయకులు అధికారులను ప్రశ్నించారు. ఆదివారం స్వామి వివేకానంద నగర్ బస్తీ బాధితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అక్రమంగా కోర్టు ఆర్డర్ అనే తప్పుడు నెపంతో దళితుల ఇండ్లను కూల్చి వారిని రోడ్డు పాలు చేసిన అధికారుల, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగా ఖండించారు. బాధితులకు కూల్చిన చోటే బాధితులకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత మోర్చ నాయకులు ముత్యాలు, నర్సింహ, భారత్, సాయి కుమార్, ఎస్సీ మోర్చ డివిజన్ అధ్యక్షుడు సత్యేందర్, నాయకులు హనుమంతు, కుమార్, చిర్ర యాదగిరి, బస్తీ వాసులు, కృష్ణ, జ్ఞానేశ్వర్, ఆనంద్ రావు, సంపత్, వసంత్, సాయి రామ్ పలువురు పాల్గొన్నారు.

## కేసీఆర్, కేటీఆర్‌లు పచ్చి అబద్ధాలు చెబుతున్నారు

- 20 లక్షల ఎకరాల పంట ఎండిపోయాయని చెప్పడం విడ్డూరం
- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నారెడ్డి



నవతెలంగాణ-ముషీరాబాద్

రాష్ట్రంలో 20 లక్షల ఎకరాలు పంటలు ఎండిపోయాయని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్‌లు పచ్చి అబద్దాలు చెబుతున్నారని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి. చిన్నారెడ్డి అన్నారు. గత వర్షాకాలంలో తక్కువ వర్షపాతం ఉండడం వల్ల సుమారు రెండు లక్షల ఎకరాల వరకు ఎండిపోయాయని, వాటిని రెట్టింపు చేస్తూ రైతులను రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ విశ్రాంత వ్యవసాయ శాఖ అధికారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ అధికారుల సంక్షేమ సంఘం చైర్మెన్, రిటైర్డ్ సంయుక్త వ్యవసాయ సంచాలకులు భోమిరెడ్డి కృపాకర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఆత్మీయ సత్కారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారెడ్డి మాట్లాడారు. ప్రతిపక్షాలు పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రైతులను, ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని విమర్శించారు. రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని గ్రామాల అవసరాలను సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ సంస్థల అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ విశ్రాంత వ్యవసాయ శాఖ అధికారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ రంగారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షులు డాక్టర్ వైద్యనాథ్, ప్రధాన కార్యదర్శి జి.కృపాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సి.ఆర్.బిస్వాల్, నాయకులు పి.చంద్రశేఖర్‌రెడ్డి, జి. కృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, డాక్టర్ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం భోమిరెడ్డి కృపాకర్ రెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు.

## సాంస్కృతి సాంప్రదాయాల మమేకమే కూచిపూడి నృత్యం

- శివశక్తి కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు జీఎస్. వాసు



నవతెలంగాణ-ముషీరాబాద్

సాంస్కృతి సాంప్రదాయాల మమేకమే కూచిపూడి నృత్యం అని శివశక్తి కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు కూచిపూడి నృత్య గురువు జీఎస్. వాసు తెలిపారు. శివశక్తి కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ మౌలాలి ఆధ్వర్యంలో ఉగాది స్వర్ణనంది పురస్కార మహోత్సవం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ మహోత్సవంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ పసుమర్తి శేషబాబు, దేవులపల్లి ప్రశాంత్ కుమార్, చింత శివ ఆదినారాయణ, హాజరయ్యారు. ఈ సందర్భంగా కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందిన విద్యార్థులు తమ అమోఘమైన నృత్యంతో విశేషంగా ఆకట్టుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన కళాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంగీత నృత్య గురువులు కళాకారులు, కవులు, పాల్గొన్నారు

## మున్నూరుకాపుల సమావేశంలో పాల్గొన్న ఈటల రాజేందర్



నవతెలంగాణ-శామీర్‌పేట

మేడ్చల్ జిల్లా తూంకుంట మున్సిపల్ కేంద్రంలోని మొగుళ్ల రామకృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన మున్నూరుకాపు సంఘం సమావేశానికి ముఖ్యఅతిథిగా మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్నూరు కాపులు అన్నిరంగాల్లో ముందు ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్‌లో బీసీ నాయకులు ఎప్పటికీ సీఎం కాలేరని పేర్కొన్నారు. బీజేపీలో ఎవరైనా సీఎం కావొచ్చని, బీజేపీకి ఓటేసి మోడీని పీఎం చేస్తే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని అన్నారు. మోడీ హయాంలో 27 మంది ఓబీసీలు మంత్రులయ్యారని తెలిపారు. మొదటి సారి దళిత బిడ్డ, రెండోసారి ఆదివాసీ బిడ్డ రాష్ట్రపతిని చేసిన ఘనత బీజేపీకి దక్కిందన్నారు. ఇంత సామాజిక సమతుల్యం ఇంకో పార్టీలో లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసిన దుర్మార్గపు పాలన వల్ల చాలామంది ఓటు వేయడం మానేశారని చెప్పారు. ఒకప్పుడు మోడీకి వీసా ఇవ్వని అమెరికా నేడు రెడ్ కార్పెట్ పరుస్తోందని తెలిపారు. భారతదేశాన్ని మళ్లీ విశ్వగురువును చేసిన ఘనత మోడీకే దక్కిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులందరినీ గెలిపించాలని మున్నూరు కాపులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఈటల రాజేందర్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మణ్, బుద్ధి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ ఉప కులాలను కించపరిచిన వాఖ్యలను మందకృష్ణ వెనక్కి తీసుకోవాలి



- 57 ఎస్సీ ఉప కులాల హక్కుల పోరాట సమితి

నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఎస్సీ ఉప కులాల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ వెంటనే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, లేకపోతే రాబోయే రోజుల్లో తీవ్ర పరిణామాలు ఎదుర్కొక తప్పదని ఎస్సీ 57 ఉప కులాల హక్కుల పోరాట సమితి హెచ్చరించింది. ఈ మేరకు ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్ర కమిటీ సమావేశంలో సమితి జాతీయ అధ్యక్షులు బైరి వెంకటేశం మోచి మాట్లాడుతూ వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్యపై, ఎస్సీ ఉప కులాలపై కించపరిచే విధంగా ఊరికొక కులం, వాడకొక నాయకుడు అంటూ మందకృష్ణ మాదిగ చేసిన వ్యాఖ్యలు దారుణమన్నారు. ఆయన ఎస్సీ వర్గీకరణపై పోరాటం చేస్తున్న కేవలం మాదిగల లబ్ధి కోసమేనని, మిగతా ఉప కులాల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. రిజర్వేషన్లలో సమానత్వం తమ జాతుల హక్కని మేమెంతో మాకంతా జనాభా దామాషా ప్రకారం శాస్త్రీయంగా ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ జరగాలని డిమాండ్ చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉప కులాలకు రాజకీయాల్లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉప కులాలకు ప్రత్యేక కార్పొరేషన్, బోర్డు ఏర్పాటు చేయాలని, కుల ధృవీకరణ పత్రాలను ఎమ్మార్వో ద్వారా అందజేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సమితి నాయకులు టిఎస్.స్వామి, శోభ తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ గెస్ట్ లెక్చరర్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



- రాష్ట్ర డిగ్రీ గెస్ట్ లెక్చలర్ల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌కు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-ముషీరాబాద్

రాష్ట్రంలోని డిగ్రీ గెస్ట్ లెక్చరర్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర డిగ్రీ గెస్ట్ లెక్చలర్ల సంఘం నాయకులు డాక్టర్ కొర్ర ఈశ్వర్ లాల్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డా.కొర్ర ఈశ్వర్‌లాల్ మాట్లాడుతూ.. భారతదేశంలోని అతిపిన్న వయస్సులో తెలంగాణ రాష్ట్ర శాసనమండలి సభ్యులుగా నియమించబడిన డాక్టర్ బల్మూరి వెంకట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో డిగ్రీ గెస్ట్ లెక్చలర్ల సమస్యలు డిమాండ్లను కులంకషంగా వివరించామని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈనెల 13న డిగ్రీ గెస్ట్ లెక్చలర్ల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి అతిథులుగా పాల్గొనాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్‌లు నాగేశ్వరరావు, బుచ్చిపాల్ రెడ్డి, స్టేట్ సెక్రటరీ జనరల్ గణేష్, జనరల్ సెక్రెటరీ డా.భగ్గనాయక్, ట్రెజరర్ నరేష్, కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## జగ్జీవన్ రామ్ కమిటీ అధ్యక్షుడిగా నరేందర్



నవతెలంగాణ-జవహర్‌నగర్

జాతి అభివృద్ధికి కృషి చేస్తానని బాబు జగ్జీవన్ రామ్ కమిటీ అధ్యక్షులు నరేందర్‌బాబు అన్నారు. ఆదివారం జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని అంబేద్కర్‌నగర్ బాబూ జగ్జీవన్ రామ్ కమిటీ హాల్లో కమిటీ సభ్యులందరూ సమావేశమై అధ్యక్షుడిగా ఎన్నికకు నిర్వహించిన ఓటింగ్‌లో నరేందర్‌బాబు గెలుపొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదిగ జాతి అభివృద్ధికై కృషి చేస్తానని, అందరినీ కలుపుకొని పనిచేస్తానని, ఎన్నికకు సహకరించిన మిత్రులందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పూర్తిస్థాయి కమిటీని ప్రకటించారు.

కమిటీ ఉపాధ్యక్షులుగా కాసగళ్ల కరుణాకర్, ఎర్ర రాము, బోట్ల శ్రీను, పుట్టల వేణు, ప్రధాన కార్యదర్శులుగా గుగ్గిళ్ల వినోద్, బొట్ల అరుణ్, మాడుగుల అమర్, పాలపర్తి రవి, కోశాధికారులుగా గుగ్గిల శివ, మారపాక శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా సునీల్, అన్వేష్, రాజేష్, శ్రీను, తదితరులు ఉన్నారు.

## ముంబై ఇండియన్స్‌తో పార్క్ సన్స్ కార్టముండి భాగస్వామ్యం

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్లేయింగ్ కార్డుల ప్రపంచంలో ప్రముఖ సంస్థ పార్క్ సన్స్ కార్టముండి, ప్రముఖ క్రికెట్ జట్టు ముంబై ఇండియన్స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా పార్క్ సన్స్ కార్టముండి ప్రయివేట్ లిమిటెడ్ సీఈఓ, ఎండీ కపిల్ కేజ్రీవాల్ మాట్లాడుతూ 'దేశానికి అత్యుత్తమ ప్లేయింగ్ కార్డ్ అనుభవాలను తీసుకురావడానికి మా పరిశ్రమ ప్రముఖ తయారీ, ప్రింటింగ్ సామర్థ్యాలను ఉపయోగించుకోవడానికి మేం కట్టుబడి ఉన్నాం. మేం ఇప్పటికే 150 ఏండ్లకుపైగా వారసత్వంతో సైకిల్ వంటి దిగ్గజ బ్రాండ్లతో గ్లోబల్ ఉనికిని ఏర్పర్చుకున్నాం. ప్రతి భారతీయ ఇంటిలో ఒక సెట్ ప్లేయింగ్ కార్డులు అంతర్లీనంగా ఉన్నాయని, క్రికెట్ ఒక జాతీయ మతమని గుర్తించి, ఈ అభిరుచులను కలపడానికి మేం సరైన అవకాశాన్ని చూశాం' అని తెలిపారు.

## హైదరాబాద్ మార్కెట్‌లోకి బయో బెవరేజెస్

- ప్రారంభించిన సినీనటి నేహాశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

దేశీయంగా ఉన్న బయో బెవరేజెస్‌ను బయో ఇండియా సంస్థ హైదరాబాద్ మార్కెట్‌లోకి రిలీజ్ చేసింది. సినీనటి నేహా శెట్టి ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. బయో బెవరేజెస్ ప్రొడక్ట్స్ ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. బయో బెవరేజెస్ ఆవిష్కర్త డాక్టర్ శ్రీనివాస్ అమర్‌నాథ్ మాట్లాడుతూ తమ ఉత్పత్తులు సింథటిక్ రుచులు, రంగులు లేని సహజ సుగంధాలతో ఉంటాయన్నారు. "బయో బెవరేజెస్ ఏ సింథటిక్ రుచులు, రంగులను ఉపయోగించకుండా ఉత్తమ బొటానికల్స్, బయో ఆల్కలాయిడ్స్‌తో తయారు చేయబడ్డాయి. నేను ప్రపంచంలో వినియోగదారుల ఎంపికను దృష్టిలో ఉంచుకుని మొదటిసారిగా బయో బెవరేజెస్‌ను అభివృద్ధి చేసాను' అని డాక్టర్ శ్రీనివాస్ అమర్‌నాథ్ వివరించారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస రాయలు మాట్లాడుతూ ఇటీవల యూఎస్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో బయో బెవరేజెస్ ప్రశంసలు అందుకున్నట్టు తెలిపారు. భారత దేశంలోని వివిధ రాష్ట్రాల్లో బయో బెవరేజెస్ కస్టమర్లకి అందుబాటులో ఉన్నాయని జీ.వి.నాయుడు డైరెక్టర్ గ్లోబల్ సేల్స్ తెలిపారు.

## ఉచిత మెగా మెడికల్ క్యాంపు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఏపిన్ సెంటర్ ఫర్ పెయిన్ రిలీఫ్ అండ్ బియాండ్ వారు ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో డాక్టర్ మినల్ చంద్ర (పెయిన్ స్పెషలిస్ట్, ఏపిన్ పెయిన్ సెంటర్) పాల్గొన్నారు. ఈ క్యాంపులో 385 మందికి పైగా ప్రజలు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఏపిన్ సెంటర్ పెయిన్ రిలీఫ్ వారి ద్వారా పాల్గొన్న ప్రజలందరికి ఫ్రీ టెస్టులు, బీఎండీ, బీపీ, షుగర్ హైట్ అండ్ వెయిట్ అండ్ ఫ్రీ కన్సల్టేషన్ ఏపిన్ సెంటర్ ఫర్ పెయిన్ స్లయిడ్ షో ద్వారా హెల్త్ అవేర్నెస్ ఆరోగ్య సేవలు అందించారు.

9

నవతెలంగాణ

కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్

సోమవారం | ఏప్రిల్ 08, 2024 | www.navatelangana.com




కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, జీడిమెట్ల 132 డివిజన్ లోని భీమా ఫ్రైడ్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్‌లలో, పేట్ బషీరాబాద్ జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీలో మల్కాజిగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోలన్ హనుమంత్ రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కందాడి జ్యోత్స్నా శివా రెడ్డి కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

నవతెలంగాణ-బాలానగర్



గాజులరామారం డివిజన్ బీఆర్ఎస్ యువ నాయకులు సంగమేష్ సతీమణి జన్మదిన వేడుకలు ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారంలో ఘనంగా నిర్వహించారు.ఈ మేరకు గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు, గాజుల రామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు,డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

# చెరువులను కబ్జాల నుంచి కాపాడాలి



- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్
- చెరువుల సంరక్షణ సమితి నాయకులతో కలిసి నిరసన

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

చెరువులను కబ్జాలబారి నుంచి కాపాడి మన ప్రాంతాన్ని మరో బెంగళూరు కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సీపీఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కార్యదర్శి, చెరువుల సంరక్షణ సమితి నాయకులు ఈ.ఉమామహేష్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి అనుకొని ఉన్న పరికిచెరువు ప్రాంతాన్ని ఆదివారం చెరువుల సంరక్షణ సమితి నాయకులు, పలువురుతో కలిసి ఆ ప్రాంతాన్ని సందర్శించి నిరసన చేపట్టారు. బెంగళూరు పట్టణంలో చెరువులను, కుంటలను కబ్జా పూడ్చి అక్రమంగా నిర్మాణాలను చెయ్యడం వల్ల నేడు నీటి కొరతతో బాధపడుతున్న విషయం మన అందరికి తెలిసిందేనని, అలాంటి పరిస్థితులు మన దగ్గర ఏర్పడకుండా జాగ్రత్త వహిస్తేనే రాబోవు తరాలకు నీటి సమస్య లేకుండా చేయవచ్చని వ్యాఖ్యానించారు. కుత్బుల్లాపూర్, హైదరాబాద్‌లో విస్తరించి ఉన్న చెరువులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి పై ఉందని గుర్తు చేశారు. సీపీఐ కార్యదర్శి ఈ.ఉమామహేష్, సామాజికవేత్త సాయి కుమార్ పంతులలు హాజరై వారు మాట్లాడుతూ మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి మండలంలో సుమారు 112 ఎకరాల్లో పరికి చెరువు విస్తరించి ఉండేదని కానీ నేడు చెరువును స్థానిక నాయకులు కోర్ట్ ఆర్డర్ పేరిట చెరువులను కబ్జా చేసి అమాయకులకు లక్షల్లో అమ్ముకుంటు మోసం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో ఇక్కడ అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు కూల్చివేస్తే మళ్ళీ నేడు అక్కడే నిర్మాణాలను చేసారని,అదే కాకుండా అన్ని వైపులా నుంచి చెరువును పూడ్చుకుంటు వస్తున్నారని, అధికారులు ఇలాగే నిర్లక్ష్యం వహిస్తే ఉన్న చెరువు మొత్తం అదృశ్యం అయ్యి చరిత్రలో "చెరువులెక్కడ అని" చూడాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. అధికారులు కండ్లు తెరిచి చూసి చెరువులను కాపాడాలని కోరారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోకపోతే రాజకీయాలకతీతంగా అందరిని కలుపుకొని పరికిచెరువును కాపాడుకుంటామని, అవసరమైతే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, సుప్రీంకోర్టు వరకు వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి.హరినాథ్, వంగాల శ్రీనివాస్, సదానంద్, సహదేవరెడ్డి, వెంకటేష్, ఇమామ్, విక్రమ్, శివ పాల్గొన్నారు.

# భూదాన్ వివాద స్థలాల్లో భూ సర్వే నిర్వహణ



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ దుండిగల్ తాండా 1 సర్వే నెంబర్ 142,143,147,150,151,152 తదితర సర్వే నెంబర్లలో దుండిగల్ సర్వేయర్ నేతృత్వంలో అధికారులు సర్వే నిర్వహించారు. అధికారులు సమీప ల్యాండ్ ఓనర్స్‌కు సమాచారం ఇవ్వకుండా హడావిడి సర్వే నిర్వహించడం వివాదంగా మారింది. రెవెన్యూ అధికారుల సర్వేపై సర్వత్రా బాధితుల ఆరోపణ... ఇటువంటి సర్వే నిర్వహించే ముందు వారం రోజుల ముందే భూమి యజమానులకు, రైతులకు, సమాచారం ఇవ్వవలసి ఉండగా అధికారులు హడావిడిగా నిర్వహించడం పట్ల స్థానికులు బానోతు రవి, బానోతు షకీరా, తదితరులు ఆందోళన వ్యక్తం చేశారు. కొంత ఉద్రిక్తత వాతావరణం నెలకొనడంతో పోలీసుల జోక్యంతో సర్వే నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ... సర్వే హడావిడిగా నిర్వహించడం ఎందుకని, ఇటీవల స్థలంలో కడిరాళ్ళు విరగొట్టిన విషయం పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఏమాత్రం పట్టించుకోని పోలీసులు ఈరోజు హడావిడిగా నిర్వహిస్తుండగా పోలీసులు రావడం ఏమిటని బాధితులు ప్రశ్నించారు. పోలీసులు కేవలం ఒక వైపే ఉషశ్రీ సంస్థకు పరోక్షంగా మద్దతు ఇవ్వడమేనని తెలిపారు. ఈ హడావుడి సర్వేపై సర్వేయర్ అధికారిని వివరణ కోరగా తాము ఎటువంటి వివాద స్థలం 148, 150 సర్వేలలో ఎటువంటి సర్వే నిర్వహించలేదని, ప్రజలు బాధితులు తెలియజేస్తున్న నెంబర్ల సర్వేలలో నిర్వహించలేదని సర్వేయర్ తెలిపారు.

# కాంగ్రెస్ ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం

- టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ ఆదివారం జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహిళా కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం, బాలానగర్ డివిజన్ అధ్యక్షులు మధు గౌడ్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి పార్లమెంటు అభ్యర్థి పట్నం సునీత మహేం దర్ రెడ్డి కుమారుడు పట్నం రెనీష్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో తుక్కుగూడలో విడుదల చేసిన ఆరు గ్యారెంటీల మ్యానిఫెస్టో ప్రజలను ఆకట్టుకుందని, దీంతో ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మి ఓటేసి గెలిపించారన్నారు. వారి నమ్మకాలను కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 100 రోజులలోనే ఐదు గ్యారెంటీలను అమలు చేయడం జరిగిందన్నారు. అంతే కాకుండా తుక్కుగూడ బహిరంగ సభలో రాహుల్ గాంధీ ఆవిష్కరించిన మ్యానిఫెస్టోలో నారి న్యాయ్ కూడా ఉందని అంటే మహిళలకు న్యాయం చేయడంలో భాగంగా పేద కుటుంబంలోని మహిళలకు ఏడాదికి రూ.లక్షలు ఆర్థిక సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారని, మహిళల శ్రేయస్సు కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే ప్రభుత్వం అన్నారు. గత పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీగా రేవంత్ రెడ్డిని ఘన విజయంతో గెలిపించినట్లుగా ప్రస్తుత కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డిని కూడా గెలిపించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కూకట్‌పల్లి నియోజకవర్గ బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా బ్లాక్ అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాళ్లు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మల్కాజిగిరి సీటు గెలిచి ముఖ్యమంత్రికి బహుమతిగా ఇవ్వాలి



- తూము శ్రీనివాస రావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గం సీటును భారీ మెజార్టీతో గెలిపించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహుమతిగా ఇవ్వాలని, కూకట్‌పల్లి మూసాపేట్ సీనియర్ కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్ తూము శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం కూకట్‌పల్లిలోని తూము శ్రీనివాస రావు నివాసంలో, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ వర్కింగ్ చైర్మెన్ తూము వినయ్ కుమార్ ఆధ్వర్యంలో.. మహిళా కార్యకర్తలతో, కూకట్‌పల్లి, మూసాపేట్ డివిజన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ తూము శ్రీనివాస్ రావు మాట్లాడుతూ... పనిచేసిన వారికి ఇందిరమ్మ కమిటీల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యకర్తలందరూ కలిసికట్టుగా సమన్వయం చేసుకుంటూ పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. పార్లమెంటు నియోజకవర్గం అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి తనయుడు రినీష్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ప్రతి మహిళలకు లక్ష రూపాయలు ఇస్తామని, చదువుకునే విద్యార్థినిలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించడం వంటి పథకాలు కాంగ్రెస్ మ్యానిఫెస్టో ప్రకటించడం గొప్ప విషయం అని పేర్కొన్నారు. అదే విధంగా మల్కాజిగిరి పార్లమెంట్ సీటును ఈసారి మహిళకు కేటాయించడం అందులో పట్నం సునీత మహేందర్ రెడ్డికి కేటాయించడం చాలా సంతోషంగా ఉందని కొనియాడారు. యూత్ విభాగం, మహిళా విభాగం మరింత బాధ్యతగా పనిచేసి భారీ మెజార్టీతో పట్నం సునీతమ్మను గెలిపించాల్సిందిగా ఆయన కార్యకర్తలను, నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి మూసాపేట్ బాలాజీ నగర్ డివిజన్‌కి సంబంధించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నవ సమాజ నిర్మాతలు నేటి విద్యార్థులే



- ఎస్.ఎస్ కామెడీ కపుల్స్ సంధ్య, శ్రీకాంత్
- ఘనంగా రాజధాని పాఠశాల "ప్రేరణమహెూత్సవ్"2కే 2ఫోర్ వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట/కూకట్‌పల్లి

నవసమాజ నిర్మాతలు నేటి విద్యార్థులేనని, పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలధిరో హిస్తారని ఎస్.ఎస్ కామెడీ కపుల్స్ సంధ్య శ్రీకాంత్‌లు అన్నారు. శనివారం సాయంత్రం జగద్గిరిగుట్ట పాపిరెడ్డి నగర్‌లోని రాజధాని హై స్కూల్ ( ప్రేరణ మహెూత్సవ్... 2 కే 2 ఫోర్) వార్షికోత్సవ వేడుకలు పాపారాయుడు నగర్‌లోని అశోక గార్డెన్స్‌లో విద్యార్థుల కేరింతల నడుము ఉల్లాసంగా ఉత్సాహంగా కొనసాగింది. ముందుగా ఈ కార్యక్రమాన్ని పాఠశాల చైర్మెన్, కరస్పాండెంట్ యాద నరేంద్ర గుప్తతో పాటు పాఠశాల డైరెక్టర్లు, ఉపాధ్యాయులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల మనోభావాలకు అనుగుణంగా తల్లిదండ్రుల ప్రోత్సహించాలని అప్పుడే వారు అనుకున్న గమ్యాన్ని సాధిస్తానన్నారు. విద్యతో పాటు, క్రీడలు, సామాజిక విలువల పట్ల ఆసక్తి పెంచుకోవాలని అప్పుడే సమాజంలో మంచి గుర్తింపు పొందుతారని ఆకాంక్షించారు. క్రమశిక్షణతో కూడిన విద్యనం దిస్తున్న యాజమాన్యాన్ని, ఉపాధ్యాయులను వారు ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల చైర్మెన్, కరస్పాండెంట్ యాద నరేంద్ర గుప్త మాట్లాడుతూ తమ పాఠశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్యాబుద్ధులు నేర్పుతూ భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ ప్రాంతంలో తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యనందిస్తూ ప్రతి సంవత్సరం ఎస్.ఎస్.సి.లో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఈ ప్రాంతానికే తలమాణికంగా తమ పాఠశాల విద్యార్థులు నిలుస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన 'రామాయణం' ప్రదర్శన అందరిని ఎంతగానో ఆకట్టుకుంది. చిన్నారి విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



# డ్రయినేజీ సమస్య పరిష్కారానికి కృషి



- కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం ఓల్డ్ బోయిన్ పల్లి 119 డివిజన్‌లోని భవాని నగర్‌లో భవాని కాలనీవాసులు రోడ్డు, డ్రయినేజీ సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని కాలనీవాసులు ఆదివారం కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వెంటనే స్పందించి, కార్పొరేటర్ అధికారులకు దృష్టికి తీసుకెళ్ళి ప్రజలు ఇబ్బంది పెడుతున్న విషయంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రధానంగా ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కాలనీవాసులకు డ్రయినేజీ సమస్య తలెత్తకుండా సంబంధించిన అధికారులను కార్పొరేటర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ సాయిలు, సత్యనారాయణ, సతీష్ యాదవ్, శ్రీరాములు, రమేష్ యాదవ్, చందు యాదవ్, బుర్రి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# వాటర్ ప్లాంట్ నిర్వాహకులపై బస్తీ వాసులు ఆగ్రహం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్ పల్లి సర్కిల్ పరిధిలోని, కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తీలో, అక్రమంగా వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి నీటిని విక్రయిస్తూ...భూగర్భ జలాలను ఎండగడుతున్న వాటర్ ప్లాంట్ నిర్వాహకులపై బస్తీ వాసులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఆదివారం బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..అధ్యక్షుడు చంద్ర రెడ్డి సమక్షంలో, శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ శివాలయం సమీపంలోని 15, 16 మధ్య రోడ్డు ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమానికి బస్తీవాసులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి, అక్రమ వాటర్ ప్లాంట్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. అడుగంటుతున్న భూగర్భ జలాలతో రానున్న రోజుల్లో పాపిరెడ్డి నగర్ బస్తీలో నీటి కొరత తీవ్ర రూపం దాల్చే ఆస్కారం ఉందని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. భూగర్భ జలాలను తోడేస్తున్న అక్రమ వాటర్ ప్లాంట్‌ను తొలగించేందుకు అధికారులు ఎందుకు వెనకడుగు వేస్తున్నారో, ప్రజలకు సమాధానం చెప్పాలని హెచ్చరించారు. భూగర్భ జలాలను కాపాడాల్సిన అధికారులు నిద్రావస్థను వీడి బస్తీ వాసుల సమస్యను పరిష్కరించేందుకు పాటుపడాలన్నారు. ఇకనైనా ఉన్నత అధికారులు మేలుకొని బస్తీలో వెలసిన అక్రమ వాటర్ ప్లాంట్‌ను వెంటనే తొలగించి భావితరాలకు ఉపయోగపడాల్సిన నీటిని కాపాడాల్సిన బాధ్యతను సక్రమంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు తీరులో మార్పు రాకపోతే బస్తి వాసులందరూ ఏకమై వాటర్ ప్లాంట్‌ను తొలగించాల్సిన పరిస్థితికి తీసుకురావద్దని హెచ్చరించారు. కొంతమంది స్థానిక నేతలు అక్రమ వసూళ్లకు పాల్పడుతూ ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించడంతో బస్తీలో వాటర్ ప్లాంట్లు యదేచ్ఛగా చలామణి అవుతున్నాయన్నారు. నిత్యం అక్రమ వాటర్ ప్లాంట్ల ద్వారా లక్షల లీటర్ల విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న వాటర్ ప్లాంట్ దళారులపై అధికారులు చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది అని అన్నారు. ఇదే విషయమై పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు, కూకట్‌పల్లి మండల తాసిల్దార్‌కు, కూకట్‌పల్లి జీహెచ్ఎంసీ అధికారులకు, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసిన సమస్యకు పరిష్కారం దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు మేలుకొని సంబంధిత అధికారులను అప్రమత్తం చేసి తక్షణమే అక్రమ వాటర్ ప్లాంట్‌ను తొలగించి బస్తీ వాసులకు వేసవిలో నీటి కొరత లేకుండా చూడాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ యొక్క కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఆ భగవంతు రెడ్డి క్యాషియర్ నరసింహులు ముదిరాజ్ సిహెచ్, రామకృష్ణారెడ్డి, అనంతరాములు పేర్ని ధర్మారావు హనుమంత రెడ్డి, చంద్రయ్య శేఖర్ రెడ్డి, శరత్ రెడ్డి, పెద్ద ఎత్తున బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

# వాటర్ పైప్ లైన్ పనులను పర్యవేక్షించిన డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిజాంపేట్ మెయిన్ రోడ్డులో హెచ్ఎండబ్ల్యూఎస్ వారు నూతనంగా చెప్పాడుతున్న వాటర్ మెయిన్ పైప్ లైన్ పనులను డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ హెచ్ఎండబ్ల్యూఎస్ మేనేజర్ సాయి రామ్ రెడ్డితో కలిసి ఆదివారం పర్యవేక్షించారు. డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ పైప్ లైన్ పనులను నాణ్యతతో, త్వరగా పూర్తి చేయాలనీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్ లైన్ మెన్‌లు సమరసింహారెడ్డి, మేకల బాలకృష్ణ, యువ నాయకుడు ఆనంద్ రెడ్డి, కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలోని శ్రీ కనకా దుర్గా అమ్మవారిని ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మహేందర్ యాదవ్ మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రెటరీ కొల్తూరు మల్లేష్ ముదిరాజ్, నాయకులు శ్రీశైలం యాదవ్, సుంకరి రమేష్, శ్రీకాంత్, రవి, శివ మరియు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుండిగల్

# వ్యాయామం వల్ల ఆరోగ్యం కాపాడుకోవచ్చు



- డాక్టర్ కృష్ణ చైతన్య రావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ప్రస్తుత కాలంలో ప్రతీ ఒక్క మనిషి వ్యాయామం చేయడం వలన తమ ఆరోగ్యాలను కాపాడుకోవచ్చని డాక్టర్ కృష్ణ చైతన్య రావు అన్నారు. వరల్డ్ హెల్త్ డే సందర్భంగా, కూకట్‌పల్లిలోని మై హెల్త్ హాస్పిటల్ ఆధ్వర్యంలో 5కే మారథన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పాల్గొని, జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాక్స్ హెల్త్ హాస్పిటల్ డైరెక్టర్ కృష్ణ చైతన్య రావు మాట్లాడుతూ... ప్రస్తుత రోజుల్లో ప్రతీ మనిషి ఆరోగ్యపరంగా గుండె సమస్యలు, కిడ్నీ సమస్యలు, ఆడవాళ్ల గైనకాలజీ సమస్యలతో బాధపడుతున్నారని, వాటిని అరికట్టాలంటే ప్రతి ఒక్కరూ ప్రతిరోజు వ్యాయామాలు చేయడం, రన్ చేయడం వల్ల ఆరోగ్య సమస్యల నుంచి తప్పించుకునే అవకాశం ఉందని తెలియజేశారు. అదేవిధంగా డాక్టర్ స్నేహ రెడ్డి మాట్లాడుతూ... గుండె సమస్యలు కిడ్నీ సమస్యలతో బాధపడుతు న్నారని దానికి కారణం ఎలాంటి వ్యాయామం చేయకుండా ఉండడం వల్ల బరువు పెరిగి సమస్యలు ఎదురవు తున్నాయని, ప్రతిరోజు వ్యాయామం చేయడం వలన, రన్నింగ్ చేయడం వలన, సమస్యలను నిర్మూలించవచ్చని అన్నారు. దానికి అనుగుణంగానే వరల్డ్ హెల్త్ డే సందర్భంగా మై హెల్త్ హాస్పిటల్ ఆధ్వర్యంలో, 5కె రన్ నిర్వహించామని అన్నారు. ఈ కార్యక్రమంలో 5కే రన్‌లో గెలిచిన డాక్టర్ కిరణ్, శ్రీనివాసులకు మెడల్ అందజేసి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, డాక్టర్ జయంత్ రెడ్డి, డాక్టర్ ప్రేమ్ కుమార్ రెడ్డి, అన్వేష్ చౌదరి, భాస్కర్‌రావు, శిరీష తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర నిధుల కోసం కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలి



నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని స్ప్రింగ్ ర్యాలీలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి కొలన్ శ్రీ హనుమంత్ రెడ్డి, మాజీ మంత్రివర్యులు పట్నం మహేందర్ రెడ్డి, భూపతి రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి రానున్న ఎన్నికల నిమిత్తమై ఆదివారం కార్యక్రమం నిర్వహించారు. స్ప్రింగ్ ర్యాలీ కార్యక్రమంలో మాట్లాడుతూ మన జిల్లాకి పట్నం సునీత మహేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మనకు కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు అభివృద్ధి కార్యక్రమాలు సక్రమంగా అందాలి అంటే మనకు అంటూ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని తెలిపారు.

# శ్రీశైలం గౌడ్‌కు శుభాకాంక్షల వెల్లువ



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు గాజులరామారం డివిజన్ గాజులరామారంలోని క్యాంప్ కార్యాలయంలో కూన శ్రీశైలం గౌడ్ తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ, శాలువాలు వేస్తూ పుష్పగుచ్చాలతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కూన మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి తన లక్ష్యమని 27 ఏండ్లు కాంగ్రెస్ పార్టీకి సేవ చేసానని, మళ్ళీ తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుంటామని అన్నారు. కుత్బుల్లాపూర్‌లోని కాంగ్రెస్ నాయకులంతా సమిష్టిగా పనిచేసి, 2019 రేవంత్ రెడ్డిని ఎంపీగా గెలిపించినట్లే అని అన్నారు. ఈ ఎన్నికల్లో సునీతా మహేందర్ రెడ్డిని ఎంపీగా భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు గుంజ శ్రీనివాస్, దూలపల్లి కౌన్సిలర్ శివ కుమార్, బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, చాంద్ పాషా, జహంగీర్ భాయ్, లాల్ మహ్మద్, యాదిరెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, తదితర నేతలు పాల్గొన్నారు.

# నవతెలంగాణ

సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్

సోమవారం | ఏప్రిల్ 08, 2024 | www.navatelangana.com


## కాంగ్రెస్ గూటికి బీఆర్ఎస్ కార్పొరేటర్



**నవతెలంగాణ-బంజారాహిల్స్**

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో మాజీ మంత్రి ఖైరతాబాద్ ఎమ్మెల్యే సికింద్రాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ ఆధ్వ ర్యంలో ఆదివారం సోమాజిగూడ డివిజన్ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్ చేరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నేతలు ఉన్నారు.

## గెలుపు కోసం ప్రయత్నాలు..ఓయూ విద్యార్థులతో భేటీ



**నవతెలంగాణ-ఓయూ**

భువనగిరి పార్లమెంట్‌లో కాంగ్రెస్ గెలుపు కోసం హబ్సిగూ డా లో ఓయూ విద్యార్థులతో భువ నగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి సన్నాహక సమా వేశం ఏర్పా టు చేశారు. సమావే శంలో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వేరేశం, సమావేశ అధ్యక్షత వహించగా జంపాల రాంబాబు, సమావేశాన్ని జంపాల రాజేష్, ఏర్పాటు చేశారు. ఓయూ విద్యార్థి నేతలు టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ , నక్క శ్రీ శైలలం , మెడ శ్రీను, వలిగొండ నర్సింహా, దుబ్బ రంజిత్, అలువాల మధుసూదన్, శేషు, వల్లపు చందు, తదితరులు పాల్గొన్నారు.

## అవగాహనతో ఆటిజం జయించడం సులభం

● డాక్టర్ మురళీకృష్ణ

**నవతెలంగాణ-బంజారాహిల్స్**

అవగాహనతోనే ఆటిజంను జయించొచ్చని, తల్లి దండ్రులకు సరైన అవగాహన లేక, ప్రాథమిక దశలో పిల్లల్లో వచ్చే బుద్ధి మాంద్యం సమస్యను గుర్తించకపో వడంతోనే అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని దివీస్ ల్యాబ్ ఎండి డాక్టర్ మురళీ కృష్ణ దివి అన్నారు. ప్రపంచ ఆటిజం డే సందర్భంగా బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్క్ వద్ద దివీస్ ఫౌండేషన్ ఫర్ గిఫ్టెడ్ చిల్డ్రన్ ఆధ్వర్యంలో ఆటిజం అవగాహన నడక నిర్వ హించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ వ్యాధిపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉం డాల్సిన అవసరం ఉందని చిన్న వయసులోనే గుర్తిస్తే త్వరగా ఈ వ్యాధి నుంచి బయటపడవచ్చున న్నారు. తమ సంస్థ తరఫున ఆటిజంతో బాధపడుతున్న చిన్నారుల స్వాంతన కోసం వారు ఆ సమస్య నుంచి బయట పడేందుకు తగు చర్యలు తీసుకుం టున్నామని, అయినా



కూడా దీని పట్ల అవగాహన ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా దివీస్ సంస్థకు చెందిన 300 మంది ఉద్యోగులతో పాటు వాకర్లు పెద్ద ఎత్తున ఈ అవగాహన నడకలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ,దివీస్ ల్యాబ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.వి.రమణ,సీఎఫ్ ఓ ఎల్.కిషోర్ బాబు వైస్ ప్రెసిడెంట్లు ప్రకాశ్ దివి,ఎల్.రమేష్ బాబు, డి.మధుబాబు, జీఎంలు కె.సుబ్బారావు,బి.వర ప్రసాద్, పి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## జంతువులపై క్రూరత్వాన్ని నిరోధించడానికి అవగాహన సదస్సు



**నవతెలంగాణ-బేగంపేట్**

జంతువులపై క్రూరత్వాన్ని నిరోధించడానికి జీహెచ్ ఎస్‌పీసీఏ అధ్వర్యంలో సికిం ద్రాబాద్, సింధి కాలనీలోని జైన్ మందిర్ లో అవగాహణ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో నగరంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, జంతు ప్రేమికులు పాల్గొని తమ అముల్యమైన సలహాలు, సూచనలు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన తీర్థ్ సుందర్ మహారాజు మాట్లాడుతూ జంతువులను కూడా తమలాగే జీవులుగా పరిగణించి వాటిపై ప్రేమను చూపాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ జంతు పరిరక్షణ సంస్థ సలహాదారు మహిప్‌జైన్ మాట్లాడుతూ మూగ జీవాల పరిరక్షణ కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. దాహం, ఆకలి అని పశుపక్ష్యాదులు అడగలేవని వాటికి మన వంతు కర్త వ్యంగా ఆహారం, నీరు కల్పించాలన్నారు. తమ సంస్థ ఆధ్వ ర్యంలో త్వరలో హైదరాబాద్‌లో మూగ జీవాలకు వైద్య సహాయం అందించడం కోసం అత్యాధునిక యంత్ర పరికరాలతో ఆస్పత్రుల నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. దీని నిర్మాణం కోసం పీపుల్స్‌ఫర్ అనిమల్ సంస్థ చైర్మెన్ మేనకా గాంధీ హైదరాబాద్ లో 550గజాల స్థలం కేటాయించారని పేర్కొన్నారు. ఈ స్థలంలోనే హాస్పిటల్ నిర్మాణం చేపట్టి అన్ని జీవాలకు ఉచితంగా వైద్య సహాయం, చికిత్సలు అందించనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ లో అక్రమంగా తరలిస్తున్న 10ఒంటెలను గుర్తించి ఆసిఫ్ నగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు కోర్టు ఆదేశాల ప్రకారం రాజస్థాన్‌లోని మహావీర్ కామెల్ సం చూరికి తరలించినట్లు మహిప్‌జైన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా అనిమల్ వెల్ఫేర్ బోర్డు సభ్యు లు గిరీష్ శా, ప్రముఖ నటుడు అశోక్‌కుమార్, అధ్యక్షుడు దినేష్ అంచాలియ, వ్యవ స్థాపక కార్యదర్శి సురేందర్ బండారి, కోశాధికారి జోషి, సమన్వయ కర్త సౌధర్మ్ బండారి, పశువైద్యుడు డా. విశ్వ చైతన్య పాల్గొన్నారు.

## యశోద ఆస్పత్రి ఆధ్వర్యంలో "5కే మెగా రన్ ఫర్ హెల్త్"

**నవతెలంగాణ-బేగంపేట్**

భారతీయ కార్పొరేట్ సాఫ్ట్ వేర్ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌తో కలిసి యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ "రన్ ఫర్ హెల్త్" పేరుతో మెగా 5కే రన్ ను నిర్వహి ంచారు. ఆదివారం హైటెక్ సిటీ 5కే రన్‌కు ముఖ్య అతిథిగా హాజరైన యశోద ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్, డాక్టర్. జీ.యస్.రావు అండ్ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రెసి డెంట్, రాజన్నతో కలిసి 5కే రన్ ప్రారంభించారు. సాఫ్ట్ వేర్ ఉద్యోగుల్లో 'హెల్తీ లైఫ్ స్టైల్' పట్ల అవగాహన కల్పించడం కోసం ఈరోజు 5000 మందికి పైగా ఉద్యోగు లు, వారి కుటుంబ సభ్యులతో పాటు యశోద ఆస్పత్రి యొక్క డాక్టర్ల బృందం, పారా మెడిక్స్, సిబ్బంది తదితరులు పాల్గొని విజయవంతం చేసారు. ఈ అవగహన రన్ యశోద ఆస్పత్రి-హైటెక్ సిటీ నుండి ప్రారంభమై, టీఎస్‌సీ మీదుగా మళ్లి యశోద ఆస్పత్రి-హైటెక్ సిటీ వద్ద విజయవంతంగా ముగిసింది.ఈ సందర్భంగా యశోద హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, డాక్టర్. జీ.యస్.రావు, మాట్లాడుతూ.. మన ఆరోగ్యంపై ప్రతి కూల ప్రభావం చూపే అనారోగ్యకరమైన జీవనశైలిని దూరం చేయడమే ఈ పరుగు లక్ష్యం. ఈ సంవత్సరం థీమ్ "నా ఆరోగ్యం, నా హక్కు." అనే నినా దంతో వ్యాయామాన్ని మన దినచర్యలో ఒక భాగం చేసు కోవాలని, రెగ్యులర్ వ్యాయా మం, నడక, మన శారీరక ఆరోగ్యాన్ని పెంచడంతోపాటు మానసిక ఆరోగ్యాన్ని మెరుగు పరచడంలో సహాయపడుతుందని, యశోద ఆస్పత్రిలో మేనేజింగ్ డైరెక్టర్, డాక్టర్. జి. యస్. రావు, తెలిపారు.ఈ సందర్భంగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ప్రెసి డెంట్ రాజన్న మాట్లాడుతూ..తన సహచరులందరు ఆరోగ్యం పట్ల



శ్రద్ధ వహించాలని, రోజువారీ నడకపై దృష్టి పెట్టాలని, క్రమమైన వ్యాయామాన్ని కొనసాగించాలని బలమైన సందేశాన్ని అందించారు. సాఫ్ట్ వేర్ నిపుణులు నిశ్చల జీవనశైలిని విడిచిపెట్టి, ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం పరుగు పెట్టాలని ఆయన కోరారు. యశోద గ్రూప్‌ఆఫ్ హాస్పిటల్స్, డైరెక్టర్, డాక్టర్.పవన్ గోరుకంటి మా ట్లాడుతూ.. వ్యాయామం, దాని పూర్తి ప్రయోజనాన్ని సద్వినియోగం చేసుకోవడానికి అర్హత కలిగిన నిపుణుల పర్యవే క్షణలో మాత్రమే సరైన మార్గంలో చెయ్యాలి అని అన్నారు. ఏదైనా ఆరోగ్య సమస్య ఉంటే, దయచేసి వ్యాయామాలు ప్రారంభించే ముందు ఫిజిషియన్ లేదా కార్డియాల జిస్ట్ సలహాతో మాత్రమే ప్రారంభించాలన్నారు. (అతను స్వయంగా ఒక ప్రొఫెషనల్ మారథాన్ రన్నర్). అనారోగ్యకరమైన జీవనశైలిని కొనసాగించడానికి ప్రతివారం 150 నుండి 300 నిమిషాల మితమైన శారీరక శ్రమ లేదా 75 నుండి 150 నిమి షాల శక్తివంతమైన ఏరోబిక్ శారీరక శ్రమను లక్ష్యంగా పెట్టుకోవాలని స్వయంగా ఒక ప్రొఫెషనల్ మారథాన్ రన్నర్ డాక్టర్. పవన్ గోరుకంటి చెప్పారు.

## వాకర్లతో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి లక్ష్మారెడ్డి ఆత్మీయ సమావేశం





**నవతెలంగాణ-కంటోన్మెంట్**

మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఆదివారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు నివేదిత ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డిలతో కలిసి మారేడ్‌పల్లి నెహ్రూనగర్ పార్కులో వాకర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. స్థానిక ప్రజల సమస్యలనుఅడిగి తెలుసుకున్నారు. జర గనున్న ఎన్నికలలో సికింద్రాబాద్ కంటోన్మెంట్‌తో పాటు మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి కోరారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్‌ను ప్రపంచ దేశాలు ప్రశం సించేలా అభివృద్ధి చేశారని ఆయన వివరించారు. ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చి కాంగ్రెస్ వాటిని అమలుచేయడంలో విఫలమైందని విమర్శించారు. ఉచిత కరెంట్, గ్యాస్ సబ్సిడీ వంటి అన్ని పథకాల్లో మోసం చేశారని రాగిడి లక్ష్మారెడ్డి మండిపడ్డారు. ఈ సమావేశంలో కంటోన్మెంట్ బోర్డ్ మాజీ ఉపాధ్య క్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, బోర్డు మాజీ సభ్యురాలు నళిని కిరణ్, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎస్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఆకుల హరి, పలు వార్డుల బీఆర్ఎస్ అధ్యక్షులు, సీనియర్ నేతలు, మహిళా నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు, పలు కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు పాల్గొన్నారు

## ఉప ఎన్నికల్లో టికెట్ కేటాయించండి : తులసి విజయ్ కుమార్

**నవతెలంగాణ-కంటోన్మెంట్**



కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి ఉప ఎన్నికలలో పోటీ చేసేందుకు బీజేపీ అధిష్టానం వర్గం తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించి టికె ట్ ఇవ్వాలని బీజేపీ సీనియర్ నేత వర్రి తులసిరామ్ విజయ్‌పార్య స్థా నాన్ని కోరారు.ఆదివారం మారే డు పల్లిలోని ఇంక్రెడిబుల్ ఇండియా కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భ గా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికలలో తానుటికెట్ ఆశించానని, ప్ర స్తుతం తనతో పాటు పార్టీ అధిష్టానానికి 20 మంది పైగా దరఖాస్తు చేసుకు న్నారని, వారిలో అత్యధికంగా టిక్కెట్ వచ్చే అవకాశం తనకు ఉందని, అధిష్టాన వర్గం తనకు టికెట్ ఇచ్చే ఆశా భావాన్ని వ్యక్తం చేశారు. తన సేవల్ని గుర్తించి అధిష్టాన వర్గం తన సేవ లను గుర్తించి టికెట్ కేటాయించాలని విద్యా వంతుడైన తనకు ఆర్థికంగా, రాజకీయంగా సత్సంబంధాలు ఉన్నాయని, నియోజక వర్గంలోపై పూర్తిగా అవ గా హన ఉందని అభివృద్ధి చేస్తానని, ప్రజలకు సేవ చేసే అవ కాశం తన కల్పించాల అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు.

## టైగర్‌కి టైమ్ వచ్చింది



నాటి ఉద్యమ సారథి ఇంటికి ఆఫీస్‌కు క్యూ కట్టిన ఉద్యోగులు,ఉద్యమ కారులు, ఆశావహులు

### విద్యాశాఖ మంత్రిగా వచ్చే అవకాశాలు ?

**నవతెలంగాణ-ఓయూ**

జేఏసీ చైర్మెన్ ప్రొ.కోదండరాం నాటి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో పెదన్న పాత్ర పోషిం చారు. ప్రొఫెసరైన ఆయన రాష్ట్ర ఏర్పాటు కోసం వివిధ పార్టీలు, ప్రజా సంఘాలను, ఉద్యమ సంస్థలను వివిధ ప్రాంతాలు పలు ఆలోచనలు అయిన ఊరు-ఊరుకి వాడ-వాడలో జత కట్టి ఐక్యం చేసి రాష్ట్ర ఏర్పాటుకు సారధిగా, వారధిగా ఉండి జేఏసీకి రూపం తీసుకువచ్చి ప్రాణం పోశారు. తెలంగాణ రాష్ట్రం కోసం విద్యార్థులు, ఉద్యోగులు, సామాన్యులను కొన్ని సమయాల్లో పార్టీలను ఓర్పు నేర్పు లోక్యంతో ఐక్యం చేసి ఉద్యమానికి బాటలు వేసిన ఉద్యమ సారథి.. ప్రొ.కోదండరాం అని అన్నారు.

### రాష్ట్రం కోసం తరువాత ప్రజాసమస్యలపై గళం

అలాంటి నేత కూడా రాష్ట్రం ఏర్పడిన కొన్ని సంవత్సరాల తరువాత కొన్ని ప్రత్యేక పరిస్థితులు ఎదుర్కొన్నారు. రాష్ట్రం ప్రభుత్వం అవలంబిస్తున్న వివిధ ప్రజావ్యతిరేకత విధానాలకు వ్యతిరేకంగా తెలంగాణ జన సమితి పార్టీని స్థాపించి పలు ఆందోళనలు వ్యక్తం చేసేందుకు పిలుపు ఇచ్చిన వేళా అయినను అరెస్ట్ చేసేందుకు తెల్లవారు జామున ఇంటి తలుపులు సహితం పగల గొట్టారు. అయిన అయిన ఎక్కడ నిరాశతో లేకుండా రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధా నాలకు వ్యతిరేకంగా పోరాడుతు ఉద్యమించారు. దానిలో భాగంగా ఇటీవలే జరిగిన ఎన్నికల్లో మళ్లీ విద్యార్థులు మేధావులు, ప్రజా సంఘాలు, బ్యూరో క్రాట్స్‌ను సమీకరించి గత పాలకులు ఓటమికి కిలక పాత్ర పోషించారు. తెలంగాణ జన సమితి కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చారు. ప్రజల వద్దకు వెళ్ళి వారిని చైతన్యం చేసి కాం గ్రెస్ పార్టీ గెలుపు తనవంతు కృషి తోడ్పాటు అందజేశారు. తరువాత ఆయన ఉద్యమ నైపథ్యం మెదవితనం, పెద్దరికాన్ని చూసి ఈ రాష్ట్ర ప్రభుత్వం ప్రొ.కోదండరాంకు ఎమ్మెల్సీగాగా అవకాశం ఇస్తే అది కాస్త గవర్నర్ పరిధి ఉంది. అయిన కూడా వెనక్కి తగ్గకుండా తనవంతు కృషి ప్రయత్నాలు చేస్తున్నారు. వయస్సు మీద పడ్డ రాష్ట్ర వ్యాప్తంగా ఎవరు వివిధ కార్యక్రమాలకు పిలిచిన పాల్గొంటు ముందుకు పోతున్నారు.ఇక ప్రభుత్వానికి సలహాలు సూచనలు ఇస్తూ ముందుకు పోతున్నారు..

### విద్యా శాఖ మంత్రి ?

కాంగ్రెస్ ప్రభుత్వం క్యాబినెట్‌లో ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిని నియమించలేదు. దీనితో ఉన్నత విద్యా వంతుడు మేధావి గత ప్రభుత్వం ఎన్నో నిర్బంధలు ఎదుర్కొంటున్నా ఎదురొడ్డి పోరాటం చేయడం, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుకు కృషి చేయడంతో ఆయనకు విద్యా శాఖ మంత్రిగా అవకాశాలు



పుష్కలంగా ఉన్నాయన్నా వార్త జోరుగా సాగుతోంది.ఎమ్మెల్సీ విషయం కోర్టులో క్లియర్ ఐయ్యాకతః పార్లమెంట్ ఎన్నికలు ముగిశాక ప్రొ.కోదండరాంకు మంత్రి తథ్యం అంటున్నారు అయిన అనుచర ఉద్యమ కారులు..

### ఇంటి వద్ద ఆఫీస్ వద్ద కోలాహలంగా..

ఇక గత ప్రభుత్వం హయాంలో ప్రొ.కోదండరాం వద్దకు రావాలి లేదా వెళ్లలన్న కొందరు జంకే వారు.. ఇంకొందరు ఎందుకులే లేనిపోని విమర్శలు వస్తాయి రాద్ధాంతం అనుకోనే పరిస్థితి నెలకొంది. కానీ నేడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దానికి భిన్నంగా ఇటు తార్నాకలో గల అయిన నివాసానికి, అటు నాంపల్లి లోని అయిన పార్టీ కార్యాలయనికి రాకపోకలు భారీగా పెరిగాయి. పలువురు ఆశావహులు వివిధ సమస్యలు ఉన్నా వారు పరిష్కరంకై కొందరు తమ సమస్యలు సీఎం లేదా సం బంధించిన మంత్రులు అధికారులు దృష్టికి తీసుకువెళ్లాలని గోడు వెళ్ళ బోసుకుంటున్నారు.

## జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో 'ఫ్లాష్ మాబ్'

**నవతెలంగాణ-బంజారాహిల్స్**



నిత్యం సందర్శకులతో కలకల్లాడే రోడ్ నెంబర్1లోని జీవీకే మాల్‌లో సాం స్కృతిక కార్యక్రమాలు మొదలయ్యాయి. ఏం జరుగుతుందో తెలుసుకుం దా మని అంత ఆసక్తిగా అక్కడికి చేరుకున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువ తెలుసుకోండి అంటూ కళాకా రులు పిలుపునిస్తూ పాటలు, నృత్యాలు చేశారు. స్వీప్ ఆక్టివిటీలో భాగంగా జీహెచ్ ఎంసీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వ హించారు. జీహెచ్ఎంసీ సర్కిల్ 18 డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి మాట్లా డుతూ ఎలక్షన్ కమిషనర్ ఆదేశాల మేరకు ఓటు హక్కు విలువను ప్రతి ఒక్కరికి వివరించే నిమిత్తం కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు ఓటును హక్కుగా వినియోగించుకోవాలని కోరారు.

## పద్మారావును కలిసిన నివేదిత



**నవతెలంగాణ-కంటోన్మెంట్**

సికింద్రాబాద్ బీఆర్ఎస్ పార్లమెంటరీ అభ్యర్థి పద్మారావును ఆదివారం కంటోన్మెంట్ బీఆర్ఎస్ నాయకురాలు లాస్యనందిత సోదరి నివేదిత మర్యాద పూర్వకంగా కలిశారు. మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి మాజీ సభ్యుడు పాండుతో కలిసి పద్మరావును ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు చెప్పారు.

మాజీ మంత్రి మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌కీ జన్మ దిన శుభాకాంక్షలు తెలియజేసిన అంబర్‌పేట నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి సీనియర్ నాయ కులు జేడీ రాహుల్ పాల్గొన్నారు.



**నవతెలంగాణ-అంబర్‌పేట**

## వరంగల్ ఎంపీ టికెట్‌ను వంగపల్లి శ్రీనివాస్ మాదిగకు ఇవ్వాలి

ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కొల్లూరు వెంకటేష్

**నవతెలంగాణ-ఓయూ**

ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్య క్షులు విద్యావంతుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగకి బీఆర్ ఎస్ పార్టీ నుం డి వరంగల్ పార్లమెంటు ఎంపీ టికె ట్ ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్ ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలిదశ తెలం గాణ ఉద్యమంలో అనేక పోరాటాల ఉద్య మంలో పాల్గొని అనేక కేసులు అనుభవించిన ఘనత విద్యార్థినేత ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ మాదిగకి వరంగల్ ఎంపీ టికెట్ ఇవ్వాలన్నారు.

## డిగ్రీ వన్ టైమ్ చాన్స్ పరీక్షల ఫీజు వివరాల వెల్లడి

ఒక్క సబ్జెక్టుకు రూ.10 వేల నుంచి రూ.2 వేలకు తగ్గింపు

**నవతెలంగాణ-ఓయూ**

ఉస్మానియా యూనివర్సిటీ ఓయూ పరిధిలో డిగ్రీ చదివి ఫెయిలైన పూర్వ విద్యార్థులు తిరిగి పరీక్షలు రాసుకునేందకు అధికారులు అవకాశం కల్పించమని ఓయూ కంట్రోలర్ ప్రొ.రాములు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీ ఇతర డిగ్రీ కోర్సుల్లో 2000 నుంచి 2019 వరకు తప్పిన విద్యార్థులు ఈ నెల 15 వరకు, రూ.500 అపరాధ రుసుముతో ఈనెల 20 నుంచి 22 వరకు ఫీజు చెల్లించవచ్చు. గతంలో ఒక్క సబ్జెక్టుకు రూ.10 వేలు ఉన్న పరీక్ష ఫీజును రూ.2,000కు తగ్గించినట్లు తెలిపారు. పూర్తి వివరాలకు www.osmania.ac.in వెబ్‌సైట్‌లో చూడవచ్చని సూచించారు.

## ఓయూ సెల్ట్ దరఖాస్తుల ఆహ్వానం

**నవతెలంగాణ-ఓయూ:-**

ఉస్మానియా యూనివర్సిటీ ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో కొనసాగుతున్న సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెల్ట్)లో ఇంటర్, పాఠశాల విద్యార్థులకు వేసవి ప్రత్యేక శిక్షణ తం˜గతులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాల్టీ డెవలప్మెంట్ కోర్సుల్లో నెల రోజుల శిక్షణకు ఈనెల 15 నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు డైరెక్టర్ ప్రొ.సవిన్ తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నారు. నగరంలో వివిధ పాఠశాల్లో చదివే 8,9,10వ తరగతి విద్యార్థులకు ఉ. 8.15 నిమిషాల నుంచి 9.45 వరకు తరగతులు నిర్వహించనున్నట్లు డైరెక్టర్ ప్రొ.సవీన్ సౌడ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు నేటి నుంచి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## నిబంధనలకు విరుద్ధంగా క్లాసులు నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ కౌన్సిల్

**నవతెలంగాణ-ఓయూ**

ఇంటర్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా తార్నాక పరిధిలో క్లాసులు నిర్వహిస్తున్న వెంకన్న జూనియర్ కళాశాలలో గుర్తింపు రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ ఓయూ, హైదరాబాద్ కౌన్సిల్ ఆధ్వ ర్యంలో ఆదివారం కళాశాల ఎదుట ధర్నా నిర్వహించి క్లాసులను బంద్ చేయించారు. ఈ సంద ర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర (ఆఫీస్ బేరర్స్) సహాయ కార్యదర్శులు గ్యార నరేష్, నెల్లి సత్య హైదరా బాద్ అధ్యక్షులు చైతన్య యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఇంటర్ బోర్డు మార్చి 31 నుండి మే 31 వరకు ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్ ఇంటర్ కళాశాలలు వేసవి కాలంలో ఎటువంటి క్లాసులు నిర్వహించకూడదని, అడ్మిషన్లు ప్రారంభించకూడదని నోటీసు జారీ చేసింది. కానీ తార్నాకలోని వెంకన్న జూనియర్ కళాశాల ఈ నిబంధనలను



పాటించకుండా క్లాసులు నిర్వహిస్తు న్నదని, వెంటనే ఆ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీ చైతన్య,నారాయణ ఇతర జూనియర్ కళాశాలలు కూడా క్లాసులు నిర్వహిస్తూ అడ్మిషన్లను ప్రారం భించాయని వెంటనే దృష్టి సారించాలన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు కళ్యాణ్, అనిల్, అరుణ్, పాల్గొన్నారు.

## డాక్టర్ దీకొండ తిరుపతికి స్వరమాధురి ఉగాది నంది పురస్కారం



**నవతెలంగాణ-ఓయూ**

సామాజిక ఉద్యమకారుడు, ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్, సోషియా లజీ డిపార్ట్ మెంట్ నిజాం కళాశాల ఇన్‌చార్జి హెడ్ డాక్టర్ దీకొండ తిరుపతి స్వరమాధురి ఉగాది నంది పురస్కారాన్ని అందుకున్నారు. చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో శ్రీ క్రోధి నామ తెలు గు సంవత్సర -2024 స్వరమాధురి ఉగాది నంది పురస్కార బహుకరణ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకులాభరణం కృష్ణ మోహన్ రావు చేతుల మీదుగా డాక్టర్ దీకొండ తిరుపతి స్వరమాధురి ఉగాది నంది పురస్కారాన్ని అందుకున్నారు. ఒకవైపు సమాజసేవలో మరోవైపు విద్యారంగంలో అధ్యాపకునిగా పనిచేస్తూ ఓయూ నుంచి డాక్టరేట్ పట్టా సాధిం చినందుకు గాను, ఎంతోమంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చి దిద్దుతున్నందుకు గాను డాక్టర్ దీకొండ తిరుపతికి ఈ అవార్డు ను అందజేస్తున్నట్లు "స్వరమాధురి" సంస్థ వ్యవస్థాపక అధ్య క్షురాలు సాయి పావని తెలిపారు. సామాజిక న్యాయ సాధన ఉద్యమాల్లో యాక్టివ్ గా పాల్గొం టూ ఎంతోమంది వ్యక్తులను చైతన్యం చేస్తున్నందుగాను ఇంతకుముందు న్యూఢిల్లీ వారిచే దళితరత్న అవార్డును కూడా డాక్టర్ దీకొండ తిరుపతి అందుకున్నారు.

## కేసీఆర్ పరిపాలనే దళితుల పట్ల బాగుంది

దళిత క్రైస్తవ దండోరా జాతీయ కన్వీనర్ ప్రొ.గాలి వినోద్ కుమార్



**నవతెలంగాణ-ఓయూ**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నేడు తెలంగాణలో సుదీర్ఘ కాలంగా పరిపాలన చేసిన కాంగ్రెస్ పార్టీ దేశంలో ఉన్న 50 కోట్ల మంది దళితుల సమస్యలు పరిష్కరించడంలో వైఫల్యం చెందిందని దళిత క్రైస్తవ దండోరా జాతీయ కన్వీనర్ ప్రొ. గాలివినోద్‌కుమార్ విమర్శించారు. ఆదివారం తార్నాకలోని తన కార్యాలయంలో రాహుల్ గాంధీకి బహిరంగ లేఖ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందరోజుల ప్రజా పరిపాలన పేరుతో తెలంగాణలో రెడ్ల పాలన కొనసాగుతున్నదని, దళితులకు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఒకే ఒక్క పదవి దక్కగా దళిత క్రైస్తవులకు ఇవ్వాల్సిన క్రైస్తవ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ అగ్రవర్ణానికి చెందిన వ్యక్తికి పదవి ఇచ్చారని, మూ డు పార్లమెంటు స్థానాల్లో మాదిగలకు తీరని అన్యాయం చేసి దళితుల్లో మైనార్టీలైన మాలలకు అత్యధిక ప్రాధాన్యత కాంగ్రెస్ ప్రభుత్వంలో కల్పిస్తున్నారన్నారు. ఇది సామాజిక న్యాయానికి ప్రజాపాలనకు వ్యతిరేకమని ఆయన లేఖలో పేర్కొన్నారు. బహుజనులకు సాధికారత అన్ని రంగాల్లో కల్పించకుండా కేవలం ఉచితల పేరుతో సుదీర్ఘ కాలంగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ ఎస్టీ బీసీ మత మైనార్టీలను మోసం చేస్తూనే ఉన్నదని తెలంగాణలో బీసీలకు తీరని అన్యాయం అసెంబ్లీ పార్లమెంటు ఎన్నికల్లో జరిగిందని రేవంత్ రెడ్డి పరిపాలన కంటే కేసీఆర్ పరిపాలన లోనే దళితులకు దళిత క్రైస్తవులకు బీసీలకు సముచిత న్యాయం జరిగిందని బహిరంగ లేఖలు ఆయన పేర్కొన్నారు.

## మడ్‌ఫోర్ట్‌హర్ట్ కాలనీని సందర్శించిన శ్రీ గణేష్



**నవతెలంగాణ కంటోన్మెంట్**

కంటోన్మెంట్ నియోజకవర్గం ఉప ఎన్నికల కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్ ఆదివారం 3వ వార్డ్ మడ్‌ఫోర్ట్‌హర్ట్‌ని సందర్శించారు. ఈ సందర్భంగా బస్తీవాసులు పలు సమస్యలను ఆయన దృ ష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా తాను, మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీత మహేం దంరెడ్డి గెలిపించాలని కోరారు. గెలిచిన వెంటనే ఇందిరమ్మ స్ఫూర్తితో రాహుల్ గాంధీ అడుగుజాడల్లో, సీఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు బడుగు బలహీన వర్గాల అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తామని హామీ ఇచ్చారు. మడ్ ఫోర్ట్ కాలనీ అధ్యక్షుడు ఉత్తరయ్య స్థానిక బస్తీ మహిళలతో కలిసి పూలమాల, శాలువాలతో శ్రీ గణేష్‌ని సన్మానించి వారి మా పూర్తి మద్దతు కాంగ్రెస్ పార్టీకే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, మహిళలు పాల్గొన్నారు.

## శాస్త్రసాంకేతిక రంగాల్లో అగ్రరాజ్యాల సరసన భారత్

- కొండా సంగీతారెడ్డి



**నవతెలంగాణ-రాజేంద్రనగర్**

శాస్త్రసాంకేతిక రంగాల్లో నరేంద్ర మోడీ పాలన దక్షత, ముందు చూపుతో భారతదేశం అగ్రరాజ్యాల సరసన నిలిచిందని చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి కొండా సంగీతారెడ్డి అన్నారు.డ ఆదివారం రాజేంద్రనగర్ నియోజకవర్గంలో పర్యటించిన ఆమె పలు కమ్యూనిటీల ప్రతినిధులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా వచ్చినప్పటి నుంచి భారతదేశానికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు పెరిగిందన్నారు. రష్యా, అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, బ్రెజిల్ సహా పలు దేశాల అధిపతులు నరేంద్రమోడీ పాలనాదక్షతను కొనియాడుతున్నారని తెలిపారు. విజయవంతమైన పారిశ్రామిక వేత్తగా నిరూపించుకున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సామాన్య ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతోనే రాజకీయాల్లో వచ్చారన్నారు. గతంలో ఆయన ఎంపీగా ఉన్నప్పుడు చేవెళ్ల ప్రాంత అభివృద్ధికి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చేసిన కృషిని ఆమె వివరించారు. వచ్చే ఎన్నికల్లోనూ ప్రజలంతా కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి అండగా ఉండి గెలిపించాలని కొండా సంగీతారెడ్డి కోరారు. అనంతరం కమ్యూనిటీ సభ్యుల కొండా సంగీతారెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, అత్తాపూర్ బీజేపీ అధ్యక్షులు విజయ్‌కుమార్, అత్తాపూర్ కార్పొరేటర్ సంగీత, కొండ గౌతమిరెడ్డి, వినోద్ కుమార్, దామోదర్, నరేష్, సంతోష్, ప్రమోద్ పాల్గొన్నారు.

## చెన్నకేశవ రెడ్డి సాహితీ కృషి ప్రశంసనీయం



**నవతెలంగాణ-కల్చరల్**

ఎనభై ఏండ్ల వయస్సులోనూ అవిశ్రాంత రచనా వ్యాసంగం కొనసాగిస్తున్న చెన్న కేశవరెడ్డి సాహితీ కృషి ప్రశంసనీయం అని శాసనమండలి సభ్యులు వాణీ దేవి ప్రశం సించారు. తమ తండ్రి దేశ నాటి ప్రధాని పీ.వీ నరసింహారావు పై జాతి రత్నం రచన చేసిన చెన్న కేశవ రెడ్డి పై తనకు ప్రత్యేక అభిమానం అని ఆమె తెలిపారు. రవీంద్ర భారతి లోని సమావేశ మందిరంలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జయ మిత్ర సాహిత్య సంస్కృతిక వేదిక నిర్వహణ లో ఆచార్య జీ.చెన్న కేశవ రెడ్డి 80 వ జన్మ దిన సందర్భంలో ప్రముఖ నవలా రచయిత రచయిత అంపశయ్య నవీన్ ను ఇటీవల కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు ప్రకటించిన ప్రసిద్ధ అనువా దకులు ఎలనాగను సత్కరించారు పీ.వీ.గ్లోబల్ ఫౌండేషన్ అధ్యక్షులు పీ.వీ. ప్రభాకర్ రావు మాట్లాడు తూ చెన్న కేశవ రెడ్డి సహచర సాహితీ వేత్త లను తన జన్మ దిన సందర్భంలో సత్కరిం చటం వుత్తమ సంప్రదాయం అన్నారు. సాహితీ వేత్త డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్ అధ్యక్షత వహించి ఏలనాగ అంపశయ్య నవీన్ ల ప్రతిభ వివరించారు.సాహితీ వేత్త లు ఆచార్య నిత్యా నంద రావు,డాక్టర్ వై.రామకృష్ణారావు ఆచార్య పీ.లక్ష్మి నారాయణ విశ్రాంత అధికారులు సురేంద్ర రావు,శంకర్ రెడ్డి, డాక్టర్ నలేస్వరం శంకరం గంటా జలంధర్ రెడ్డి తదితరులు పాల్గొని చెన్న కేశవ రెడ్డి కి జన్మ దిన శుభాకాంక్షలు తెలిపారు.దర్పణం సాహిత్య వేదిక అధ్యక్షుడు సూర్య ప్రకాశ రావు కార్యక్రమ సంధానం చేశారు.

## పురస్కార గ్రహీతలు వారి గుర్తింపును నిలుపుకోవాలి

**బీసీ కమిషన్ చైర్మెన్ డాక్టర్ వకులాభరణం**



**నవతెలంగాణ-కల్చరల్**

పురస్కారం కోసం అర్హులనుఎంచుకోవటం సంస్థలకు వొక ఎత్తు ఐతే పురస్కారం అందుకున్న వారు ఆ గుర్తింపు నిలబెట్టు కొనే విధంగా వారు కృషి మరింతగా ఆయా రంగాల్లో చేయాలని బి. సీ.కమిషన్ చైర్మన్ చైర్మన్ డాక్టర్ వకుళ భరణం కృష్ణమోహన్ రావు సూచించారు. శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై స్వర మాధురి సాంస్కృతిక సేవా సంస్థ నిర్వహణ లో రాబోయే క్రోధి నామ సంవత్సర ఉగాది నంది అవార్డ్స్ ప్రదాన సభ జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ కృష్ణ మోహన్ రావు మాట్లాడుతూ ఉగాది పచ్చడి తీపి వగరు ల కలయిక అనీ జీవితం లో సుఖ దుఃఖాలు సమంగా అనుభవించాలన్న సందేశం ఇందులో వుందని వివరించారు. అధ్యక్షత వహించిన వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు మాట్లాడుతూ జ్యోతిష్యం లో దిట్ట ఇన సామాజిక సేవకుడు మోహన రావు గానం లో ప్రతిభను కనపరుస్తున్న త్రినాథ రావు ను రేడియో జా కీ గా గుర్తింపు పొందిన వేణు తెలుగుభాషా పండితులు మండల స్వామి విద్యావేత్త డీ.తిరుపతి సామాజిక సేవా కార్యకర్త శశి గాయని ఇంద్రాణి లను నంది అవార్డ్స్ కు ఎంపిక చేసుకొని సంస్థ నిర్వాహకులు సాయి పావని విజ్ఞత కనపరచారని అభినందించారు. ఉగాది నంది అవార్డు లను వీరికి బహుకరించారు స్పందన ప్రసంగం లో డాక్టర్ రామరాజు మోహన్ రావు కంచి కామకోటి పీఠాధిపతి అసెస్సులతో సేవా ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు వేదిక పై సూర్యనారాయణ మూర్తి కె గిరి,తదితరులు పాల్గొనగా గాంధీ వ్యాఖ్యానం చేశారు. తొలుత సాయి పావని ఇతర గాయకుల్తో కలిసి పలు పాటలు మధురం గా ఆలపించారు

## పాఠశాలకు బస్సు బహుకరణ



**నవతెలంగాణ-కల్చరల్**

వేగేశ్న ఫౌండేషన్ నిర్వహిస్తున్న మానసిక దివ్యాంగులు, ఆటిజం ప్రత్యేక పాఠశాలకు బి.ఎస్.సీ.పీ.ఎల్ కంపెనీ స్థాపకుడు బొల్లినేని కృష్ణయ, 21 సీట్స్ బస్సుని బహుకరించారు. గత 35 సంవత్సరాలుగా వేగేశ్న ఫౌండేషన్ చేస్తున్న సేవలు ప్రశంస నీయమని అయన అన్నారు .ఈ కార్యక్రమంలో వేగేశ్న ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ వంశీ రామరాజు, చైర్ పర్సన్ శైలజ సుంకరపల్లి , మరియు బి.ఎస్.సీ.పీ. ఏల్ కంపెనీ సెక్రటరీ రాఘవయ్య పాల్గొన్నారు .

# ఆకర్షించిన హునార్ మహోత్సవ్

- రంజాన్ పండుగ సందర్భంగా ప్రదర్శనలో ప్రత్యేక వంటకాలు





**నవతెలంగాణ-కంటోన్మెంట్**

జింఖానా మైదానంలో12 రోజులపాటు నిర్వహించిన హునార్ మహోత్సవ్ కన్నుల పండుగగా ఈ ప్రదర్శన సోమవారంతో ముగియనన్నది. ఈ సందర్భంగా ఆది వారం మహోత్సవ నిర్వాహకులు దీపక్ శుక్ల, రిషికుమార్ లు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతుఊ సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో గత రెండు వారాలుగా నిర్వహించబడుతున్న హునార్ మహోత్సవ్ ఎగ్జిబి షన్ సందర్శకులను ఆకర్షిస్తుంది ఈ ప్రదర్శనలో అరుదైన కళాఖండాలు, పాటు చేతి వృత్తుల వారి తయారుచేసిన ఉత్పత్తులు కూడా సంతర్షకులు నాకర్షిస్తున్నాయి. గాంధీ స్మృతి దర్శన్ సమితి న్యూఢిల్లీ సహకారంతో ఏర్పాటుచేసిన ఈ హునార్ ప్రదర్శన కళా కా రుల్లో ఆత్మ నిర్బంధాన్ని పెంచుతూ భారతీయ సంస్కృతి సృజనాత్మక కళాఖండాలు అభ్యున్నతిని చాటేయని అన్నారు దేశవ్యాప్తంగా 250మంది కళాకారులు రూపొందించిన ఉత్పత్తులు ఆకట్టుకున్నాయి దేశంలో వారసత్వ స్మృతి హస్తకళలను ప్రోత్సహిం చడమే ఉన్నార్ మహోత్సవ్ ఒక ఉద్దేశమని చెప్పారు , ప్రదర్శనలో వంటకాలు రాష్ట్రా లకు చెందిన శిఖరమైన వంటకాలను కూడా ప్రదర్శించామని వివరించారు ప్రదర్శనను అందిస్తోందన్నారు. ఈ మహోత్సవంలో ఆంధ్ర ప్రదేశ్, అస్సాం, బీహార్, ఢిల్లీ, గుజరా త్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ-కశ్మీర్, జార?ండ్, ఒడిశా, పుదుచ్చేరి, పంజా బ్, రాజస్థాన్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, ఉత్తరా ఖండ్, పశ్చిమ బెంగాల్ తదితర 25 రాష్ట్రాలు, కేంద్ర ప్రాంతాల నుండి 350 కంటే ఎక్కువ మంది కళాకారులు పాల్గొం టున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి వచ్చే సందర్శకులు అప్లిక్ వర్క్, డ్రై ఫ్లవర్స్, జనపనార-చెరకు వస్తువు లు, ఇత్తడి వస్తువులు, మట్టి బొమ్మలు, అజ్రఖ్ బ్లాక్ ప్రింట్, పష్మినా షాల్స్ , ఖాదీ ఉత్ప త్తులు, చెక్క ఫర్నిచర్, చందేరీ సిల్క్, రాజస్థానీ ఆభరణాలు, ఫుల్కారీ, లెదర్ ఉత్ప త్తు లు సహా అనేక ఉత్ప త్తు లు ఇక్కడ కొనుగోలు చేయవచ్చునన్నారు. ప్రదర్శనలో ఉన్న హస్త కళను చూసి ఆశ్చర్యపోవడంతో పాటు, సందర్శకులు "ఫుడ్‌కోర్ట్"లో భారతదేశంలోని ప్రతి ప్రాంతం నుండి సాంప్రదాయ రుచికరమైన వంటకాలతో విభిన్న రుచులను పిల్లలు,పెద్దలు అందరు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉల్లాసమైన దాండియా నైట్ కూడ ఉందని,ఇది పండుగ వాతావరణాన్ని జోడిస్తుందని, వచ్చిన వారందరికీ మరపురాని అనుభూతిని ఇచ్చామన్నారు.






## గన్‌ఫౌండ్రీలోని ఆల్ సెయింట్స్ హైస్కూల్ లో పోస్టల్ బ్యాలెట్ కేంద్రాల ఏర్పాటు

- హైదరాబాద్ 7 అసెంబ్లీ సెగ్మెంట్స్ 16 ఇతర పార్లమెంట్ నియోజకవర్గలు 1 కంటోల్మెంట్‌లో 24 కేంద్రాలు
- హైదరాబాద్ పార్లమెంట్ అసెంబ్లీ సెగ్మెంట్ల
- మరియు ఇతర పార్లమెంటరీ నియోజక వర్గాలకు చెందిన ఎలక్షన్ డ్యూటీలో ఉన్న ఉద్యోగుల కోసం ఏర్పాటు
- మే,3 నుండి 8 వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్
- హైదరాబాద్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి





**నవతెలంగాణ-సిటీబ్యూరో**

రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో ఎన్నికల డ్యూటీలో ఉన్న ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకొనుటకు గాను గన్ ఫౌండ్రి లోని ఆల్ సెయింట్స్ హైస్కూల్ లో పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి మరియు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శనివారం హైదరాబాద్ గన్ పౌండ్రి లోని ఆల్ సెయింట్స్ ఉన్నత పాఠశాలను అధికా రులతో కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ హైదరాబాద్ పార్లమెంటరీ అసెంబ్లీ సెగ్మెంట్లు, కంటోన్మెంట్ అసెంబ్లీ సెగ్మెంట్ రాష్ట్రంలోని ఇతర పార్లమెంటరీ నియోజవర్గాలకు చెందిన రాబోయే పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. హైదరాబాద్ పార్లమెంటరీ నియోజక వర్గంలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్స్, కంటోన్మెంట్ 1, రాష్ట్రంలోని ఇతర పార్లమెంటరీ నియోజవర్గాలకు చెందిన 16 పార్లమెంటరీ నియోజకవర్గాలలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బంది కోసం మొత్తం 24 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు అయన తెలిపారు. మే 3 నుండి 8 వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఉంటుందన్నారు పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలలో ఇబ్బందులు కలగకుండా రఘు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, ఆర్డీఓ కే మహిపాల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్య ప్రకాష్, డీఎస్ఓ రమేష్, నాంపల్లి తాసిల్దార్ ప్రేమేందర్, జహీరుద్దీన్ పాల్గొన్నారు.

## ఆస్పత్రులలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- ఆరోగ్యశ్రీలో ఆరోగ్య మిత్రులను నియమించాలి
- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**నవతెలంగాణ-సిటీబ్యూరో**

శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ వైద్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ఆస్పత్రులలో సర్జరీలు, డెలివరీలు, బయోమెట్రిక్ విధానం, సానిటేషన్,, బార్కస్, కామాటిపుర, దబీర్ పుర ఇంకొక వంద పడకల ఆస్పత్రుల నిర్మాణాలపై తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు రోగులకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని అన్నారు. ఆస్పత్రిలోకి వచ్చే అవుట్ పేషంట్ చికిత్స చేయడంతో పాటు, ప్రత్యేక చికిత్సలు అవసరం ఉన్నవారికి వైద్య సేవలు అందించాలని కలెక్టర్ అన్నారు.వంద పడకల ఆసుపత్రిలుగా మంజూరైన సిహెచ్ సి బార్కస్, కామటిపుర, దబీర్ పుర భవన నిర్మాణాల పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రులలో బయోమెట్రిక్ అటెండెన్స్ తీసుకోవాలని, ఆస్పత్రులకు సక్రమంగా విధులకు హాజరుకాని డాక్టర్లకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని, ఆస్పత్రులలో పారిశుధ్య సిబ్బందికి సరియైన సమయంలో జీతాలు ఇవ్వని పారిశుధ్య ఏజెన్సీలకు షోకాస్ నోటీసులు జారీ చేయా లన్నారు. డెంటల్ చైర్స్ అవసరం ఉన్న ఆసుపత్రులకు సరఫరా చేయాలని అన్నారు. బి ఆర్ కే భవన్ లోని సివిల్ డిస్పెన్సరీలను సెక్రటేరియట్ కు షిఫ్ట్ చేయాలని, ఖైరతాబాద్ లో ఉన్నాయి హెచ్ ఎస్ ఆస్పత్రిని బి ఆర్ కే భవన్ కు షిఫ్ట్ చేయాలని, అంబర్పేట్ ఆసుపత్రిలో ఉన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ఆరోగ్యశ్రీలో ఆరోగ్య మిత్రులు లేని చోటా ఆరోగ్య మిత్రులు నియమించాలని సూచించారు. ఆస్పత్రిలో కావలసిన పరికరాల కోసం, ఆసుపత్రిలోనూ ఖాళీగా ఉన్న డాక్టర్ల పోస్ట్ లలో వేరే ఆసుపత్రిలోని డాక్టర్లను ఒ.డి.పై బదిలీ చేయుటకు ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ డిసి హెచ్ఎస్ ను ఆదేశించారు. ఈ సమావేశంలో డి సి హెచ్ ఎస్ డాక్టర్ ఏ సునీత, డిహెచ్ కింగ్ కోటి మెడికల్ సూపర్డెంట్ డాక్టర్ రాజేంద్రనాథ్, ఏ హెచ్ నాంపల్లి డాక్టర్ పి సునీత, ఏహెచ్ మలక్పేట్ డాక్టర్ త్రిలోక్ శ్యామ్, ఏ హెచ్ గోల్కొండ డాక్టర్ మొహమ్మద్ మజాహర్ ఉల్లా, సిహెచ్సి బార్కస్ డాక్టర్ బి ఉమాదేవి, డాక్టర్ కలీం, డాక్టర్ దశరథ్ పాల్గొన్నారు.

రానున్న పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని మహేశ్వరం నియోజక వర్గానికి మైనార్టీల ప్రచార బాధ్యతలను నిర్వహించేందుకు బాలాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు సయ్యద్ అబ్దుల్ అహ్మద్‌ను ఆలిండియా కాంగ్రెస్ కమిటీ మైనార్టీ సెల్ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఇమ్రాన్ ప్రతాప్ గడి నియమించారు. ఈ సందర్భంగా సయ్యద్ అబ్దుల్ అహ్మద్ మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలోని మైనార్టీలను ఏకతాటి పైకి తేచ్చి.. చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ జీ. రంజిత్ రెడ్డి విజయం కోసం తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

నవతెలంగాణ- బడంగ్‌పేట్





హర్యాన రాష్ట్ర ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ సింగిల్ విండో చైర్మన్ కొలన్ శంకర్ రెడ్డి బృందం ఆదివారం హైదరాబాద్‌లో కలిశారు. ఇటీవల హైదరాబాద్ వాసులపై హర్యాన పోలీసులు అక్రమ కేసులు నమోదు చేసి, అన్యాయంగా వేధింపులకు గురి చేశారని, జైలు జీవితం గడుపుతున్న హైదరాబాద్ వాసులకు న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ విషయంపై సీఎం అనుకూలంగా స్పందించినట్లు కొలన్ శంకర్ రెడ్డి తెలిపారు.

నవతెలంగాణ - బడంగ్‌పేట్

## జూనియర్ కళాశాల గుర్తింపును రద్దు చేయాలి



- ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ కౌన్సిల్ డిమాండ్

నవతెలంగాణ - సంతోష్‌నగర్

ఇంటర్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా తార్నాక పరిధిలో విద్యార్థులకు క్లాసులు నిర్వహిస్తున్న వెంకన్న జూనియర్ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆదివారం కళాశాల ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర (ఆఫీస్ బేరర్స్) సహాయ కార్యదర్శిలు గ్యార నరేష్, నెల్లి సత్య, హైదరాబాద్ అధ్యక్షులు చైతన్య యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఇంటర్ బోర్డు మార్చి 31 నుండి మే 31 వరకు ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ ఇంటర్ కళాశాలలు వేసవి కాలంలో ఎటువంటి క్లాసులు నిర్వహించకూడదని, అడ్మిషన్లు కూడా ప్రారంభించకూడదని నోటీసు జారీ చేసిందని గుర్తుచేశారు. కానీ తార్నాకలోని వెంకన్న జూనియర్ కళాశాల ఈ నిబంధనలను పాటించకుండా క్లాసులు నిర్వహిస్తోందని మండిపడ్డారు. కావున వెంటనే ఆ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా శ్రీ చైతన్య, నారాయణ, వశిష్ట ఇతర జూనియర్ కళాశాలలు కూడా క్లాసులు నిర్వహిస్తూ అడ్మిషన్లను ప్రారంభించాయని ఆరోపించారు. వెంటనే వాటిపై దృష్టి సారించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వేసవి కాలంలో క్లాసులు నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలలపైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ ధర్నాలో ఏఐఎస్ఎఫ్ నాయకులు కళ్యాణ్, అనిల్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

- బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు పెద్దపూర బ్రహ్మయ్య



నవతెలంగాణ - నాగోల్

చట్టసభల్లో బీసీ సామాజిక వర్గానికి 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు పెదకూర బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. కొత్తపేటలోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో బీసీ కులాల ఐక్యవేదిక నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీలో బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులుగా పెద్దపూర బ్రహ్మయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, బీసీ కులగణనను చేపట్టాలని, ఉద్యోగ ప్రమోషన్ రిజర్వేషన్ కల్పించాలని కోరారు. బీసీ సబ్ ప్లాన్ కింద పది లక్షల కోట్లు ఇవ్వాలని, పెండింగ్ లో ఉన్న సబ్సిడీ రుణాలు వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్లో ఉన్న ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్లు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న ఫెడరేషన్లకు చైర్మన్లను నియమించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా విద్య, వైద్య రంగాలలో బీసీలకు వాటా ఎంత నో తేల్చాలని అన్నారు. ఈ నూతన కమిటీలో గౌరవ అధ్యక్షులుగా వెన్నుపూజ పరుశరాజ్, ప్రధాన కార్యదర్శిగా పగడాల ఎల్లయ్య, ఉపాధ్యక్షులుగా మద్దెల వినయ్ కుమార్, కోశాధికారిగా పున్నం రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ గా రాగం సుభాష్ యాదవ్, స్టేట్ యూత్ అధ్యక్షులుగా మల్లేష్ ముదిరాజ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా శ్రీరాములు, సంగారెడ్డి అధ్యక్షులుగా విట్టల్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలుగా చైతన్య, జనరల్ సెక్రెటరీగా మాధురి, వైస్ ప్రెసిడెంట్ గా సంఘం రేణుక, మల్లేష్, కృష్ణ తదితరులను ఎన్నుకున్నట్లు తెలిపారు.




## ప్రారంభమైన భద్రాచలం మహాపాదయాత్ర


నవతెలంగాణ - సంతోష్‌నగర్

భద్రాచలంలో ఈ నెల 17న జరగనున్న సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవానికి సగర వంశ చక్రవర్తి శ్రీరాముని వంశీయులైన సగర/ ఉప్పరులు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు, వడిబియ్యం సమర్పించుట కోసం హైదరాబాద్‌లోని కర్మన్ ఘాట్ శ్రీ హనుమాన్ దేవాలయం నుంచి భద్రాచలం వరకు తెలంగాణ సగర సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం 'మహా పాదయాత్ర' కార్యక్రమాన్ని చేపట్టారు. దానిలో భాగంగా కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, ధర్మకర్త ఛాతిరి మధు సాగర్‌లు ఘన స్వాగతం పలికారు. ఉదయం కర్మన్ ఘాట్ శ్రీ హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మహా పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మర్క సురేష్ సగర, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు చీర్ల విష్ణు సగర, బంగారి ఆంజనేయులు సగర, సగర సంఘం నాయకులు బూరుగుపల్లి గణేష్ సగర, ఎదుటి తిరుమలేష్ సగరలు పాదయాత్రను కొనసాగిస్తున్నారు. ఈ పాదయాత్రను ప్రారంభించిన వారిలో సుప్రీంకోర్టు న్యాయవాది, బోస్ వాన దేశం కౌన్సిలర్, హర్యానా రాష్ట్ర ప్రభుత్వ అదనపు న్యాయవాది ఉదయ సగర, గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ చీర్లా శ్రీనివాస్ సగర, సగర భగీరథ ఆత్మగౌరవ భవన వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ అస్కాని మారుతి సగర, తెలంగాణ సగర సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ముత్యాల హరికిషన్ సగర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం సగర, రాష్ట్ర ముఖ్య సలహాదారులు ఆర్.బి. ఆంజనేయులు సగర, యాదాద్రి అన్నదాన సత్ర సంఘం అధ్యక్షులు కెపి రాములు సగర, సాల్ట్ మేకర్స్ ఫెడరేషన్ జాతీయ సలహాదారులు చాతిరి వెంకట్రావు సగర, జాతీయ సాల్ట్ మేకర్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు ఉదయ సగర, గ్రేటర్ హైదరాబాద్ సగర సంఘం అధ్యక్షులు మోడల రవి సగర తదితరులు ఉన్నారు.



# తాటిముంజలు ఎంతో మేలు





- శరీర సమతుల్యతను కాపాడుతాయి
- వడదెబ్బ నుంచి రక్షణ

నవతెలంగాణ - చైతన్యపురి

ఇప్పుడు పట్టణాల్లో కూడా తాటిముంజలు విరివిగా దొరుకుతున్నాయి. కొత్తపేట ప్రాంతానికి ఎక్కువగా... నల్గొండ జిల్లా మునుగోడు, నకరేకల్, కట్టంగూర్, తిప్పర్తి లాంటి ప్రాంతాల నుండి ముంజలు తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. ఈ తాటిముంజలు శరీరంలోని చక్కెర, ఖనిజాల ప్రమాణాలను సమతుల్యం చేస్తాయి.

**తాటిముంజల్లో ఉన్న మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు...ఉపయోగాలు...**

తాటి ముంజల్లో విటమిన్ బి7, విటమిన్ కె, సోలెబుల్ ఫైబర్, పొటాషియం, క్యాల్షియం, విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ డి, జింక్, ఐరన్లతో పాటు న్యూట్రిన్స్ ఉంటాయి. తాటిముంజల్లో నీటిశాతం ఎక్కువ ఉండడం వలన వేసవిలో వడదెబ్బ తగలకుండా చేస్తాయి. ఇవి శరీర ఉష్ణోగ్రతను తగ్గించి, శరీరాన్ని చల్లబరుస్తాయి. వీటిల్లో ఉండే అధిక నీటిశాతం శరీరం డీహైడ్రేషన్ బారిన పడకుండా చేసి శరీరానికి చలువని అందిస్తాయి. వీటిల్లో పొటాషియం సమృద్ధిగా ఉండడం వలన రక్తపోటు అదుపులో ఉండి గుండె ఆరోగ్యానికి సహాయపడతాయి. అంతేకాకుండా ఇవి శరీరంలోని హానికర వ్యర్థ పదార్థాలను తొలగించడంలో అద్భుతంగా పని చేస్తాయి. వేసవిలో వచ్చే తాటిముంజల్ని రోజూ క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా లివర్ సంబంధిత సమస్యలను తగ్గించుకోవచ్చు. తాటి ముంజలు తినడం వలన చెడు కొలెస్ట్రాల్ పోయి మంచి కొలస్ట్రాల్ వృద్ధి చెందుతుంది. తాటి ముంజల్లో ఉండే పోషకాలు జీర్ణ సంబంధిత సమస్యను తగ్గిస్తాయి. వీటిని తినడం వలన తీసుకున్న ఆహారం సక్రమంగా జీర్ణమై గ్యాస్, ఎసిడిటి, కడుపు ఉబ్బరంగా ఉండే ఉదర సంబంధిత సమస్యలు చాలా వరకు తగ్గిపోతాయి. వేసవిలో ఎండ కారణంగా వచ్చే వికారం, వాంతులను నివారిస్తుంది. మహిళల్లో రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలను బాగా తగ్గిస్తుంది.

వేసవిలో వచ్చే చికెన్ పాక్స్ను నివారించి, శరీరాన్ని చల్లగా ఉంచుతుంది. అలాగే శరీరంలోని అధిక బరువుని తగ్గిం చేందుకు తాటి ముంజలు ఎంతో సహాయపడతాయి. తాటి ముంజల్ని గుజ్జుగా చేసి ముఖానికి పైపూతలా రాసుకుంటే చర్మం ప్రకాశవంతంగా మారుతుంది. ఇది చర్మానికి కావల్సినంత తేమను అందించి, వేసవి కాలంలో వచ్చే చెమటకాయల్ని నివారిస్తుంది. అలాగే ఎండ వేడిమి వలన ముఖంపై ఏర్పడే మచ్చలను కూడా తగ్గిస్తుంది.

వేసవిలో మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రకృతి ప్రసాదించిన వాటిల్లో తాటిముంజలు ప్రత్యేకమైనవి. వీటిని పిల్లలు, పెద్దలు వయసుతో సంబంధం లేకుండా అందరూ అమితంగా ఇష్టపడతారు. ఇవి కల్తీలేనివి. స్వచ్ఛమైనవి. మండుటెండల నుండి మంచి ఉపశమనం ఈ తాటిముంజలు. వేసవి సెలవులకు పల్లెటూర్లు వెళ్లేవారు తాటిముంజలని ఖచ్చితంగా లాగిస్తారు.



**జీర్ణకోశ సమస్యకు దివ్య ఔషధం**

పొట్టుతో లేత ముంజలు తింటే మలబద్ధకం తగ్గుతుంది. జీర్ణకోశ సమస్యలకు ఈ తాటిముంజలు దివ్య ఔషధం. అంతేకాదు దీంట్లో పోటాషియం ఎక్కువగా లభిస్తుంది. చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ తినవచ్చు. తాటిముంజలను తినకూడదని అనడానికి కారణాలు అంటూ ఏమి లేవు. హ్యాపీగా అందరూ తినవచ్చు.

- డాక్టర్ ఏ ప్రభాకరాచారి, రిటైర్డ్ ప్రభుత్వ వైద్యులు.





## 'ఆన్‌లైన్‌లో అన్నమాచార్య, రామదాసు కీర్తనల శిక్షణా తరగతులు'

నవతెలంగాణ -నాగోలు

ఆన్‌లైన్ ద్వారా అన్నమాచార్య, భక్త రామదాసు కీర్తనలలో శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకురాలు కే ఎస్ రాజేశ్వరి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేసవి శిక్షణా తరగతులలో భాగంగా సాయి నృత్య తరంగిణి ఆధ్వర్యంలో లలిత సంగీతం అన్నమాచార్య కీర్తనలు, పురంధర దాసు కీర్తనలు ఈ నెల 25 నుంచి మే 31 వరకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ తరగతులను పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు కూడా అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో పాల్గొనే వారికి ఎటువంటి వయోపరిమితి లేదని స్పష్టం చేశారు. ఆసక్తి కలవారు 903255938 ఫోన్ ద్వారా సంప్రదించాలని సూచించారు.

## భువనగిరి ఖిల్లాపై కాంగ్రెస్ జెండా ఎగురేస్తాం

- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



నవతెలంగాణ - తుర్కయంజాల్

పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి ఖిల్లాపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తొర్రూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డితో కలిసి ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. మతతత్వ బీజేపీ మోసపూరిత హామీలను ప్రజలు నమ్మొద్దని కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా కార్యకర్తలు సాయశక్తుల పనిచేయాలని కోరారు. తెలంగాణలో అత్యధిక ఎంపీ సీట్లు గెలిచి రాహుల్‌కు బహుమతిగా ఇస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వేముల వీరేశం, మందుల సామేలు, బీర్ల ఐలయ్య, కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, విజయ రమణారెడ్డి, నాయకులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, వంగేటి గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు సబితమ్మ పరామర్శ



నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 22వ డివిజన్ కార్పొరేటర్ లిక్కీ మమత కృష్ణారెడ్డి మామ లిక్కి వెంకట్ రెడ్డి ఆదివారం మృతిచెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి ఆయన మృతదేహాన్ని సందర్శించి, పూలమాల వేసి నివాళులర్పించారు.

అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆమె వెంట బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ సూర్లగంటి అర్జున్, కార్పొరేటర్ పెద్దబావి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు పెద్దబావి ఆనంద్ రెడ్డి, నాదర్‌గుల్ రైతు సేవా సహకార సంఘం బ్యాంకు చైర్మన్ మర్రి నర్సింహారెడ్డి, నాయకులు గుర్రం వెంకట్ రెడ్డి తదితరులు ఉన్నారు.


**రిపోర్టర్ మహేష్ కుటుంబానికి అండగా ఉంటా...**

సీవీఆర్ న్యూస్ రిపోర్టర్ మహేష్ తండ్రి శ్రీరాముల సోమయ్య అనారోగ్యంతో శనివారం రాత్రి మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి అతని స్వగృహానికి చేరుకొని తన సంతాపాన్ని తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహేష్ కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.



నవతెలంగాణ మానవి
హైదరాబాద్
13
www.navatelangana.com
సోమవారం
8 ఏప్రిల్ 2024

ఆధునిక మహిళ చరిత్రను తిరగ రాస్తుందన్నారు గురజాడ. దాన్ని నిజం చేస్తూ నేటి మహిళలు ఎందరో చరిత్రను సృష్టిస్తున్నారు. తాము అడుగుపెట్టిన రంగాలలో అనేక విజయాలు సాధిస్తున్నారు. భవిష్యత్ తరాలకు మైలురాళ్లను సృష్టించిన ఆ మహిళల విజయాలు ఎందరికో స్ఫూర్తినందిస్తున్నాయి. అసలు చదివే అబ్బదనుకున్న ఓ అమ్మాయి మెడిసెన్ చేసి పరిశోధనలు చేసింది. మంచి ఉద్యోగాన్ని విడిచి నగరం నుండి గ్రామానికి పరుగులు పెట్టింది మరో మహిళ. కళేబరాల బొక్కలు ఏరిన అమ్మాయి అట్టడుగు ప్రజల కోసం ఓ సంఘాన్ని ఏర్పాటు చేసింది. అలాంటి ముగ్గురు మహిళల స్ఫూర్తిదాయక జీవిత పరిచయం నేటి మానవిలో...



# ముగ్గురూ ముగ్గురే...

## పరిశోధనలు చేసి...

గగన్‌దీప్ కాంగ్.. సిమ్లాలో జన్మించింది. ఆమెకు ఆరేండ్లు వచ్చే వరకు అమ్మమ్మ వద్ద పెరిగింది. తల్లిదండ్రులు యునైటెడ్ కింగ్‌డమ్‌లో నివసించారు. కాంగ్‌తో పాటు ఇంట్లో ఇంకా చిన్న పిల్లలు ఉండేవారు. వాళ్ళందరినీ చూసుకోవడం అమ్మమ్మకు చాలా ఇబ్బందిగా ఉండేది. దాంతో కాంగ్ స్కూల్‌కు సరిగ్గా వెళ్లేది కాదు. తల్లిదండ్రులు తిరిగి వచ్చిన తర్వాత ఆమెను బీహార్‌లోని ఒక పాఠశాలలో చేర్పించారు. అక్కడ ఆమె 10 సబ్జెక్టులకు ఏడింటిలో ఫెయిల్ అయ్యింది. తండ్రి ఇండియన్ రైల్వేస్‌లో ఇంజనీర్ కావడంతో 12 ఏండ్లలో కాంగ్ 10 స్కూళ్లను మార్చాల్సి వచ్చింది. వెల్లూరులోని క్రిస్టియన్ మెడికల్ కాలేజ్‌లో(CMC) చేరిన తర్వాత ఆమె మామయ్యతో నిత్యం చర్చిస్తూ ఉండేది. ఆయన ప్రభావంతో ఆమె జీవన గమనం మారిపోయింది. చదువులో బలహీనంగా ఉన్నప్పటికీ కాంగ్ 1987లో మెడిసిన్, బ్యాచిలర్ ఆఫ్ సర్జరీలో పట్టభద్రురాలైంది. ఆ తర్వాత 1991లో జవీజ నుండి మైక్రోబయాలజీ విభాగంలో డాక్టర్ ఆఫ్ మెడిసిన్ (ఎండీ) పూర్తి చేసింది. 1998లో పీహెచ్‌డీ కూడా పొందింది. తర్వాత భారతదేశంలోని ప్రముఖ వైరాలజిస్టులలో ఒకరిగా గుర్తింపు పొందింది. భయంకర అంటువ్యాధైన రోటవైరస్‌పై పరిశోధనను ప్రారంభించింది. 2000ల ప్రారంభంలో ఈ వ్యాధి భారతదేశంలో ఏటా 1.3 లక్షల మరణాలకు కారణమైంది. ఆమె, ఆమె బృందం ఇప్పుడు భారతీయ పిల్లలలో ఈ వ్యాధిని నివారించడానికి వ్యాక్సిన్‌లను అభివృద్ధి చేసింది. అలాగే ఆమె నైపుణ్యం కోవిడ్-19 వ్యాప్తి సమయంలో దేశవ్యాప్తంగా పరిశోధనలో ఉపయోగించబడింది. ఎక్కువగా పురుషుల మధ్య పని చేసిన మహిళగా కాంగ్‌కు ఆ సవాళ్ల గురించి తెలుసు. ఆమె ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు సరైన సమాచారాన్ని వ్యాప్తి చేయడంలో సహాయపడాలనుకుంది. తద్వారా నిధుల కొరత నుండి వ్యాక్సిన్‌లపై అపనమ్మకాన్ని పారద్రోలడంలో విశేష కృషి చేస్తుంది..


గగన్‌దీప్ కాంగ్

## గ్రామానికి తిరిగి వెళ్ళి

ఛవి రజావత్... పూణేలో ఎంబీఏ పూర్తి చేసిన తర్వాత ఒక ప్రముఖ టెలికాం సంస్థలో మంచి ఉద్యోగాన్ని వదిలి, అట్టడుగు స్థాయిలో పని చేయడానికి రాజస్థాన్‌లోని సోడాలోని తన పూర్వీకుల గ్రామానికి తిరిగి వెళ్ళింది. ఆమె తాత ఆ గ్రామానికి మూడుసార్లు సర్పంచ్‌గా ఉన్నారు. దాంతో సంఘం సభ్యులు రాజావత్‌ను ఈ పద్ధతిని ముందుకు తీసుకెళ్లాలని కోరుకున్నారు.

'మనలో ప్రతి ఒక్కరూ మన జీవిత ప్రయాణాన్ని ఒక గ్రామంలో తిరిగి చూడవచ్చు. అవకాశాల కోసం గ్రామాలను విడిచిపెట్టిన వారితో మన నగరాలు నిండి ఉన్నాయి. అయితే గ్రామాలే మనకు పునాది. అవి బలంగా ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందనే నమ్మకంతో నేను తిరిగి గ్రామానికి వెళ్లాను' అని ఆమె చెప్పారు. 2011లో రజావత్ ఎన్నికలలో పోటీ చేసి గ్రామ సర్పంచ్ అయ్యారు. తన సంఘానికి నీరు, సోలార్ పవర్, పాఠశాల, రోడ్లు, మరుగుదొడ్లతో పాటు బ్యాంకును తీసుకొచ్చాను.


ఛవి రజావత్

గ్రామం అత్యంత కరువుతో బాధపడుతుండటం చూసి, అక్కడ భూగర్భ జలాలు నీటిపారుదలకి కూడా అవకాశం లేదని ప్రకటించారని రాజావత్‌కు అర్థమైంది. 'నేను కేవలం కరువు వినాశనానికి వ్యతిరేకంగా పోరాడలేదు. ఒక సమాజాన్ని ఏకతాటిపైకి తీసుకురావడానికి ప్రయత్నించాను' ఆమె చెప్పారు. 2010లో సోడాలో సుమారు 7 వేల మంది జనాభా ఉన్నారు. అయితే ప్రభుత్వం కేవలం రూ.20 లక్షల నిధులు మాత్రమే కేటాయించింది. అందులో సగం ప్రభుత్వ భవన నిర్మాణానికి ఖర్చు చేసింది. 'కాబట్టి నేను ఏడాదికి రూ. 10 లక్షల బడ్జెట్‌తో నా పని ప్రారంభించాను. పంచాయితీ తన సొంత అభీష్టానుసారం నిధులను ఉపయోగించకపోవడమే కాకుండా, జిల్లాలో ఎంచుకున్న ప్రాజెక్టులను మాత్రమే మేము అమలు చేయగలమని గ్రహించాను. ఇది ప్రధాన కార్యాలయం, అక్కడి అధికారులచే ఆమోదించబడింది. ఇది గ్రామం కోరుకున్నదానికి, ఆమోదించబడిన వాటికి మధ్య పెద్ద అసమతుల్యతకు దారితీసింది' అని ఆమె వివరించారు. రాజావత్ ప్రతి ఇంటి నుండి వారి అవసరాలు, ప్రాధాన్యతలను అర్థం చేసుకోవడానికి వారితో మాట్లాడేవారు. ఆమె సర్పంచ్‌గా గ్రామ అభివృద్ధి కోసమే కాదు వ్యవస్థ, కుల అక్షరాస్యత, లింగ-ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా ఒక గొప్ప పోరాటం చేశారు. చిన్న జోక్యాలు కూడా గ్రామానికి భారీ ప్రయోజనాలు అందిస్తాయని ఆమె గ్రహించారు. ఇప్పటికీ ఆమె సోడా అభివృద్ధికై పని చేస్తూనే ఉన్నారు. అదే సమయంలో అట్టడుగు స్థాయి వారి కోసం కృషి చేస్తూ దేశమంతటా మహిళలను ప్రేరేపిస్తున్నారు.

## మొదటి మహిళగా...

గౌతమ మీనా చెన్నైలో తన తల్లితో కలిసి కబేళాల నుండి ఎముకలను సేకరిస్తూ పెరిగింది. చాలా సందర్భాల్లో సరిపడా నీళ్ల లేక స్నానం చేయకుండానే స్కూల్‌కి అలాగే వెళ్లిపోయేది. చాలా ఏండ్ల తర్వాత మీనా బౌద్ధ, అంబేద్కరైట్‌ను అభ్యసించడం మొదలు పెట్టింది. ఆల్ ఇండియా ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ ఎస్సీ/ఎస్టీ అసోసియేషన్‌ను స్థాపించింది. అఖిల భారత స్థాయిలో ఉద్యోగ సంఘానికి నాయకత్వం వహించిన మొదటి మహిళగా చరిత్ర సృష్టించింది. మీనా చిన్న వయస్సు లోనే ఫుట్‌బాల్ ఆడటం ప్రారంభించింది. 1994లో చెన్నైలో జరిగిన తొలి అంతర్జాతీయ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో సభ్యురాలిగా చేరింది. 'ఆట నాకు అంతుచిక్కని దూకుడును వదిలించుకోవడానికి సహాయపడింది. నా ప్రత్యర్థులను గమనించడానికి నా నైపుణ్యాలను మెరుగుపరిచింది. ఇది తర్వాత కాలంలో నా జీవితంలో కూడా నాకు సహాయపడింది' ఆమె చెప్పింది. రిజర్వేషన్ రోస్టర్‌లో దిగ్భ్రాంతికరమైన వ్యత్యాసాలను కనుగొన్న తర్వాత 2016లో మీనా, ఆమె బృందం వారి హక్కుల కోసం నిరసనలు చేయడం ప్రారంభించింది. ఈ పోరాటం ముగిసే సమయానికి ఆమె పది రోజుల పాటు నిరాహార దీక్షకు కూర్చున్న ఏకైక ఉద్యోగి. ఆమె సంఘం చేసిన ఏడేండ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత ఆమె శాఖలో మొట్టమొదటిసారిగా గెజిట్ ర్యాంక్ ఆఫీసర్ల కోసం 459 ఎస్సీ/ఎస్టీ, ఓబీసీ ఖాళీలు భర్తీ చేయబడ్డాయి. ఈ రోజుకూ మీనా చెన్నైలోని పులియంతోప్‌లోని తన మురికివాడలోని ఒక తరం యువతులను వారి కలలను అనుసరించడానికి ప్రేరేపిస్తుంది. ఆమె వారి విద్యకు నిధులు సమకూరుస్తుంది. వారికి క్రీడలలో శిక్షణ ఇస్తుంది. అణగారిన వర్గాల కేసులపై పోరాడేందుకు ఆమె తన లా డిగ్రీని కూడా పూర్తి చేసింది. ■


గౌతమ మీనా

## పీసీఓడీ సమస్య...



నేడు పీసీఓడీ సమస్యతో బాధపడుతున్న మహిళలు అధిక సంఖ్యలో వున్నారు. పీసీఓడీ తీవ్రతను ఎదుర్కోవటానికి మహిళలు తన ఆహారంలో చేయవలసిన కొన్ని నియమాలు పాటిస్తే ఇటువంటి సమస్యలు దరిచేరని నిపుణులు చెబుతున్నారు.

పీసీఓడీ (పాలిసిస్టిక్ ఓవేరియన్ డిసీజ్) అనేది స్త్రీ అండాశయాలు అపరిపక్వ గుడ్లను విడుదల చేసే పరిస్థితి. ఇది చివరికి సిస్ట్‌లుగా మారుతుంది. ఈ వ్యాధిని పూర్తిగా వదిలించుకోవడానికి మార్గం లేనప్పటికీ, ఆరోగ్యకరమైన, సమతుల్య ఆహారపు అలవాట్లతో పాటు.. వ్యక్తిగత చికిత్స కూడా వ్యాధిని నియంత్రించడంలో సహాయపడుతుందని అంటున్నారు. ఈ సమస్య వల్ల చాలా మంది మహిళలకు గర్భధారణ సమస్యలు వస్తాయి. దీనికి సంబంధించి ఆహారంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను చూద్దాం.

ఈ సమస్య ఉన్నవారు రెడ్ మీట్‌ను తీసుకోకూడదు. వీటిలో కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉండటమే కాదు, హార్మోన్ల అసమతుల్యతని కూడా పెంచుతాయి. ఫైబర్ ఎక్కువగా ఉన్న ఆహారం, ప్రాసెస్డ్ ఫుడ్‌ను తీసుకోవద్దని నిపుణులు సూచిస్తున్నారు. పీసీఓడీతో బాధపడేవారు స్వీట్లను తీసుకోరాదు.

### తక్కువ తినండి , ఎక్కువగా త్రాగండి

ఈ సమస్యతో బాధపడేవారిలో చేతులు, పాదాలు, చీలమండలు వాపు వస్తుంది. అందువల్ల రోజంతా పుష్కలంగా నీరు తాగాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇది టాక్సిన్స్‌ను బయటకు పంపడంలో సహాయపడుతుంది. బరువు నియంత్రణలో కూడా సహాయపడుతుంది.

ఫ్లాక్స్ సీడ్, బాదం, నువ్వులు వంటి గింజలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల బరువు తగ్గుతారు. అలాగే ప్రొటీన్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. ఈస్ట్రోజెన్, ఇన్సులిన్ వంటి హార్మోన్ల సంశ్లేషణలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. అలాగే చికెన్, గుడ్డులోని తెల్లసొన, పెరుగు, సాల్మన్‌లను చేర్చుకోవాలి.

---

## మళ్లీ మోడీ వస్తే.. ప్రజాస్వామ్యమే ఉండదు



(మొదటిపేజీ తరువాయి)

శనివారం జరిగిన బహిరంగ సభలో కరత్ ప్రసంగించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతిపక్ష నేతలను బీజేపీ లక్ష్యంగా ఎంచుకున్నదని ఆయన ఆరోపించారు. అరవింద్ కేజ్రీవాల్, హేమంత్ సొరేన్‌ను అరెస్ట్ చేశారని, ఓ వైపు ఎన్నికల ప్రచారం జరుగుతుంటే మరోవైపు ప్రతిపక్ష నేతలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు దాడులు చేస్తూనే ఉన్నాయని విమర్శించారు.

**ఇవేం చర్యలు?**

ప్రతిపక్షాలతో బీజేపీ ప్రజాస్వామిక పద్ధతిలో పోరాడడం లేదని, వాటిని అణచివేస్తోందని కరత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ ఖాతాలను ఆదాయపన్ను శాఖ స్తంభింపజేసిందని, ఆ పార్టీకి నోటీసులు జారీ చేసిందని గుర్తు చేశారు. కేరళలోని త్రిస్సూర్ జిల్లాలో సీపీఐ (ఎం) బ్యాంక్ ఖాతాను సైతం ఐటీ శాఖ ఫ్రీజ్ చేసిందని చెప్పారు. ఈడీ, సీబీఐ, ఐటీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థల ద్వారా ప్రతిపక్షాలను అణగదొక్కేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. 'బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడినందుకు ప్రతిపక్ష నేతలను పార్లమెంట్ నుండి సస్పెండ్ చేశారు. పాత్రికేయులు, పౌర హక్కుల కార్యకర్తలను కూడా కటకటాల వెనక్కి నెట్టారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామిక స్వేచ్ఛ కోసం పోరాడుతున్న సంస్థలు ఈ చర్యలను విమర్శించాయి' అని ఆయన అన్నారు.

**మందిర నిర్మాణం ఘనకార్యమా?**

అయోధ్యలో రామమందిర నిర్మాణాన్ని ఓ ఘనకార్యంగా బీజేపీ, మోడీ ఎన్నికల ప్రచారంలో చెప్పుకుంటున్నారని కరత్ ఎద్దేవా చేశారు. అది ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమమని, మోడీ పురోహితుడిగా వ్యవహరించారని చెప్పారు. ఈ కార్యక్రమానికి హాజరు కానందుకు ప్రతిపక్షాలను బీజేపీ విమర్శించిందని, అది ఒక రాజకీయ ప్రాజెక్ట్ అయినందునే ప్రతిపక్షాలు ఆ ఆహ్వానాన్ని తిరస్కరించాయని తెలిపారు. మతతత్వ అజెండా కోసం మతాన్ని, రాజకీయాన్ని కలగలిపారని విమర్శించారు. రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని, దేశాన్ని హిందూత్వ రాష్ట్రంగా మార్చేసే ఉద్దేశంతో మనువాద సిద్ధాంతాన్ని అమలు చేస్తోందని ధ్వజమెత్తారు.

**బీజేపీయే అవినీతి పార్టీ**

'ఇండియా కూటమిని అవినీతి పార్టీల కలయికగా బీజేపీ, మోడీ పిలుస్తున్నారు. బీజేపీయే అత్యంత అవినీతి పార్టీ అని ఎన్నికల బాండ్ల ఉదంతం నిరూపించింది. చట్టాలను సవరించి బాండ్ల పథకాన్ని ప్రవేశపెట్టారు. విరాళాల కోసం ఖాతాలు తెరిచేందుకు సీపీఐ (ఎం) నిరాకరించింది. బాండ్ల పథకాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పథకం రాజ్యాంగ విరుద్ధమని ఆరు సంవత్సరాల తర్వాత సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. బాండ్లలో సగానికి పైగా బీజేపీ ఖాతాలోకే చేరాయి. ప్రజలను బెదిరించేందుకు ఆ డబ్బును బీజేపీ ఉపయోగించింది. ఎన్నికల బాండ్ల ద్వారా జరిగిన మనీ లాండరింగ్, అవినీతిపై విచారణ జరపాలి. దానిని సుప్రీంకోర్టు పర్యవేక్షించాలి' అని కోరారు.

**వరదల సమయంలోనూ నిధులివ్వరు**

దేశం రాష్ట్రాల సమాఖ్యగా ఉండాలా, దేశంలో ఫెడరలిజం ఉండాలా అనే అంశాలను రాబోయే ఎన్నికలు నిర్ణయిస్తాయని కరత్ చెప్పారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు 'ఒకే దేశం...ఒకే భాష...ఒకే సంస్కృతి' విధానాన్ని కోరుకుంటున్నాయని తెలిపారు. ఆ పార్టీ నాయకులు దేశంలో ఒకే ఎన్నికలు ఉండాలని కూడా భావిస్తున్నారని, ఇది ఫెడరల్ నిర్మాణాన్ని నాశనం చేస్తుందని అన్నారు. పాలకులు గవర్నర్లను వాడుకుంటున్నారని, వారేమో వైస్రాయ్‌ల మాదిరిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వరదల సమయంలో సైతం తమిళనాడుకు బీజేపీ ప్రభుత్వం నిధులు ఇవ్వలేదని కరత్ మండిపడ్డారు.

# బీబీసీ ప్రసారాలు సమాప్తం

న్యూఢిల్లీ : బ్రిటీష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (బీబీసీ) భారత్‌లో తన ప్రసారాలను నిలిపివేసింది. తన భారతీయ ఉద్యోగులు ఏర్పాటు చేసిన ప్రయివేటు లిమిటెడ్ కంపెనీకి ప్రచురణ లైసెన్సును అప్పగించింది. పన్ను ఉల్లంఘనల పేరుతో గతంలో బీబీసీ కార్యాలయాలలో ఆదాయపన్ను శాఖ అధికారులు సోదాలు నిర్వహించడం, ప్రశ్నలు సంధించడం తెలిసిందే. ఈ వేధింపులు జరిగి సంవత్సరం కూడా పూర్తికాకముందే బీబీసీ భారత్‌లోని తన న్యూస్‌రూమ్‌ను మూసేసింది. అంతర్జాతీయంగా ప్రసార సేవలు అందిస్తున్న ఓ ప్రభుత్వ సంస్థ తన కార్యకలాపాలను నిలిపివేయడం ప్రపంచంలో ఇదే మొదటిసారి. 'కలెక్టివ్ న్యూస్‌రూమ్' పేరిట ఏర్పడిన ప్రయివేటు లిమిటెడ్ కంపెనీతో బీబీసీ కుదుర్చుకున్న ఒప్పందం ఈ వారంలోనే అమలులోకి వస్తుంది. ఈ కంపెనీని నలుగురు బీబీసీ మాజీ ఉద్యోగులు ఏర్పాటు చేశారు. మన దేశంలో ఈ న్యూస్‌రూమ్‌కు చెందిన కార్యాలయాలు భారత్‌కు సంబంధించిన వార్తలు, ఇతర అంశాలను బీబీసీ డిజిటల్ సర్వీసెస్ కోసం హిందీ, గుజరాతీ, మరాఠీ, పంజాబీ, తమిళం, తెలుగు భాషల్లో అందిస్తాయి. కొత్తగా ఏర్పడిన ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో 26 శాతం వాటాల కోసం బీబీసీ కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసిందని తెలిసింది.

**అసాధారణ చర్యే**

బీబీసీ తన ప్రచురణ లైసెన్సును మరో సంస్థకు అప్పగించడం అసాధారణమని కలెక్టివ్ న్యూస్‌రూమ్ సీఈఓ రూపా ఝా తెలిపారు. జర్నలిజంలో రాజీ పడబోమని, తమ వెనుక బీబీసీ ఉన్నదని ఆయన స్పష్టం చేశారు. బీబీసీ ఇండియాలో ఝా సీనియర్ న్యూస్ ఎడిటర్‌గా పనిచేశారు. కలెక్టివ్ న్యూస్‌రూమ్ వ్యవస్థాపక వాటాదారుల్లో ఆయన కూడా ఒకరు. మన దేశంలో బీబీసీ నిర్వహిస్తున్న కార్యకలాపాలను పునర్నిర్మించాలంటే 2020లో ప్రవేశపెట్టిన నూతన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) నిబంధనలను అనుసరించాల్సి ఉంటుంది. వీటి ప్రకారం దేశీయ డిజిటల్ మార్కెట్ రంగంలో విదేశీ కంపెనీల ఎఫ్‌డీఐ పరిమితి 26 శాతం మాత్రమే. గతంలో దేశంలో బీబీసీ ఎడిటోరియల్ కార్యకలాపాలను బీబీసీ ఇండియా నిర్వహించేది. ఇందులో 99 శాతానికి పైగా వాటాలు బ్రిటన్‌కు చెందిన బీబీసీవే. అయితే పెట్టుబడులపై ఆంక్షలు విధించడంతో 26 శాతం ఎఫ్‌డీఐ పరిమితిని దాటిన కంపెనీలు తమ విదేశీ పెట్టుబడులను 2021లో విధించిన నియంత్రణలకు అనుగుణంగా తగ్గించుకోవాల్సి ఉంటుంది.

**'గుజరాత్' డాక్యుమెంటరీ ప్రసారమే కారణం**

బీబీసీ ఇండియా బ్యూరోలో 200 మంది పనిచేస్తున్నారు. బ్రిటన్ వెలుపల మన దేశంలోనే బీబీసీ కార్యకలాపాలు పెద్ద ఎత్తున నడుస్తున్నాయి. 1940 మేలో బీబీసీ మన దేశంలో ప్రసారాలను ప్రారంభించింది. గత సంవత్సరం ఫిబ్రవరిలో ఢిల్లీ, ముంబయిలోని దాని కార్యాలయాలలో ఆదాయ పన్ను శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. 2002లో జరిగిన గుజరాత్ అల్లర్లపై బీబీసీ ఓ డాక్యుమెంటరీని ప్రసారం చేసిన కొద్ది రోజులకే దాడులు, సోదాలు జరగడం గమనార్హం.

**ఇష్టం లేకపోయినా...**

ఎఫ్‌డీఐపై నూతన నిబంధనలు అమలులోకి రావడంతో బీబీసీ కార్యకలాపాలపై నీలినీడలు కమ్ముకొన్నాయి. అయినప్పటికీ ఆ సంస్థ మన దేశంలో తన ఉనికిని కోల్పోవడాన్ని ఇష్టపడలేదు. ఉద్యోగాలలో కోత విధించాలని కోరుకోలేదు. అదే సమయంలో ఆర్థికంగా ఇబ్బందులు పడడాన్ని జీర్ణించుకోలేకపోయింది. ఈ నేపథ్యంలో ఇష్టం లేకపోయినా విధిలేని పరిస్థితులలో కార్యకలాపాలను నిలిపివేయాలని నిర్ణయం తీసుకుంది.

బీబీసీ అందుకున్న న్యాయ సలహా ఆధారంగా కలెక్టివ్ న్యూస్‌రూమ్ ఏర్పాటుకే అందరూ మొగ్గు చూపారని ఝా చెప్పారు. తాజా పరిణామాలపై బీబీసీ న్యూస్ డిప్యూటీ సీఈఓ జోనాథన్ మన్రో వ్యాఖ్యానిస్తూ 'భారత్‌లో బీబీసీ మనుగడకు ఘన చరిత్ర ఉంది. ప్రేక్షకులకే తొలి ప్రాధాన్యత ఇచ్చాం. ఈ పురోగతిని ముందుకు తీసికెళ్లడానికి కలెక్టివ్ న్యూస్‌రూమ్ ఏర్పాటు దోహదపడుతుంది. దీనిని మేము స్వాగతిస్తున్నాం' అని చెప్పారు.

## గెలుపే లక్ష్యంగా పని చేయండి

(మొదటిపేజీ తరువాయి)

నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి సికింద్రాబాద్, వరంగల్ నియోజకవర్గాలకు చెందిన ముఖ్యనేతలతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఆయా నియోజవర్గాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై దిశా నిర్దేశం చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా సాధించలేదన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలన్నారు. కేంద్ర మంత్రి, బీజేపీ నేత కిషన్‌రెడ్డి సికింద్రాబాద్‌కు చేసిందేమీ లేదని విమర్శించారు. ఈ ప్రాంతంలో ఎన్నో పెండింగ్ సమస్యలున్నాయనీ, అయినా ఆయన పట్టించుకోలేదన్నారు. వరంగల్ నియోజకర్గం అభ్యర్థిని ఓడిస్తామంటూ బీఆర్ఎస్ నేతలు పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు.

వరంగల్ నియోజకవర్గం సమావేశంలో మంత్రి కొండా సురేఖ,సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, అభ్యర్థి కడియం కావ్య, ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు. సికింద్రాబాద్ సమావేశంలో అభ్యర్థి దానం నాగేందర్, అసెంబ్లీల్లో ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు అజహరుద్దీన్, విజయారెడ్డి, ఆదం సంతోష్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఫిరోజ్‌ఖాన్, రోహిన్‌రెడ్డి, నీలిమా తదితరులు పాల్గొన్నారు.

# పట్టాలిచ్చేదాకా కదలం..

(మొదటిపేజీ తరువాయి)

సందర్భంగా జరిగిన సమావేశంలో ఎస్. వీరయ్య మాట్లాడుతూ.. సంగారెడ్డి పట్టణంలో వందలాది మంది పేదలేసుకున్న గుడిసెల్ని రెవెన్యూ అధికారులు, పోలీసులు నేల మట్టం చేయడం సరైంది కాదన్నారు. రాష్ట్రంలోని 19 జిల్లాల్లో ఇండ్లు లేని నిరుపేద కుటుంబాలు ప్రభుత్వ స్థలాల్లో లక్షకుపైగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారన్నారు. వీరందరికీ గతంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఇండ్ల స్థలాలిస్తామని చెప్పి దాటవేసిందని గుర్తుచేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఎక్కడా పేదలకిచ్చిందిలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.5 లక్షల ఆర్థిక సహాయం ఇచ్చి ఇండ్లు నిర్మించి ఇస్తామని, ఇంటి స్థలాల్లేని పేదలందరికీ ఇండ్ల స్థలాలిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటినా రాష్ట్రంలో ఎక్కడా ఏ ఒక్క నిరుపేదకు ఇండ్ల స్థలాలివ్వలేదని విమర్శించారు. ప్రజలు గుడిసెలేసుకుంటే పట్టాలెట్లా ఇస్తామని ప్రభుత్వం చెప్పడం సహేతకంగా లేదన్నారు. ఇండ్లు లేని పేదలు ప్రభుత్వ స్థలాల్లో వంద గజాల వరకు ఇల్లు కట్టుకుంటే హక్కు కల్పించాలని రాజ్యాంగమే చెప్పిందన్నారు.

ప్రజలకు రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కును ప్రభుత్వాలు కాలరాస్తే సహించేదిలేదని స్పష్టంచేశారు. మహబూబాబాద్, హన్మకొండ, జడ్చర్ల, కోరుట్ల, సంగారెడ్డి, వరంగల్, బచ్చన్నపేట వంటి ప్రాంతాల్లో పేదలేసుకున్న ఇండ్లను కూల్చివేయడం ప్రభుత్వ దమననీతికి అద్దం పడుతుందన్నారు. ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇండ్ల స్థలాల్ని కేటాయించడం ఇష్టంలేని రాష్ట్ర ప్రభుత్వం ఆయా స్థలాలను అమ్ముకుని ఖజానా నింపుకోవాలని చూస్తుందన్నారు.

ఇచ్చిన మాట నిలుపులేని ప్రభుత్వాలపై కొట్లాడితే తప్ప ఇండ్ల స్థలాల్ని సాధించుకోవడం సాధ్యం కాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పేదలంతా ఎక్కడికక్కడ ఐక్యంగా నిలబడి పట్టాలిచ్చే వరకు వేసుకున్న గుడిసెల్లోనే నివసిస్తూ పోరాడాల్సిన అవసరముందని తెలిపారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే రాష్ట్రంలో ప్రభుత్వ స్థలాల్లో పేదలు వేసుకున్న ఇండ్లకు పట్టాలిచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదిర్శ వర్గ సభ్యులు అతిమేల మాణిక్యం, జిల్లా కమిటీ సభ్యులు ఎం.యాదగిరి, ఇళ్ల స్థలాల పోరాట నాయకులు మణి, లలిత, సుజాత, రాజయ్య, దత్తు, సాయిలు, పద్మ పాల్గొన్నారు.

## ప్రశ్నించే గొంతు పార్లమెంట్‌లో ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

స్మారక భవనంలో ఆ పార్టీ మున్సిపల్ కమిటీ సమావేశం ఎమ్‌డీ పాషా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో పదేండ్ల మోడీ పాలనలో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించారన్నారు. ధరల మీద ధరలు పెంచి పేద ప్రజల నడ్డి విరిచిందని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకుంటూ కార్మిక, రైతాంగ సమస్యలు పట్టించుకోకుండా పాలన సాగించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతాంగంపై నల్ల చట్టాలు తీసుకువచ్చి వందలాది మంది రైతుల చావులకు బీజేపీ కారణమైందన్నారు. ప్రతిపక్ష పార్టీలపై ఈడీ, సీబీఐ దాడులు నిర్వహిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. బీజేపీలో ఉంటే నీతిమంతులు, లేకపోతే అవినీతిపరులా అని ప్రశ్నించారు. దేశంలో మూలుగుతున్న నల్లధనాన్ని తీసుకువచ్చి ఒక్కొక్కరి ఖాతాలో రూ.15 లక్షల చొప్పున జమచేస్తానని చెప్పిన మోడీ.. ఒక్క రూపాయి కూడా జమచేయలేదని గుర్తుచేశారు. ప్రజలపై పన్నుల భారం మోపడం, దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెట్టడమే లక్ష్యంగా బీజేపీ ప్రభుత్వం పనిచేసిందన్నారు. ఎన్నికల బాండ్ల పేరుతో వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడింది బీజేపీ కాదా అని ప్రశ్నించారు. మతోన్మాదం పేరుతో దేశ ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేస్తుందన్నారు. దేశంలో మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని తెలిపారు. మతవిద్వేషాలు రెచ్చగొడుతూ హిందుత్వం పేరుతో పబ్బం గడుపుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగాన్ని ధ్వంసంచేసే విధంగా మోడీ విధానాలు ఉన్నాయన్నారు. భువనగిరి పార్లమెంట్ సీపీఐ(ఎం) అభ్యర్థి ఎమ్‌డీ.జహంగీర్‌ను గెలిపించేందుకు ప్రతికార్యకర్తా సైనికునిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆ పార్టీ మున్సిపల్ కార్యదర్శి బండారు నర్సింహ, జిల్లాకమిటీ సభ్యులు అవ్వారు రామేశ్వరి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గోపగోని లక్ష్మణ్, కౌన్సిలర్ దండ హిమబిందు అరుణ్‌కుమార్, కార్యదర్శివర్గ సభ్యులు ఆకుల ధర్మయ్య, నాయకులు బత్తుల దాసు, ఉష్కాగుల శ్రీనివాస్, గోశిక కర్నాకర్, బొడ్డు రాజుగౌడ్, నెల్లికంటి నర్సింహ, బొమ్మకంటి కృష్ణ, బాతరాజు దశరథ, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## సూట్‌కేసులో కరెన్సీ కట్టలు..

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ సభ్యుడు, ప్రయివేట్ హెూటల్ మేనేజర్ సతీష్, అతని సోదరుడు నవీన్, ఒక డ్రైవర్ పెరుమాళ్ ఆరు బ్యాగుల్లో 4 కోట్ల రూపాయలను తీసుకువెళుతున్నారు. ఈ ముగ్గురూ రైలులో తిరునల్వేలికి వెళ్లాల్సి ఉండగా ఫ్లయింగ్ స్క్వాడ్ వారిని అదుపులోకి తీసుకున్నది. తిరునెల్వేలి బీజేపీ ఎంపీ అభ్యర్థి నైనార్ నాగెంతిరన్ బృందం సూచనల మేరకు సతీష్ పనిచేసినట్టు ప్రాథమికంగా అంగీకరించారు. ఈ విషయంపై తదుపరి విచారణ కొనసాగుతున్నదని అధికారులు తెలిపారు. 39 లోక్‌సభ స్థానాలున్న తమిళనాడులో ఒకే దశలో ఏప్రిల్ 19న పోలింగ్ జరగనున్నది. దీనికి కొన్ని రోజుల ముందే ఈ పరిణామం చోటు చేసుకోవటం గమనార్హం.

తమిళనాడులో ఎన్నికలను బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది. ఇక్కడ కొన్ని పార్టీలతో కలిసి కూటమిని ఏర్పాటు చేసింది. ప్రధాని కూడా ప్రత్యేకంగా దృష్టి సారించి సమయం దొరికినప్పుడల్లా తమిళనాడులో సభలు, సమావేశాలు, ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఇందులో భాగంగా ఇటీవలే ఒక తమిళ వార్త ఛానెల్‌కు ఆయన ఇంటర్వ్యూ కూడా ఇచ్చారు. ఇందులో ఆయన తమిళ సాంప్రదాయ వస్త్రధారణ అయిన లుంగీ కట్టుకొని మరీ వచ్చారు. అయితే, ఇక్కడ ఓటు షేర్‌ను పెంచుకొని ఒకట్రెండు సీట్లయినా దక్కించుకోవాలని కాషాయపార్టీ తపనపడుతున్నది. ఇందుకోసమే, నగదు ప్రవాహం వంటి అడ్డదారులకైనా ఆ పార్టీ వెనకాడటం లేదనీ, బీజేపీ కార్యకర్త నగదుతో పట్టుబడటమే దీనికి తార్కాణమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

## కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా నివేదిత?

(మొదటిపేజీ తరువాయి)

ఉప ఎన్నిక అనివార్యమైంది.లోక్‌సభ ఎన్నికలతో పాటే కంటోన్మెంట్ ఉప ఎన్నిక కూడా జరగనుంది. లాస్య నందిత సోదరి, దివంగత సాయన్న కుమార్తె నివేదితను పార్టీ అభ్యర్థిగా బరిలో నిలపాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. ఈ మేరకు నేతల సమావేశంలో నివేదిత పేరు చెప్పినట్టు సమాచారం. ఉగాది తర్వాత అధికారికంగా ప్రకటించే అవకాశముంది.





ముంబయి మురిసింది. ఎట్టకేలకు ముంబయి ఇండియన్స్ ఓ విజయం సాధించింది. ఐపీఎల్ 17సీజన్‌లో వరుసగా మూడు పరాజయాలు చవిచూసిన ముంబయి ఇండియన్స్ ఆదివారం వాంఖడెలో ఢిల్లీ క్యాపిటల్స్‌ను చిత్తు చేసింది. భారీ స్కోర్లు నమోదైన మ్యాచ్‌లో పంత్‌సేనపై 29 పరుగుల తేడాతో పాండ్యసేన గెలుపొందింది. రొమారియో షెఫర్డ్, టిమ్ డెవిడ్, జస్‌ప్రీత్ బుమ్రా మెరుపు ప్రదర్శనతో ముంబయి ఇండియన్స్ పాయింట్ల ఖాతా తెరిచింది.



# ముంబయి మురిసింది

- ముంబయి ఇండియన్స్‌కు తొలి గెలుపు
- ఢిల్లీ క్యాపిటల్స్‌పై ఘన విజయం
- షెఫర్డ్, బుమ్రా, డెవిడ్ మెరుపుల్
- ముంబయి 234/5, ఢిల్లీ 205/8

నవతెలంగాణ - ముంబయి

పరుగుల వరద పారిన వాంఖడెలో ముంబయి ఇండియన్స్ పైచేయి సాధించింది. ఢిల్లీ క్యాపిటల్స్‌పై 29 పరుగుల తేడాతో గెలుపొందిన ముంబయి ఇండియన్స్ ఐపీఎల్ 17 సీజన్లో తొలి విజయం నమోదు చేసింది. 235 పరుగుల రికార్డు ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ పోరాడినా ఓటమి తప్పలేదు. ట్రిస్టన్ స్టబ్స్ (71 నాటౌట్, 25 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్సులు), పృథ్వీ షా (66, 40 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సులు), అభిషేక్ పోరెల్ (41, 31 బంతుల్లో 5 ఫోర్లు) కదం తొక్కినా క్యాపిటల్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 205 పరుగులకే పరిమితమైంది. తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి ఇండియన్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 234 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్లు రోహిత్ శర్మ (49, 27 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సులు), ఇషాన్ కిషన్ (42, 23 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సులు) సహా టిమ్ డెవిడ్ (45 నాటౌట్, 21 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సులు), రొమారియో షెఫర్డ్ (39 నాటౌట్, 10 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సులు) విధ్వంసక ఇన్నింగ్స్‌లతో చెలరేగారు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న రొమారియో షెఫర్డ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. నాలుగు మ్యాచుల్లో ముంబయి ఇండియన్స్‌కు ఇది తొలి విజయం కాగా.. ఐదు మ్యాచుల్లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఇది నాల్గో పరాజయం. ఇక ముంబయి ఇండియన్స్ ఓ అరుదైన రికార్డు నమోదు చేసింది. ఇన్నింగ్స్‌లో ఒక్క అర్థ సెంచరీ సైతం నమోదు కాకుండా ఓ టీ20 మ్యాచ్‌లో అత్యధిక పరుగులు చేసిన జట్టుగా నిలిచింది.

### స్టబ్స్ పోరాటం వృథా

లక్ష్యం 235 పరుగులు. ధనాధన్ మెరుపులకు పిచ్ అనుకూలం. దీంతో ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ దూకుడుగా ఆడింది. పృథ్వీ షా (66), అభిషేక్ పోరెల్ (41) దంచికొట్టారు. పృథ్వీ షా పవర్‌ప్లేలో అదరగొట్టాడు. మూడు సిక్సర్లు, ఎనిమిది ఫోర్లతో విరుచుకుపడ్డాడు. ట్రిస్టన్ స్టబ్స్ (71 నాటౌట్) విధ్వంసక విన్యాసం వృథా అయ్యింది. 25 బంతుల్లోనే 71 పరుగులు పిండుకున్న స్టబ్స్ ముంబయి ఇండియన్స్‌కు భయపెట్టాడు. ఏడు సిక్సర్లు, మూడు ఫోర్లతో సునామీ సృష్టించిన స్టబ్స్‌కు మరో ఎండ్‌కు సహకారం లభించలేదు. రిషబ్ పంత్ (1), అక్షర్ పటేల్ (8), లలిత్ యాదవ్ (3), కుమార్ కుశాగ్ర (0)లు చేతులెత్తేశారు. డెవిడ్ వార్నర్ (10) నిరాశపరిచాడు. పృథ్వీ షా, అభిషేక్ పోరెల్, స్టబ్స్ మెరుపులతో ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 205 పరుగులు చేసింది. ముంబయి ఇండియన్స్ బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా (2/22) క్యాపిటల్స్ విజయావకాశాలను ప్రభావితం చేశాడు. గెరాల్డ్ కోయేట్జి (4/34) టెయిలెండర్ల వికెట్లతో ఢిల్లీ ఆశలపై నీళ్లు చల్లాడు.

### కలిసికట్టుగా కొట్టారు

టాస్ నెగ్గిన ఢిల్లీ క్యాపిటల్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఆరంభంలో పిచ్ నుంచి అదనపు పేస్ ఆశించిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు నిరాశే ఎదురైంది. ముంబయి ఓపెనర్లు రోహిత్ శర్మ, ఇషాన్ కిషన్ పవర్‌ప్లేలో ఎదురుదాడి చేశారు. దీంతో తొలి ఆరు ఓవర్లలోనే ముంబయి ఇండియన్స్ 75 పరుగులు పిండుకుంది. రోహిత్ శర్మ మూడు సిక్సర్లు, ఆరు ఫోర్లు కొట్టగా.. ఇషాన్ కిషన్ సైతం రెండు సిక్సర్లు, నాలుగు ఫోర్లతో చెలరేగాడు. తొలి వికెట్‌కు ఓపెనర్లు ఏడు ఓవర్లలోనే 80 పరుగులు జోడించగా ముంబయి ఇండియన్స్ భారీ స్కోరు దిశగా సాగింది.



సూర్యకుమార్ యాదవ్ (0) పునరాగమనంలో సున్నా పరుగులకే నిష్క్రమించగా.. కెప్టెన్ హార్దిక్ పాండ్య (39, 33 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), తిలక్ వర్మ (6) మిడిల్ ఓవర్లలో నెమ్మదిగా ఆడారు. కానీ డెత్ ఓవర్లలో ముంబయి ఇండియన్స్ బ్యాటర్లు అరాచకం అంటే ఎంటో చూపించారు. టిమ్ డెవిడ్ (45 నాటౌట్), రొమారియో షెఫర్డ్ (39 నాటౌట్) ఆకాశమే హద్దుగా చెలరేగారు. నోకియా వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్లో రొమారియో ఏకంగా నాలుగు సిక్సర్లు, రెండు ఫోర్లతో విధ్వంసం సృష్టించాడు. ఆఖరు ఓవర్లో 32 పరుగులు పిండుకున్న షెఫర్డ్ ముంబయి ఇండియన్స్ గతినే మార్చివేశాడు. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లు వరుసగా రెండో మ్యాచ్‌లో ఊచకోతకు గురయ్యారు. అక్షర్ పటేల్, ఎన్రిచ్ నోకియా చెరో రెండు వికెట్లు పడగొట్టారు. లలిత్ యాదవ్, రిచర్డ్‌సన్, నోకియా, ఇషాంత్ శర్మ ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు.

**స్కోరు వివరాలు :**

**ముంబయి ఇండియన్స్ ఇన్నింగ్స్ :** రోహిత్ శర్మ (బి) అక్షర్ 49, ఇషాన్ కిషన్ (సి,బి) అక్షర్ 42, సూర్యకుమార్ యాదవ్ (సి) ఫ్రాసెర్ (బి) నోకియా 0, హార్దిక్ పాండ్య (సి) ఫ్రాసెర్ (బి) నోకియా 39, తిలక్ వర్మ (సి) అక్షర్ (బి) ఖలీల్ 6, టిమ్ డెవిడ్ నాటౌట్ 45, రొమారియో షెఫర్డ్ నాటౌట్ 39, ఎక్స్‌ట్రాలు : 14, **మొత్తం :(20 ఓవర్లలో 5 వికెట్లకు) 234.**

**వికెట్ల పతనం :** 1-80, 2-81, 3-111, 4-121, 5-181.

**బౌలింగ్ :** ఖలీల్ అహ్మద్ 4-0-39-1, ఇషాంత్ శర్మ 3-0-40-0, జై రిచర్డ్‌సన్ 4-0-40-0, అక్షర్ పటేల్ 4-0-35-2, లలిత్ యాదవ్ 1-0-5-0, ఎన్రిచ్ నోకియా 4-0-65-2.

**ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్ :** పృథ్వీ షా (బి) బుమ్రా 66, డెవిడ్ వార్నర్ (సి) హార్దిక్ (బి) షెఫర్డ్ 0, అభిషేక్ పోరెల్ (సి) డెవిడ్ (బి) బుమ్రా 41, ట్రిస్టిన్ స్టబ్స్ నాటౌట్ 71, రిషబ్ పంత్ (సి) హార్దిక్ (బి) కోయేట్జి 1, అక్షర్ పటేల్ (రనౌట్) 8, లలిత్ యాదవ్ (సి) కిషన్ (బి) కోయేట్జి 3, కుమార్ కుశాగ్ర (సి) తిలక్ (బి) కోయేట్జి 0, జై రిచర్డ్‌సన్ (సి) ఇషాంత్ (బి) కోయేట్జి 2, ఎక్స్‌ట్రాలు : 3, **మొత్తం : (20 ఓవర్లలో 8 వికెట్లకు) 205.**

**వికెట్ల పతనం :** గెరాల్డ్ కోయేట్జి 4-0-34-4, జస్‌ప్రీత్ బుమ్రా 4-0-22-2, ఆకాశ్ మద్వాల్ 4-0-45-0, రొమారియో షెఫర్డ్ 4-0-54-1, మహ్మద్ నబి 2-0-7-0,పియూశ్ చావ్లా 2-0-32-0.

# యశ్, కృనాల్ మాయ

- టైటాన్స్‌పై సూపర్ జెయింట్స్ గెలుపు
- లక్నో 163/5, గుజరాత్ 130/10

నవతెలంగాణ-లక్నో

ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ ఫోబియోను లక్నో సూపర్‌జెయింట్స్ అధిగమించింది. గుజరాత్ టైటాన్స్‌పై తొలిసారి గెలుపొందిన లక్నో సూపర్‌జెయింట్స్.. పాయింట్ల పట్టికలో టాప్-3లోకి చేరుకుంది. 164 పరుగుల ఊరించే ఛేదనలో గుజరాత్ టైటాన్స్ 18.5 ఓవర్లలో 130 పరుగులకే కుప్పకూలింది. స్పిన్నర్ కృనాల్ పాండ్య (3/11), పేసర్ యశ్ ఠాకూర్ (5/30) మ్యాజిక్‌తో లక్నో 33 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టైటాన్స్ తరఫున సాయి సుదర్శన్ (31), గిల్ (19), తెవాటియ (30) మినహా అందరూ విఫలమయ్యారు. అంతకుముందు, మార్కస్ స్టోయినిస్ (58, 43 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సులు), కెఎల్ రాహుల్ (33, 31 బంతుల్లో 3 ఫోర్లు) రాణించగా లక్నో సూపర్‌జెయింట్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 163 పరుగులు చేసింది.



### మార్కస్ అర్థ సెంచరీ

సొంతగడ్డపై టాస్ నెగ్గిన లక్నో సూపర్‌జెయింట్స్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. కానీ ఆ జట్టుకు ఆశించిన ఆరంభం దక్కలేదు. ఫామ్‌లో ఉన్న ఓపెనర్ క్వింటన్ డికాక్ (6) నిరాశపరిచాడు. ఉమేశ్ యాదవ్‌పై ఓ సిక్సర్‌తో మెరిసిన డికాక్.. ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే వికెట్ కోల్పోయాడు. యువ ఆటగాడు దేవదత్ పడిక్కల్ (7) వైఫల్యం కొనసాగించాడు. ఏడు బంతుల్లో ఏడు పరుగులు చేసిన పడిక్కల్ ఉమేశ్ యాదవ్‌కు తలొంచాడు. 18/2తో ఒత్తిడిలో పడిన పరిస్థితుల్లో మార్కస్ స్టోయినిస్ (58)తో జతకలిసిన కెఎల్ రాహుల్ (33) జట్టుకు మెరుగైన స్కోరు అందించాడు. రాహుల్ మరోసారి నెమ్మదిగా ఆడాడు. 31 బంతులు ఆడిన రాహుల్ కేవలం మూడు ఫోర్లు కొట్టాడు. మార్కస్ స్టోయినిస్ అర్థ సెంచరీతో అలరించాడు. నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్లతో స్టోయినిస్ కదం తొక్కాడు. చివర్లో నికోలస్ పూరన్ (32 నాటౌట్, 22 బంతుల్లో 3 సిక్సులు), ఆయుశ్ బదాని (20, 11 బంతుల్లో 3 ఫోర్లు) లక్నో సూపర్‌జెయింట్స్‌కు మెరుగైన ముగింపు అందించారు. కృనాల్ పాండ్య (2 నాటౌట్) అజేయంగా నిలిచాడు.

## రెండో టెస్టులోనూ ఓటమి

భారత్, ఆసీస్ హాకీ టెస్టు సిరీస్

**పెర్త్ (ఆస్ట్రేలియా) :** హాకీ ఇండియా రెండో టెస్టులోనూ నిరాశపరిచింది. రెండో టెస్టులో 4-2తో గెలుపొందిన ఆస్ట్రేలియా ఐదు టెస్టుల సిరీస్‌లో 2-0తో ఆధిక్యం సాధించింది. భారత్ తరఫున జుగ్రాజ్ సింగ్ (9వ నిమిషం), హర్మన్‌ప్రీత్ సింగ్ (30వ నిమిషం) గోల్స్ కొట్టారు. జెరెమీ హేవార్డ్ (6, 34వ నిమిషం) రెండు పెనాల్టీ కార్నర్‌లను గోల్స్‌గా మలిచి ఆసీస్‌కు ముందంజలో నిలిపాడు. జాకబ్ అండర్సన్ (42వ నిమిషం), నాథన్ (45వ నిమిషం) కీలక గోల్స్‌తో ఆసీస్‌కు విజయాన్ని అందించారు.



మృణాల్ ఠాకూర్, విజయ్ దేవరకొండ, దిల్‌రాజు

## ఫ్యామిలీ స్టార్స్‌కు బిగ్ సర్‌ప్రైజ్

ఫ్యామిలీ ఆడియెన్స్ ఆదరణతో సక్సెస్ ఫుల్ థియేట్రికల్ రన్ కంటిన్యూ చేస్తోంది విజయ్ దేవరకొండ 'ఫ్యామిలీ స్టార్' సినిమా. తమ ఫ్యామిలీకి సపోర్ట్‌గా నిలబడే వాళ్లంతా ఫ్యామిలీ స్టార్సే అనేది ఈ మూవీ స్టోరీ లైన్. అలాంటి ఫ్యామిలీ స్టార్స్‌ను కలిసేందుకు ఫ్యామిలీ స్టార్ టీమ్ సర్‌ప్రైజ్ విజిటింగ్‌కు వస్తోంది.

మీ ఇంటి ఫ్యామిలీ స్టార్‌ను ఫ్యామిలీ స్టార్ టీమ్ కలవాలని కోరుకునే రెండు తెలుగు రాష్ట్రాల ప్రేక్షకులకు గొప్ప అవకాశం ఇది. ఈ అనౌన్స్‌మెంట్‌లోని ఫామ్ ఫిల్ చేస్తే ఫ్యామిలీ స్టార్ టీమ్ హీరో విజయ్ దేవరకొండ, నిర్మాత దిల్ రాజు, హీరోయిన్ మృణాల్ ఠాకూర్, దర్శకుడు పరశురామ్ పెట్ల మీ ఇంటికి వచ్చి మీ ఫ్యామిలీ స్టార్‌ను సర్‌ప్రైజ్ చేస్తారు. ఈ ఫామ్‌లో మీ పేరు అడ్రస్‌తో పాటు మీ ఫ్యామిలీ స్టార్ ఎవరు, ఎందుకు అనే ప్రశ్నలకు ఆన్సర్స్ రాసి ఫిల్ చేయాలి. థియేటర్స్‌లోకి వరల్డ్ వైడ్ రిలీజ్‌కు వచ్చింది ఫ్యామిలీ స్టార్ సినిమా. తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు సహా ఓవర్సీస్‌లోనూ మంచి కలెక్షన్స్ రాబడుతోంది. ముఖ్యంగా ఈ సినిమా టార్గెటెడ్ ఆడియెన్స్ అయిన సకుటుంబ ప్రేక్షకులకు బాగా రీచ్ అవుతోంది.

ఇదిలా ఉంటే, ఈ సినిమాకు విజయం దక్కకూడదని, విజయ్ దేవరకొండకు పేరు రాకూడదని కొందరు వ్యక్తులు, కొన్ని సోషల్ మీడియా గ్రూప్స్ పనిగట్టుకుని ప్రయత్నాలు చేస్తున్నాయి. రిలీజ్‌కు ముందే సినిమా మీద నెగిటివ్ పోస్టులు చేశారు. వీటిని ఆధారాలతో సహా చిత్ర బృందం సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

# నవచిత్రం

## పవర్‌ఫుల్ పాత్రలో..

హరీష్ శంకర్ దర్శకత్వంలో రవితేజ నటిస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ 'మిస్టర్ బచ్చన్'లో జగపతి బాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అనౌన్స్ మెంట్ పోస్టర్‌లో జగపతి బాబు ఇంటెన్స్, ఫెరోషియస్ లుక్‌లో కనిపించారు. చెస్ మూవ్‌ని చేతిలో పట్టుకొని సీరియస్‌గా చూస్తున్న లుక్ అందర్నీ అలరిస్తోంది.



జగపతిబాబు

'మిస్టర్ బచ్చన్'లో జగపతి బాబు పాత్ర చాలా పవర్ ఫుల్‌గా ఉండబోతుందని ఈ పోస్టర్ ద్వారా తెలుస్తుంది. జగపతి బాబు పాత్రని దర్శకుడు హరీష్ శంకర్ పవర్ ప్యాక్‌గా ప్రజెంట్ చేస్తున్నారు.

రవితేజ, జగపతిబాబులను తెరపై చూడటం కనుల పండువగా ఉంటుంది. ఇద్దరికీ పవర్ ఫుల్ క్యారెక్టర్స్ రాసుకున్నారు హరీష్ శంకర్. రవితేజ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది. టీమ్ 50 రోజుల చిత్రీకరణ పూర్తి చేసుకుంది. ఇప్పటివరకు దాదాపు 80% ప్రొడక్షన్ వర్క్ పూర్తయింది. మిగిలిన పనులను త్వరగా పూర్తి చేసి వీలైనంత త్వరగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రం 'నామ్ తో సునా హెూగా' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తోంది.

## దసరా కానుకగా రిలీజ్

రజనీకాంత్ టైటిల్ పాత్రలో 'జై భీమ్' ఫేమ్ టీ.జే. జ్ఞానవేల్ దర్శకత్వంలో 'వేట్టయాన్' సినిమా రాబోతోంది. ప్యాన్ ఇండియన్ రేంజ్‌లో ఎన్నో ప్రముఖ చిత్రాలను నిర్మిస్తున్న లైకా ప్రొడక్షన్స్ బ్యానర్ పై సుభాస్కరన్ భారీ ఎత్తున ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, ఫహద్ ఫాసిల్, రానా దగ్గుబాటి, మంజు వారియర్ వంటి భారీ తారాగణం నటిస్తోంది. ఇప్పటికే ఈ సినిమా మీద అంచనాలు భారీ స్థాయిలో నెలకొన్నాయి.

తాజాగా ఈ చిత్రం నుంచి ఓ అప్డేట్ ఇచ్చారు. ఈ మూవీని ఈ ఏడాది అక్టోబర్‌లో విడుదల చేయబోతోన్నట్టుగా ప్రకటించారు. ఈ మేరకు రిలీజ్ చేసిన పోస్టర్ అభిమానుల్ని ఆకట్టుకుంటోంది. ఈ పోస్టర్‌లో రజినీ స్టైల్, ఆ నవ్వు, ఆ గన్ను పట్టిన విధానం, ఆ హెయిర్ స్టైల్ అన్నీ కూడా అభిమానులను మెప్పించేలా ఉన్నాయి. ఇక ఈ చిత్రం అక్టోబర్‌లో విడుదల కానుందని ప్రకటించడంతో దసరా పోటీ రసవత్తరంగా మారేట్టు కనిపిస్తోంది. మంజు వారియర్, కిషోర్, రితికా సింగ్, దుషార విజయన్, జీఎం సుందర్, రోహిణి, అభిరామి, రావు రమేష్, రమేష్ తిలక్, రక్షణ, సాబుమోన్ అబుసమద్, సుప్రీత్ రెడ్డి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచందర్, డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ: ఎస్.ఆర్. కతీర్.



రజనీకాంత్



పార్వతీ తిరువోతు

విక్రమ్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ మూవీ "తంగలాన్". ఈ చిత్రాన్ని దర్శకుడు పా రంజిత్ రూపొందిస్తున్నారు. పార్వతీ తిరువోతు, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో యదార్థ ఘటనల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కుతోంది.

## వాస్తవ సంఘటనలతో తంగలాన్

ఈ సినిమాను పా రంజిత్ నీలమ్ ప్రొడక్షన్స్‌తో కలిసి ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. హీరోయిన్ పార్వతీ తిరువోతు బర్త్ డే సందర్భంగా ఇందులో ఆమె నటించిన గంగమ్మ క్యారెక్టర్ ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు. మహిళా రైతు క్యారెక్టర్‌లో ఆమె నటిస్తున్నట్టు ఫస్ట్ లుక్ ద్వారా తెలుస్తోంది.

ఈ సినిమాను త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకురాబోతున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన పోస్టర్స్, టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. విక్రమ్‌ను ఓ కొత్త నేపథ్యంలో, విభిన్నమైన క్యారెక్టర్‌లో దర్శకుడు పా.రంజిత్ చూపించబోతున్నారు.

'వాస్తవ సంఘటనల ఆధారంగా కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో సాగే ఈ చిత్రాన్ని దర్శకుడు పా.రంజిత్ అత్యంత సహజంగా తెరకెక్కిస్తున్నారు. కథానుగుణంగా ఇందులోని పాత్ర కోసం విక్రమ్ సైతం అందర్నీ ఆశ్చర్యపరిచేలా మేకోవర్ అయ్యారు' అని చిత్ర యూనిట్ తెలిపింది.

చియాన్ విక్రమ్, మాళవిక మోహనన్, పార్వతీ తిరువోతు, పశుపతి, హరికృష్ణన్, అన్బు దురై తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం - జీవీ ప్రకాష్ కుమార్, ఆర్ట్ - ఎస్ ఎస్ మూర్తి, ఎడిటింగ్ - ఆర్కే సెల్వ, స్టంట్స్ - స్టన్నర్ సామ్, నిర్మాత - కేఈ జ్ఞానవేల్ రాజా, దర్శకత్వం - పా రంజిత్.

## ఎమోషనల్ థ్రిల్లర్

విలక్షణ నటి వరలక్ష్మీ శరత్ కుమార్ ప్రధాన పాత్రలో నటించిన పాన్ ఇండియా సినిమా 'శబరి'. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ, కన్నడ భాషల్లో రూపొందింది. మహా మూవీస్ పతాకంపై మహేంద్రనాథ్ కూండ్ల నిర్మించారు. మహర్షి కూండ్ల చిత్ర సమర్పకులు. అనిల్ కాట్జ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. మే 3న సినిమా విడుదల చేయనున్నట్లు నిర్మాత తెలిపారు.

నిర్మాత మహేంద్రనాథ్ కూండ్ల మాట్లాడుతూ 'సరికొత్త కథాంశంతో తీసిన సినిమా 'శబరి'. కథ, కథనాలు ఇన్నోవేటివ్‌గా ఉంటాయి. స్ట్రాంగ్ ఎమోషనల్ థ్రిల్లర్ చిత్రమిది. వరలక్ష్మీ శరత్ కుమార్‌తో సినిమా చేయడం సంతోషంగా ఉంది. ఇప్పటి వరకు ఆమె నటించిన సినిమాలకు పూర్తి భిన్నంగా ఉంటుందీ సినిమా. ముఖ్యంగా ఆమె నటన 'వావ్' అనేలా ఉంటుంది. తెలుగు, తమిళ వెర్షన్స్ ఫస్ట్ కాపీ రెడీ అయ్యింది. అవుట్ పుట్ పట్ల మేం చాలా హ్యాపీగా ఉన్నాం. సినిమా మాకు అంతలా నచ్చింది. మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో పోస్ట్ ప్రొడక్షన్ పనులు సైతం పూర్తి అయ్యాయి. వరల్డ్ ఆఫ్ శబరి పేరుతో విడుదల చేసిన వీడియోకి మంచి రెస్పాన్స్ వచ్చింది. మే 3న పాన్ ఇండియా రిలీజ్ చేస్తున్నాం. అన్ని భాషలు, అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే చిత్రమిది' అని చెప్పారు. వరలక్ష్మీ శరత్ కుమార్, గణేష్ వెంకట్రామన్, శశాంక్, మైమ్ గోపి, సునయన, రాజశ్రీ నాయర్, మధునందన్, రషిక బాలి, వైవా రాఘవ, ప్రభు, భద్రం, కృష్ణతేజ, బిందు పగిడిమర్రి, ఆశ్రిత వేముగంటి, హర్షిని కోడూరు, అర్చన అనంత్, ప్రమోదిని బేబీ నివేక్ష, బేబీ కృతిక తదితరులు ఈ చిత్రంలో తారాగణం.



వరలక్ష్మీ శరత్‌కుమార్

ఈ చిత్రానికి రచనా సహకారం: సన్నీ నాగబాబు, పాటలు: రహమాన్, మిట్టపల్లి సురేందర్, ఫైట్స్: నందు - నూర్, కొరియోగ్రాఫర్స్: సుచిత్ర చంద్రబోస్ - రాజ్ కృష్ణ, ఆర్ట్ డైరెక్టర్: ఆశిష్ తేజ పూలాల, ఎడిటర్: ధర్మేంద్ర కాకరాల, డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ: రాహుల్ శ్రీవాత్సవ, నాని చమిడి శెట్టి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సీతారామరాజు మల్లెల, సంగీతం: గోపి సుందర్, సమర్పణ: మహర్షి కూండ్ల, కథ-మాటలు- స్క్రీన్‌ప్లే- దర్శకత్వం: అనిల్ కాట్జ్.

## అందమైన ప్రేమకథ

రక్షిత్ అట్లూరి, కోమలీ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'శశివదనే'. గౌరీ నాయుడు సమర్పణలో ఏజీ ఫిల్మ్ కంపెనీ, ఎస్.వి.ఎస్. స్టూడియోస్ బ్యానర్స్‌పై అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి గోడల నిర్మిస్తున్నారు.

గోదావరి నేపథ్యంలో లవ్, యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోన్న ఈ సినిమాకు సాయి మోహన్ ఉబ్బర దర్శకత్వం వహించారు. ఈనెల 19న ఈ చిత్రాన్ని భారీ ఎత్తున విడుదల చేస్తున్నారు.

ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన టీజర్, సాంగ్స్‌కు ప్రేక్షకుల నుంచి ఎక్స్‌ట్రార్డినరీ రెస్పాన్స్ వచ్చింది. దీంతో సినిమాపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో ఈ సినిమా నైజాం ఏరియా పంపిణీ హక్కులను ప్రముఖ సంస్థ మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ ఎల్ఎల్‌పి సంస్థ దక్కించుకుంది. రీసెంట్ టైమ్‌లో ఎన్నో విజయవంతమైన చిత్రాలను డిస్ట్రిబ్యూట్ చేసిన ఈ సంస్థ ఇప్పుడు ఈ సినిమాను డిస్ట్రిబ్యూట్ చేయనుండటంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. 'ఓ మంచి కాన్సెప్ట్‌తో రూపొందిన మా చిత్రాన్ని మైత్రి లాంటి సంస్థ పంపిణీ చేయడాన్ని తొలి విజయంగా భావిస్తున్నాం. గోదావరి నేపథ్యంలో సాగే అందమైన ప్రేమకథకి ప్రేక్షకులందరూ కచ్చితంగా కనెక్ట్ అవుతారు. ఇప్పటివరకు ఎన్నో ప్రేమకథలు వచ్చినప్పటికీ వాటితో పోలిస్తే ఇది చాలా భిన్నమైనది' అని మేకర్స్ తెలిపారు.



రక్షిత్ అట్లూరి, కోమలీ

శ్రీమన్, దీపక్ ప్రిన్స్, జబర్దస్త్ బాబీ, రంగస్థలం మహేష్ తదితరులు నటిస్తున్న ఈచిత్రానికి సమర్పణ - గౌరీ నాయుడు, సినిమాటోగ్రాఫర్ - శ్రీసాయి కుమార్ దారా, సంగీతం - శరవణ వాసుదేవన్.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.